ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
శుక్రవారం 15, నవంబరు 2024

పోలీసు శాఖ ప్రక్షాళన

దొనకొండ ఎస్సై వీఆర్‌కు

12 మంది ఏఎస్సైలు, 29మంది హెడ్ కానిస్టేబుళ్లు బదిలీ



ఒంగోలు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ ప్రక్షాళనకు ఎస్పీ ఏఆర్.దామోదర్ శ్రీకారం పలికారు. కార్యస్థానాలలో నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారిపై చర్యలు తీసుకున్నారు. దొనకొండ ఎస్ఐ విజయకుమార్ దర్శిలో నివాసం ఉంటూ దొనకొండలో పనిచేయడం ఏమిటి అంటూ వెంటనే అతనిని హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా వివిధ కారణాలతో 12మంది ఏఎస్ఐలు, 29మంది హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ గురువారం ఆదేశాలు జారీచేశారు. ఇప్పటివరకు ఐదేళ్ల పైబడిన వారికే స్థానచలనం ఉంటుందని భావించిన పోలీసు సిబ్బందికి ఇలా అకస్మాత్తుగా బదిలీలు జరగడం గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టు అయ్యింది. మొత్తం 41 మందిని బదిలీ చేశారు. కాగా ఎందుకు ఇలా జరిగింది అనే చర్చ శాఖలో ప్రారంభమైంది. ఈ బదిలీలలో ఒంగోలులో పనిచేసేవారు ఎక్కువమంది ఉన్నారు. వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. పశ్చిమ ప్రాంతంలో ఉన్న వారిని ఒంగోలు పరిసర ప్రాంతాలకు బదిలీ చేశారు.

నేడు పంచాయతీరాజ్ శాఖ
డైరెక్టర్ రాక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్‌శాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా పలు మండలాల్లో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం పది గంటలకు మద్దిపాడులో సీపీడబ్ల్యూ స్కీంను పరిశీలిస్తారు. అనంతరం సింగరాయకొండతో పాటు సోమరాజుపల్లిలో సీసీరోడ్లు, పలు అభివృద్ధి పనులను సందర్శిస్తారు. అలాగే టంగుటూరులో పలు పనులను పరిశీలిస్తారు. అనంతరం ఒంగోలు మండలం యరజర్లలో ఎస్‌డబ్ల్యూపీసీ పనులతో పాటు గ్రామ పంచాయతీని తనిఖీ చేస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు ఒంగోలులోని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు.

సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు

ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకరమైన, విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో ఇతరులను కించపరిచేలా అవమానకరమైన పోస్టులుపెడితే చర్యలు తప్పవన్నారు. వ్యక్తులపైన, సంస్థలపైన హేయమైన పదజాలంతో ట్రోలింగ్ చేసినా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిని సైబర్ సెల్ నిరంతరం గమనిస్తుంటోందన్నారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు.

సంక్షేమ రాజ్యం



సంక్షేమ రాజ్యం మళ్లీ మొదలైంది. గత ఐదేళ్లుగా వైసీపీ పాలకులు మూలన పడేసిన పథకాలకు తిరిగి జీవం రానుంది. ఐదు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు రోజుల క్రితం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పెద్దపీట వేసింది. గత ప్రభుత్వం నిలిపివేసిన పథకాలను తిరిగి ఆయా వర్గాలకు అందించే దిశగా నిధులు కేటాయింపులు చేసింది. వీటిని తక్షణమే అమల్లోకి తెచ్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. దీంతో ఆయా వర్గాలకు ఊరట లభించినట్లైంది. కొత్త పథకాలతో పాటు కొర్పొరేషన్ రుణాలతో ఎక్కువ మంది లబ్ధి పొందే అవకాశం ఉంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు పూర్వవైభవం

- బడుగుల చేయూతకు పాతరేసిన వైసీపీ
- పథకాల పునఃప్రారంభానికి భారీగా నిధులు కేటాయించిన కూటమి ప్రభుత్వం
- వాటి అమలుతో కళకళలాడనున్న అన్ని కార్పొరేషన్ కార్యాలయాలు
- 'జగనన్న' పేరు తొలగింపు.. అంబేడ్కర్ పేరుతో తిరిగి ప్రారంభం
- విదేశీ విద్య, బెస్టు అవైలబుల్ స్కూల్స్‌తో సహా పథకాల అమలు

ఒంగోలు నగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అటకెక్కిన సంక్షేమ పథకాలు మళ్లీ పట్టాలెక్కనున్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కళకళలాడిన కార్పొరేషన్లు 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక నిధులు లేక నీరసించిపోయాయి. రూపాయి అంటే రూపాయి కూడా జగన్.. బడుగుల కార్పొరేషన్లకు కేటాయించలేదు. దీంతోపాటు గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నింటినీ పక్కన పడేసింది. స్వయంఉపాధి, భూమి కొనుగోలు పథకాలు, విలువైన వాహన యూనిట్లు, బీసీ కార్పొరేషన్ ద్వారా చేతివృత్తుల వారికి ఆదరణ పథకం కింద అందించే పనిముట్లు, పడవలు, వలలు, ఎస్సీలకు భూమి కొనుగోలు చేసి ఇచ్చి వాటిని సాగు చేసుకునేందుకు బోర్లు, కరెంటు మోటార్లు అందించే పథకాలన్నీ వైసీపీ అధికారంలోకి రావటంతోనే నిలిపివేశారు. వీటితోపాటు సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ, వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖల ద్వారా అమలు జరిగే అంబేడ్కర్ విదేశీ విద్య, బెస్టు అవైలబుల్ స్కూళ్లు, ఎస్సీ, ఎస్టీలు, బీసీలకు ఇంటర్‌లో కార్పొరేట్ విద్యను అందించడం వంటి అనేక పథకాలను గత ప్రభుత్వం పూర్తిగా ఎత్తేసింది.

బీసీ సంక్షేమానికి పెద్దపీట

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. మొత్తం రూ.39,007 కోట్లు కేటాయించింది.

కేటాయించిన నిధులు
బీసీ కార్పొరేషన్‌కు రూ.896.79 కోట్లు
బీసీ ఏ కార్పొరేషన్‌కు రూ.276.24 కోట్లు
బీసీ బీ కార్పొరేషన్‌కు రూ.243.01 కోట్లు
బీసీ డీ కార్పొరేషన్‌కు రూ.284.82 కోట్లు
బీసీ ఈ కార్పొరేషన్‌కు రూ.92.72 కోట్లు

స్వయం ఉపాధికి రూ.3వేల కోట్లు

ఇటీవలి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బ్యాంకుల నుంచి రుణం పుట్టలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని కార్పొరేషన్ల నుంచి ఏటా వార్షిక రుణ ప్రణాళికను రూపొందించి ఆ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రుణాలు అందజేశారు. ఇందులో ఎక్కువగా బ్యాంకు లింకేజీ రుణాలు ఉండేవి. ఏటా జిల్లాలో వేలాది మందికి బ్యాంకుల ద్వారా రుణాలు అందేవి. వాటితో బడుగులు స్వయంఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకునే వారు. దళిత వర్గాలకు చెందిన లబ్ధిదారుడు యూనిట్ ఏర్పాటు చేసుకుంటే అందులో సగం కార్పొరేషన్లు భరించగా మిగిలిన సగం బ్యాంకులు రుణంగా ఇచ్చేవి. గత ఐదేళ్లలో కార్పొరేషన్లకు ఒక్క ఏడాది కూడా వార్షిక రుణ ప్రణాళికను తయారే చేయలేదు. దీంతో కార్పొరేషన్లు బోర్డులకే పరిమితం అయిపోయాయి. వైసీపీ హయాంలో ఒక్కరంటే ఒక్కరికి కూడా రుణం అందనేలేదు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు రూ. 3వేల కోట్లకు పైగా కేటాయింపులు చేసింది. ఇందులో రూ.1,571 కోట్లు రాష్ట్రప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా ఇవ్వనుండగా మిగిలిన మొత్తం బ్యాంకులు రుణంగా లబ్ధిదారులకు అందజేయనున్నారు. వీటితో వందలాది స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటవుతాయి.

ఈ నిధులతో కొద్ది రోజుల్లోనే అనేక పథకాలు అమలు కానున్నాయి. స్వయం ఉపాధి పథకాలతోపాటు కార్పొరేషన్ల ద్వారా నేరుగా అందించే పలు రుణాలు వారికి అందనున్నాయి.

ఎస్సీల సంక్షేమానికి రూ.18,497 కోట్లు

రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.18,497 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో గతంలో నిలిపివేసిన అనేక పథకాలను

మిగతా 6లో...

ముసురు వాన

- తూర్పు, దక్షిణ ప్రాంతంలో భారీ వర్షం, పశ్చిమాన జల్లులు
- సాగుకు బాగా ఉపయుక్తం
- సాధారణ జనజీవనానికి ఆటంకం


ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

ఒంగోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాన ముసురు పట్టింది. నాలుగు రోజులుగా జల్లులు పడుతుండగా మంగళవారం నుంచి అధికమైంది. ప్రత్యేకించి జిల్లా తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో భారీవర్షమే ఈ రెండు రోజుల్లో కురిసింది. పశ్చిమ ప్రాంతంలో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. మంగళవారం నుంచి గురువారం ఉదయానికి గడిచిన 48 గంటల్లో జిల్లాలో సగటున 23.8మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే గరిష్ఠంగా సింగరాయకొండ మండలంలో ఏకంగా 100.60 మి.మీ నమోదు కాగా ఒంగోలు 84.41, కొత్తపట్నం 82.2, జరుగుమల్లిలో 74.2, చీమకుర్తిలో 61.4, సంతనూతలపాడులో 54.4, పొన్నలూరులో 48.40, పంగులూరులో 41.4, కొండపిలో 39.0, పొదిలిలో 37.4 మి.మీ పడింది. అలా ఒంగోలు, కొండపి, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాల పరిధిలో భారీవర్షమే కురవగా ఇతర ప్రాంతాలలో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. కాగా ప్రస్తుత వర్షాలు అత్యధిక ప్రాంతాలలో సాగుకు ఉపకరించనున్నాయి.

రబీ పైర్లకు మేలు

ప్రస్తుతం పొలంలో ఉన్న పంటలకు కొద్దిచోట్ల మినహా ఎక్కువశాతం మేలు చేయనుండగా రబీలో ముమ్మరంగా సాగు చేసే పొగాకు, శనగ, వరి, మిర్చి నాట్లకు బాగా ఉపయోగపడతాయని రైతాంగం చెప్తున్నారు. అయితే ఇంకా ఎక్కువ రోజులు ఇలా ముసురు పట్టి కురిస్తే లోతట్టు ప్రాంతాలలో సాగులో ఉన్న పంటలకు కాస్త దెబ్బతగలడంతో పాటు పంటల సాగు ఆలస్యం అవుతుందన్న ఆందోళన కూడా వారిలో వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉండగా ముసురు పట్టి కురుస్తున్న వాన సాధారణ జనజీవనానికి కొంత ఆటంకంగా కలిగించింది. మంగళవారం నుంచి ప్రారంభమైన జల్లులు గురువారం పగటిపూట కూడా తెరపి లేకుండానే పడుతూనే ఉన్నాయి. కొద్దిసేపు తెరపి ఇవ్వడం, మళ్లీ మబ్బులు కమ్మి జల్లులు పడుతుండటంతో ప్రజలు రోజువారీ పనులకు ఇబ్బందిపడ్డారు. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో చిరువ్యాపారులు, వీధి వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఎక్కువ ఇబ్బందిపడ్డారు. అలాగే ఒంగోలు, సింగరాయకొండ, టంగుటూరుతోపాటు పలు ఇతర మండలకేంద్రాలు, పెద్దగ్రామాలలో రోడ్లు, డ్రెయిన్లు ఏకమై మురుగు పారింది.


పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు రాంబాబు

సూపర్ మాస్టార్

వ్యవసాయ కుటుంబం నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎదిగిన అర్రిబోయిన

22 ఏళ్ల సర్వీసులో మూడు పాఠశాలల్లో విద్యా బోధన

7


పీడీసీసీబీ కార్యాలయం

తవ్విన కొద్దీ అక్రమాలు

- పీడీసీసీ బ్యాంకులో ఇంకా కొలిక్కి రాని త్రిసభ్య కమిటీ విచారణ
- నిత్యం కలెక్టర్‌కు అందుతున్న ఫిర్యాదులు
- కొన్ని అంశాలలో కమిటీకి సహకరించని సిబ్బంది

ఒంగోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీ చేపట్టిన విచారణ ఇంకా కొనసాగుతోంది. రెండు, మూడు రోజుల్లో విచారణ పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రిసభ్య కమిటీని ఆదేశించారు. తదనుగుణంగా ఈనెల 6న విచారణను వారు ప్రారంభించారు. తొమ్మిది రోజులు గడిచినా ఇంకా వారి విచారణ కొలిక్కి రాలేదు. గురువారం కూడా విచారణ సాగింది. తొలుత కలెక్టర్‌కు అంతకు ముందు ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై వారు ప్రాథమిక విచారణ చేపట్టారు. అయితే విచారణ జరుగుతుందన్న సమాచారంతో పలువురు మరికొన్ని అంశాలపై ఫిర్యాదు చేశారు. వాటిని కూడా పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. తాజాగా

నిబంధనలకు విరుద్ధంగా..

ప్రధానంగా కొందరు ఉద్యోగులకు లబ్ధిచేకూరేలా పోస్టింగులు, ఉద్యోగోన్నతులు, అలాగే వివిధ బ్యాంకు బ్రాంచిల ఆధునీకీకరణ పేరుతో చేసిన పనులకు, సీసీ కెమెరాల కొనుగోలు, ఇతరత్రా ఆర్థిక లావాదేవీల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా కూడా చేసినట్లు వారి విచారణలో గుర్తించినట్లు సమాచారం. ఆయా అంశాలకు సంబంధించిన విచారణలో కొన్ని విషయాలపై స్పష్టత రావాల్సి ఉండటంతో అవి కూడా వచ్చాక ఒకటి, రెండు రోజుల్లో విచారణ పూర్తిచేసి నివేదికను కలెక్టర్‌కు కమిటీ తరఫున డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు అందజేస్తారని తెలుస్తోంది. కాగా తొలుత బ్యాంకుపై ఫిర్యాదులపై విచారణ విషయంలో కలెక్టర్‌ను సహకారశాఖ అధికారులు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయగా ప్రస్తుతం కూడా వారితోపాటు బ్యాంకులోని కొందరు ఉద్యోగులు కూడా విచారణాధికారిని తప్పుదోవ పట్టించే అలాగే ఒత్తిడి తెచ్చే చర్యలకు పాల్పడుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ విచారణ కమిటీకి నేతృత్వం వహిస్తున్న లోకేశ్వరరావు గట్టిగానే ఫైళ్లు పరిశీలిస్తుండటంతో అక్రమార్కులు ఆందోళన చెందుతున్నారు.

మిగతా 6లో...

ఉద్యోగుల పోస్టింగ్‌లు కొలిక్కి

నేడు, రేపో ఆర్డర్లు ఇచ్చే అవకాశం

6

కలలను సాకారం చేసుకోవాలి



- ఆహ్లాదకరమైన వాతావరణంలో పెరగాలి
- మూడో తరగతిలోనే ఐఏఎస్ కావాలని సమాధానమిచ్చా
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకరమైన వాతావరణంలో పెరిగి తమ కలలను సాకారం చేసుకునే స్వేచ్ఛను ప్రతి బిడ్డకూ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వారంరోజులపాటు నిర్వహించనున్న బాలోత్సవాలను గురువారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలల స్వేచ్ఛకు ప్రతీకగా చిన్నారుల చేత బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, బాలల హక్కుల పరిరక్షణ కోసం తమవంతు బాధ్యత వహిస్తామని కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ బాల కార్మికులు లేని, బాల్యవివాహ రహిత, అక్షర చైతన్య, ఆరోగ్య ప్రదమైన జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సంతోష,


గాంధీ, నెహ్రూ, శాస్త్రిల వేషధారణలో చిన్నారులతో కలెక్టర్

మిగతా 6లో...


మద్దిపాడులో చిన్నారుల వేషధారణలు

కలలను సాకారం చేసుకోవాలి

(5వపేజీ తరువాయి)

ఆరోగ్య, సురక్షితమైన బాల్యాన్ని వారికి అందించడం కోసం వివిధ శాఖల అధికారులతో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను నియమించామన్నారు. బాలలకు సంబంధించిన అన్ని పథకాలను సమన్వయం చేస్తూ మెరుగైన ప్రయోజనాలను అందించేలా జిల్లా యంత్రాంగం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. తాను మూడో తరగతిలో ఉన్నప్పుడు తమ పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో పెద్దయ్యాక ఏమవుతావు? అని ఉపాధ్యాయులు అడిగినప్పుడు ఐఏఎస్ అవుతానని తాను సమాధానం చెప్పినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఆ దిశగా ఆలోచించడం ప్రారంభించానని పేర్కొన్నారు. సంకల్పబలంతో దేనినైనా సాధించవచ్చని తెలిపారు. ప్రతి బిడ్డకు ఈ విధమైన మద్దతు సహాయ, సహకారాలు అందరం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కే.శ్యామ్‌బాబు మాట్లాడుతూ బాలల హక్కుల కోసం ఉన్న చట్టాలపై అన్నివర్గాలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆ దిశగా న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. ఏదైనా సహాయం అవసరమైతే 15100 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. సీడబ్ల్యూసీ ఛైర్మన్ వీ. రామాంజనేయులు మాట్లాడుతూ బాల్యం బంగారుమయం అయ్యేలా, సర్వతోముఖాభివృద్ధి సాధించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీఆర్వో చిన ఓబులేషు మాట్లాడుతూ బాలల సంక్షేమం కోసం వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ బంగారు బాల్యం కార్యక్రమానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, బంగారు బాల్యం నోడల్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు కిరణ్‌కుమార్, సామా సుబ్బారావు, చిరంజీవి, డాక్టర్ సురేషకుమార్, సైమన్ విక్టర్, వసుంధర, రవికుమార్, అంజల, నారాయణ, అర్చన, దినేష్‌కుమార్, సార్డ్స్, రిలయన్స్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సునీల్‌కుమార్, బాబురావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బంగారు బాల్యాన్ని సంరక్షించాలి

బంగారు బాల్యాన్ని సంరక్షించడంతోపాటు బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఆ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలలే రేపటి మన దేశ భవిష్యత్, బంగారు బాల్యం విలువైందన్నారు. విద్య ప్రతి ఒక్కరికి చేరాలని, బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

- మంత్రి స్వామి పిలుపు

తవ్విన కొద్దీ అక్రమాలు

(5వపేజీ తరువాయి)

సోమవారం గ్రీవెన్స్‌లోనూ అనంతరం కలెక్టర్‌కు విడిగాను మరి కొందరు బ్యాంకు ఉద్యోగులే తమ ఉద్యోగోన్నతులు ఇతరత్రా అంశాలపై ఫిర్యాదు చేశారు. అలా విచారణ ప్రారంభించాక కూడా భారీగా ఫిర్యాదులు వస్తుండటంతో కలెక్టర్ ఆదేశాలతో అధికారుల కమిటీ వాటిని కూడా పరిశీలన చేస్తోంది.

లోతుగా పరిశీలన

తొలుత రెండు, మూడు రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అనుకున్నా ప్రస్తుతం తొమ్మిది రోజులైనా ఇంకా కొన్ని పరిశీలన చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా విచారణ కమిటీకి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు కలెక్టర్ సూచనలతో ఒకింత లోతుగానే పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. దీంతో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. తవ్విన కొద్దీ అక్రమాలు బహిర్గతం అన్న చందంగా విచారణ సాగుతున్నట్లు తెలుస్తుండగా విభిన్నవర్గాల లబ్ధిదారులకు ఇచ్చిన రుణాలు ఇతరత్రా అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సిబ్బంది విచారణ కమిటీకి ఇవ్వడంలో జాప్యం చేస్తున్నట్లు తెలిసింది. ఇతర పలు ఫైళ్ల విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్నట్లు సమాచారం. అయితే అన్ని ఫిర్యాదులపైనా సదరు విచారణాధికారి ఒకటికి రెండు, మూడుసార్లు సంబంధిత బ్యాంకు అధికారులను వివరణలను అడగడం, ఫైళ్లు చూపాలని కోరడంతో చేసేదేమీ లేక అందజేస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలో ఇప్పటివరకు పలు అవకతవకలు, అక్రమాలు జరిగాయని కమిటీ ఛైర్మన్ గుర్తించినట్లు తెలిసింది.

డిప్యూటీ స్పీకర్‌కు ఏలూరి ఆత్మీయ అభినందనలు

పర్చూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన రఘురామకృష్ణరాజు (ఆర్‌ఆర్‌ఆర్)కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఆయన రఘురామను ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని అభినందనలు తెలిపారు.



రఘురామ కృష్ణరాజుతో ఎమ్మెల్యే ఏలూరి ఆత్మీయ పలకరింపు

పంటలకు మద్దతు ధర కల్పించాలి

26న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలి

కిసాన్ మోర్చారాష్ట్ర అధ్యక్షుడు శోభనాద్రీశ్వరరావు పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అన్నదాతలు పండిస్తున్న పంటలకు డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు మద్దతుధరలు ప్రకటించాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన ఆరు సంవత్సరాలుగా పంటలకు మద్దతు ధర ప్రకటించాలని అనేక రూపాలలో ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో జరిగిన లక్షలాది మంది రైతుల మహాపోరాటాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఉత్తర ప్రదేశ్ ఎన్నికలను దృష్టిలోపెట్టుకొని ప్రధానిమోదీ దేశ వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు తెచ్చిన మూడు నల్లచట్టాలను వెనిక్కి తీసుకోవడమేకాకుండా రైతులకు క్షమాపణలు చెప్పారన్నారు. ఎన్నికల అనంతరం మోదీ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. తిరిగి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేందుకు కుట్ర పన్నాడని మండిపడ్డారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ, పట్టణ పేదలు, కార్మికులు, ప్రజాసంఘాలతో కలెక్టర్ కార్యాలయాల ఎదుట మహాధర్నాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రైతాంగాన్ని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బరితెగించి అడ్డగోలుగా దేశ సంపదను కొల్లగొట్టి సంపన్న వర్గాలకు దోచిపెడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ కొల్లా రాజమోహన్, వడ్డే హనుమారెడ్డి, పమిడి వెంకట్రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, జి. శ్రీనివాసులు, ఎంఎస్ సాయి, పరిటాల కోటేశ్వరరావు, చావలి సుధాకర్, బి.సుబ్బారావు, వి బాలకోటయ్య, ఉబ్బా ఆదిలక్ష్మి, ఎస్‌డీ సర్దార్, పెంట్యాల హనుమంతరావు, జే జయంతిబాబు, నాంచార్లు, ఉబ్బా కోటేశ్వరరావు, శ్రీరామ్ శ్రీనివాసరావు, మండవ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. అనంతరం ఈనెల 26వతేదీన జరగనున్నమహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.



మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘాల నాయకులు

విజ్ఞానానికి మార్గదర్శకం పుస్తక పఠనం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ఒంగోలు(కల్చరల్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తకాలను చదవడం ద్వారా ఎంతో విజ్ఞానాన్ని సంపాదించవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా ముందుగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన వారోత్సవాల ప్రారంభ సభలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతి ఒక్కరూ పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని చెప్పారు. ఎందరో మహానుభావులు గ్రంథాలయాల్లో పుస్తకాలను చదివి ఉన్నత స్థానానికి చేరుకున్నారని, ఇక్కడ సుమారు 6 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని విద్యార్థులు, నిరుద్యోగులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మంచి పుస్తకం మంచి స్నేహితునితో సమానమని చెప్పారు. అయితే ప్రస్తుతం గ్రంథాలయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోతుందని, అందువల్ల వాటి ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని కోరారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు లక్ష్మానాయక్‌లు మాట్లాడుతూ పుస్తకాలను చదవడం ద్వారా విచక్షణ జ్ఞానం కలుగుతుందని, పలు రకాల పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా ఎన్నో సామాజిక అంశాల పట్ల అవగాహన కలుగుతుందని చెప్పారు. కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మక, పోటీతత్వాన్ని పెంపొందించే విధంగా పలు పోటీలు, సెమినార్లు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను కలెక్టర్ అన్సారియా ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ, విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగా వారోత్సవాల్లో భాగంగా జూనియర్స్, సీనియర్స్ విభాగంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రాలు, జాతీయ నాయకుల చిత్రాలతో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. మధ్యాహ్నం క్లాసికల్, జానపద నృత్యాలతో డాన్స్ పోటీలు, సాయంత్రం 5 గంటల నుంచి 7వ తరగతిలోపు బాలబాలికలకు ఫ్యాన్సీ డ్రస్ పోటీలు నిర్వహించారు. డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



కాంట్రాక్టర్లతో సమావేశమైన కమిషనర్, మేయర్

నగరంలో రూ.7.7 కోట్లతో అభివృద్ధి

- త్వరలో పనులకు టెండర్లు
- కమిషనర్ వెంకటేశ్వరరావు
- కాంట్రాక్టర్లు, మేయర్‌తో కలిసి సమీక్ష

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర అభివృద్ధి కోసం రూ. 7.7 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోమేయర్ గంగాడ సుజాతతో కలిసి కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి రూ.3.60కోట్లు, ఎన్‌కాప్ నిధుల నుంచి రూ.4.10 కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రతిపాదించినట్లు తెలిపారు. వాటిని చేపట్టేందుకు ఔత్సాహిక కాంట్రాక్టర్లు ముందుకు రావాలని కోరారు.

ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు తమ సమ్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి కోట్ల రూపాయలలో బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వాటితోపాటు ఈఎండీలు ఇప్పించాలని, కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్లు ఉండేందుకు ఒక రూము కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రూము విషయమై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కాంట్రాక్టర్లకు ఈఎండీలు వెంటనే చెల్లించాలని ఇంజనీరింగ్, అకౌంట్స్ విభాగం అధికారులకు ఆదేశించారు. అలాగే జేటీవో సెక్షన్ నుంచి కూడా ఫైల్స్ నిర్దేశించి గడువులోపు పూర్తి చేసేలా చూడాలని ఎంఈ చంద్రయ్యను ఆదేశించారు. సమావేశంలో డీఈలు పద్మజ, గోపాల్, కాంట్రాక్టర్లు పోతంశెట్టి పవన్‌కుమార్, అడపా రాము, దండూరి కోటేశ్వరరావు, మాధవ, కృష్ణారెడ్డి, సుధాకర్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల్లో కలవరం

- అవినీతి సిబ్బంది తొలగింపునకు చర్యలు
- విచారణలో కొత్తగా నకిలీ ఆర్పీలు వెలుగులోకి..

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మెప్మాలో అవినీతి రిసోర్స్‌పర్సన్(ఆర్పీ)లపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంతో కలవరం మొదలైంది. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మెప్మాలో మెక్కుడు' కథనంతో కొందరు అవినీతి ఆర్పీల్లో భయం మొదలైంది. అయితే ఇందుకు సంబంధించి పీడీ రవికుమార్ విచారణ మొదలు పెట్టినట్లు తెలిసింది. ఇదిలా ఉంచితే.. విచారణలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల కాలంలో పెళ్లూరులో రెండు నకిలీ గ్రూపులు కెనరాబ్యాంకులో రుణాలు పొందినట్లు సమాచారం. దీంతో మెప్మా అధికారులు దీనిపై దృష్టి సారించగా, సంబంధిత ఆర్పీ ఈ వ్యవహారంలో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలిసింది. మరోవైపు అసలు మెప్మాకు సంబంధం లేని కొందరు ప్రైవేటు మహిళలు ఆర్పీలుగా చెలామణి అయ్యారు. స్థానిక శర్మాకాలేజీ వెనుక సంజయ్ గాంధీ కాలనీకి చెందిన ఓ మహిళ తాను ఆర్పీనంటూ పొదుపు గ్రూపులను బురిడీ చేసి భారీగా దోచేయగా, భాగ్యనగర్‌కు చెందిన మరో మహిళ ఆర్పీగా గత రెండేళ్ళుగా చెలామణి అవుతూ కోట్లు రూపాయాలలో దోచేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంచితే దారవారితోటలో గతంలో ఆర్పీగా పనిచేసి ఓ ఉద్యోగి అవినీతి ఆరోపణలపై ఉద్యోగం నుంచి తొలగించారు. అదే స్థానంలో మరో యువతి తాను ఆర్పీ నంటూ ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే పొదుపు గ్రూపులతో మమేకమై రుణాల మంజూరులో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అయితే అవినీతి ఆర్పీలపై పీడీ రవికుమార్ సీరియస్‌గా దృష్టి సారించారు. బ్యాంకు మేనేజర్లతో బోగస్ గ్రూపుల గురించి చర్చించారు. ఇప్పటికే నకిలీ ఆర్పీలుగా చెలామణి అవుతూ పొదుపు సంఘాలను మోసం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇదే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులతోపాటు, మిషన్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నారు.



వాడరేవు జిల్లా పరిషత్ పాఠశాలను చుట్టుముట్టిన వర్షపు నీరు



జలమయమైన ప్రధాన రహదారి

చీరాలలో కుండపోత

- వాగులను తలపిస్తున్న రోడ్లు
- వాడరేవు హైస్కూల్ జలమయం
- భయాందోళనలో మొక్కజొన్నరైతులు

చీరాలటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా చీరాల మండల పరిధిలో కుండపోత వర్షం పడుతోంది. ఈక్రమంలో ప్రధాన రహదారులు సైతం వాగులను తలపిస్తున్నాయి. ఇదిలావుంటే ఏకంగా వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కూడా వర్షపు నీరు చుట్టుముట్టింది. ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో పాఠశాల జలమయమైంది. దీంతో ఉపాధ్యాయులు, చిన్నారులు నానా అవస్థలు పడ్డారు. కొన్ని గంటలపాటు రోడ్లు సైతం కనుచూపుమేర కనబడిన దాఖలాలు లేవు. ఈపూరుపాలెం ఎస్‌బీఐ సెంటర్, మార్కెట్ సెంటర్‌లతో పాటు పలు గృహాల్లో కూడా మండల పరిధిలో నీళ్లు ఇళ్లల్లోకి చేరాయి. రహదారులు, డ్రెయిన్‌లు నిండడంతో వాహనదారుల ప్రయాణం నరకప్రాయంగా మారింది. మరోవైపు మండల పరిధిలో గతవారం రోజుల్లో అధిక సంఖ్యలోనే రైతులు మొక్కజొన్న చల్లారు. పొలాల్లో నీరు నిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే మొక్క దశలో ఉన్నసాగుకు ఇబ్బంది ఉండదని, దాదాపుగా 15 రోజుల్లోని సాగుకు ఇప్పటివరకు పడిన వర్షంతో పెద్దగా ఇబ్బంది ఉండదని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.



సీపీఎం నగర మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజావ్యతిరేక విధానాలు వీడకుంటే పోరాడతాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు వీడకపోతే ప్రజలతో కలిసి వామపక్షాలు పోరాడుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సీపీఎం నగర 13వ మహాసభలు ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో నగర కార్యదర్శి జి.రమేష్‌న జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు భారం రూ.17వేల కోట్లు ప్రజలపై వేయనున్నారని ఆరోపించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ఈనెల, వచ్చే నెలలో ప్రజలపై ఈ భారం పడనుందని, కేంద్ర చెప్పిన విద్యుత్ సవరణలో భాగంగానే ప్రజలపై ఈ భారం పడుతుందని తెలిపారు. ఎన్నికల్లో గెలిస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు ఇప్పుడు విద్యుత్ భారాలు వేసేందుకు సిద్ధం అవుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల విధానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుకను ప్రజలకు ఇస్తామని ప్రభుత్వం మోసం చేసిందని, ఇసుక మాఫియా వచ్చేసి వారి ఇష్టానుసారం అమ్మేసుకుంటున్నారని విమర్శించారు. నాణ్యమైన మద్యం, చౌక మద్యం అంటూ ప్రజలకు ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారో తెలిపాలని కోరారు. ప్రజలు నిత్యావసర ధరలు తగ్గించాలని అడుగుతుంటే మద్యం ధరలు తగ్గించామని ప్రభుత్వం చెబుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నా భర్తీ చేయడం లేదన్నారు. రాజకీయ నిరుద్యోగులకు మాత్రం నామినేటెడ్ పదవులు ఇచ్చి భర్తీ చేస్తున్నారని, రాష్ట్రంలో మహిళలు, దళితులపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ నెలరోజులుగా నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని చెప్పారు. డీఎస్సీ వాయిదా పడిందని, గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులు అగమ్య గోచరంగా మారాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, దామా శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, ఎస్‌డీ.హుస్సేన్, తంగిరాల మహేష్, కొర్నెపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం

(5వపేజీ తరువాయి)

పునరుద్ధరించనున్నారు. ఉదాహరణకు వైసీపీ ప్రభుత్వం దళిత విద్యార్థుల చదువులను అర్ధంతరంగా ఆపేస్తూ బెస్ట్ అ వైలబుల్ స్కూల్స్ పథకాన్ని అధికారంలోకి రావటంతోనే వైసీపీ నిలిపివేసింది. దీంతో ఈ పథకం కింద ప్రయివేట్ పాఠశాల్లో ప్రభుత్వ ఆర్థిక సహాయంతో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. అలాంటి వారికి ఇప్పుడు మంచిరోజులు వచ్చాయి. ఎస్సీ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా కూటమి ప్రభుత్వం భారీగానే నిధులను కేటాయించింది. ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేద్కర్ విదేశీ విద్య పథకాలు ఇక అర్హులైన ఎస్సీలందరికీ అందనున్నాయి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు వేలాది మంది నిరుద్యోగులకు అందనున్నాయి. వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేసిన ఎన్ఎస్‌సీఎఫ్‌డీసీ పథకం తిరిగి అమలు కానుంది. కేంద్రప్రభుత్వ నిధులతో, బ్యాంకులతో సంబంధం లేకుండా యూనిట్లను అందజేసే ఈ పథకం కింద యూనిట్లను ఈ ఏడాదిలోనే లబ్ధిదారులకు అందజేయనున్నారు. వీటితో పాటు గిరిజన సంక్షేమానికి రూ.7,557 కోట్లు, మైనార్టీల సంక్షేమానికి రూ.4,376కోట్లు కేటాయించారు. దీంతో ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా కూడా స్వయం ఉపాధి యూనిట్లకు వందలాది మంది నిరుద్యోగులకు జిల్లాలో రుణాలు అందనున్నాయి. మొత్తంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని కార్పొరేషన్లకు పూర్వవైభవం తేనుంది.

37 మందికి నోటీసులు.. 107 కేసులు

- రూ.24లక్షల అపరాధ రుసుం వసూలు
- మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : అధికారులకు కనిపించని ఇసుక తవ్వకాలు, రవాణా అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 3వ తేదీన ప్రచురితమైన కథనంపై మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ స్పందించారు. ఆ నేపథ్యంలో తమ కార్యాలయం నోటీస్‌కు వచ్చిన అన్ని ప్రదేశాలను తనిఖీ చేసి, అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడిన వ్యక్తులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 37 మంది వ్యక్తులకు నోటీసులు ఇచ్చామన్నారు. కార్యాలయ పరిధిలో ఇప్పటి వరకు 107 కేసులలో రూ.24 లక్షలు అపరాధ రుసుము వసూలు చేసినట్లు వివరించారు. రెవెన్యూ, గనులు, భూగర్భశాఖ సిబ్బంది ఉమ్మడిగా నిర్వహించిన తనిఖీలలో అక్రమ క్వారీయింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసి వేటపాలెం ఎస్‌హెచ్‌వోకు అప్పగించామన్నారు. ఆ క్రమంలో సంబంధీకులకు నోటీసులు జారీ చేశామన్నారు. నిర్ణీత అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేపడితే చర్యలు తప్పవని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగుల బదిలీల ఆర్డర్లు కొలిక్కి

- నేడు, రేపో ఇచ్చే అవకాశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ పరిధిలో ఇటీవల జరిగిన గ్రేడ్-5, 6 (సచివాలయం) ఉద్యోగుల బదిలీల ఆర్డర్ల వ్యవహారం కొలిక్కి వచ్చింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు గాలిలో ఉన్న 56 మంది ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు గురువారం రాత్రి జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు నేతృత్వంలో జిల్లా పంచాయతీ అధికారులు సమావేశమయ్యారు. ప్రస్తుతం గాలిలో ఉన్న జాబితాతోపాటు జిల్లాలో సచివాలయాల్లో ఖాళీలపై చర్చించారు. ప్రస్తుతం ఖాళీగా పోస్టుల్లో వారికి ఉద్యోగ ఆర్డర్లు ఇవ్వనున్నట్లు సమాచారం. అందుకు సంబంధించి కసరత్తు పూర్తికావడంతో ఆ జాబితాను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఇవ్వనున్నారు. కలెక్టర్ నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఆ ప్రక్రియ శుక్ర, శనివారాల్లో ముగియనుంది.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు అడవీధిపాలెం విద్యార్థిని ఎంపిక

చినగంజాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దేవండ్ల యామిని రాష్ట్ర కబడ్డీ బాలికల అండర్-14 జట్టుకు ఎంపికైంది. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు తరపున పాల్గొన్నట్లు పాఠశాల హెచ్‌ఎం ఏ.మాధవీలత గురువారం తెలిపారు. అండర్-14 బాలికల కబడ్డీ జట్టులో యామిని ప్రతిభచాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. యామిని 9వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం జాతీయ స్థాయిలో జరిగే రాష్ట్ర కబడ్డీ జట్టులో పాల్గొననున్నట్లు పాఠశాల పీడీ బి.లలిత తెలిపారు. యామినిని హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.



యామిని


సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాంబాబు

మానవత్వం అతని గుణం.. సేవాతత్పరత అతని సుగుణం. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం అతని వృత్తి. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండటం అతని వ్యక్తిత్వం. నిరాడంబర జీవన విధానం అతని ఆభరణం. పుట్టింది సాధారణ వ్యవసాయ కుటుంబంలోనైనా నిరుపేదలకు తోడ్పాటు అందించడంలో ఆయన ఎప్పుడూ ధనికుడిగానే ఉంటారు. ఆయనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు అర్రిబోయిన రాంబాబు. పనిచేసిన ప్రతిచోటా మెరుగైన విద్యార్థులను తయారు చేయడం, నలుగురి మెప్పు పొందడం, పది మంది దాతలను సమీకరించడం, చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అతనికి వెన్నతోపెట్టిన 'విద్య'. 22 ఏళ్ల వృత్తి జీవితంలో పని చేసిన ప్రతిచోటా అతని పంథా ఇదే. అతని సేవకు మెచ్చి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో ప్రత్యేక కథనం..

విద్యతోపాటు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా



విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతోపాటు, పేదలకు పలు సేవా కార్యక్రమాల ద్వారా వారికి అండగా నిలవడమే ధ్యేయం. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు నా మీద మరింత బాధ్యతను పెంచింది. దీంతో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడానికి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తా.

- అర్రిబోయిన రాంబాబు, ఉపాధ్యాయుడు

సూపర్ మాస్టార్!

వ్యవసాయ కుటుంబం నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎదిగిన అర్రిబోయిన

- 22 ఏళ్ల సర్వీసులో మూడు పాఠశాలల్లో విద్యా బోధన
- పనిచేసిన ప్రతిచోటా విద్యార్థుల పెంపునకు విశేషకృషి
- విద్యార్థులతో మమేకం, దాతలను పోగేయడం...
- చదువుతోపాటు సేవా కార్యక్రమాలతో పేదలకు అండ
- స్ఫూర్తిగా నిలుస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

సింగరాయకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమరాజుపల్లికి చెందిన అర్రిబోయిన రాంబాబు సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యను, సింగరాయకొండ ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ విద్యను అభ్యసించారు. ఇంటర్, డిగ్రీ కావలి జవహర్ భారతి కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం ఉపాధ్యాయ శిక్షణను మదనపల్లెలో, పీజీ తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. 2002లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. తన 22 ఏళ్ల సర్వీసులో ఇప్పటి వరకూ మూడు పాఠశాలల్లో పనిచేశారు. 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. విద్యారంగంలో పాటు పలు సాంఘిక, సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు సాయం అందిస్తున్న ఉపాధ్యాయుడు అర్రిబోయిన రాంబాబును రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు ప్రదానం చేసింది. గత సోమవారం విజయవాడలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతులమీదగా అందుకున్నారు.


విద్యార్థులకు మొక్కలు అందిస్తూ


దాతల సహకారంతో పాదరక్షలు అందిస్తున్న రాంబాబు

విద్యారంగంలో విశేష కృషి

- 2002 ఏడాదిలో తొలుత జిల్లాలోని పీసీపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెం పాఠశాల ఉపాధ్యాయుడి విధుల్లో చేరారు. పాఠశాలలో విద్యార్థుల పెంపునకు కృషిచేయడంతో పాటు, తను పనిచేసిన 8 ఏళ్లలో పాఠశాల ఆవరణలో 200 మొక్కలను నాటించారు.
- ఉలవపాడు మండలం చాకిచర్ల పంచాయతీ పరిధిలో సుబ్బరాయుడు సత్రంలోని ప్రాథమిక పాఠశాలలో తన విధుల్లో చేరినపుడు 11 మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారు. గ్రామంలోని కాలనీల్లో తిరిగి విద్యార్థుల సంఖ్యను 44కు పెంచారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలకు రెండో ఉపాధ్యాయుడిని ప్రభుత్వం కేటాయించింది.
- 2017లో సింగరాయకొండ మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధి మల్లికార్జున్ నగర్ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు. గిరిజన కాలనీలో విద్యార్థుల సంఖ్య పెంచి ప్రతి ఏడాదీ పేద విద్యార్థులకు విద్యా సామగ్రి, దుస్తులను తన సొంత నిధులు, దాతల సహకారంతో అందించారు.
- సింగరాయకొండకు చెందిన గంజి ప్రసాద్ యాదవ్ సహకారంతో పాఠశాలకు అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంకు, మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేశారు. గిరిజన కాలనీలో ప్రతి ఇంటి ఆవరణలో పండ్ల, పూల మొక్కలను నాటించి కాలనీలో పచ్చదానికి కృషిచేశారు.

సేవా కార్యక్రమాలు

- వృథా సుధా కార్యక్రమం ద్వారా శుభకార్యాలు, వివిధ ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి తన స్నేహితులతో కలిసి గిరిజన కాలనీల్లో పేదలకు పంచేవారు.
- వస్త్రనేస్తం అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టి సంపన్నులు, ఉద్యోగులు, స్తోమత కలిగిన వారి నుంచి తన మిత్రబృందంతో కలిసి వస్తువులు సేకరించి వాటిని నిరుపేదలకు, గిరిజనులకు అందించేవారు.
- 'మొక్కలు నాటుదాం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి మండలంలోని పలు కాలనీల్లో మొక్కలను నాటించారు.


రామతీర్థం మోక్షరామలింగేశ్వరాలయం ఓవర్‌వ్యూ


రామలింగేశ్వరుని మూలవిరాట్

కార్తీకపౌర్ణమికి రామతీర్థం ముస్తాబు

- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

చీమకుర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని దక్షిణకాశీగా విరాజిల్లుతున్న రామతీర్థం మోక్షరామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబు అయ్యింది. కార్తీకమాసంలో పౌర్ణమి నాడు ఆలయం ఆవరణలో ఉన్న పురాణ ప్రాశస్త్యం కల్గిన పవిత్రమైన కోనేరులో పుణ్యస్నానమాచరించి మూలవిరాట్‌ని దర్శించుకుంటే మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. దీంతో జిల్లా నలుమూలల నుంచి రామతీర్థంనకు భక్తులు పెద్దఎత్తున విచ్చేసి పూజలు జరుపుతుంటారు.

రాముని బాణంతో ఏర్పాటైన తీర్థం..

రామ, రావణ యుద్ధం ముగిసిన తర్వాత సీతాదేవితో వెళ్తూ తిరుగుప్రయాణంలో రామతీర్థం సమీపాన సేద తీరటం సమయంలో బ్రాహ్మణహత్యా పాప వినాశానానికి శివలింగాన్ని ప్రతిష్ఠించాలనే ఆలోచన వచ్చింది. దీంతో సీతారాములు స్వహస్తాలతో శివలింగాన్ని ప్రతిష్ఠించటంతో ఇక్కడ మూలవిరాట్‌కి రామలింగేశ్వరస్వామి అని పేరు వచ్చింది. ఆలయ ప్రాంగణంలో రాముడు తన బాణంతో కోనేరును నిర్మించారని ప్రతీతి. ఈ కోనేటిలో స్నానమాచరించి కోనేటిలోని అడుగుభాగంలో మట్టిని నుదిటికి రాసుకొని ఆలయంలో మూలవిరాట్‌ని దర్శించుకోవటానికి వెళ్లినపుడు నుదుటికి రాసుకున్న మట్టి విభూతిలా తెల్లగా రావటం విశేషం. అందుకనే ఇక్కడున్న కోనేరుకు విభూతికుండం అని మరో నామం ఉంది. రామునిచే ఏర్పడింది కనుక రామ తీర్థంగా ప్రసిద్ధిగాంచింది. ఇంతటి మహత్యం కలిగిన రామలింగేశ్వరున్ని దర్శించుకొంటే మోక్షం లభిస్తుందనే విశ్వాసం భక్తుల్లో ఉండటంతో మోక్షరామలింగేశ్వరునిగా రామతీర్థంలో ఉన్న మూలవిరాట్‌ని పిలుచుకుంటారు. ఇటీవల ఆలయ పునరుద్ధరణ, అదేవిధంగా కోనేటి పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు. ఆలయ అధికారులు పర్వదినాన్ని పురస్కరించుకొని విచ్చేసే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. అంతేగాకుండా వివిధ కులాలకు చెందిన సత్రాలలో అన్నదానానికి ఏర్పాట్లు చేశారు.

మానవత్వం పరిమళించి..

భక్తుల చొరవతో సఖి కేంద్రానికి తల్లీబిడ్డ


సొమ్మసిల్లి పడిపోయిన తల్లీకూతురు

పొదిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆ తల్లికి ఏ కష్టం వచ్చిందో తెలియదు. నెలరోజుల క్రితం రెండేళ్ల చంటిబిడ్డను తీసుకొని పొదిలికి వచ్చింది. ఎటూ పోయే దిక్కులేక స్థానిక నిర్మమహేశ్వర ఆలయం చెంతకు చేరింది. ఎండైనా వానైనా అక్కడే. తనతోపాటు చంటిబిడ్డ భారం కూడా శివయ్యమీదే వేసి అక్కడే ఉంటోంది. నోటమాట సొంతం రాదు. మానసిక పరిస్థితి అంత చక్కగా లేదు. అయితే అక్కడకు వచ్చే అయ్యప్ప దీక్షదారులు, భక్తులు ఇచ్చే పండ్లతో జీవనం వెళ్లదీస్తోంది. తల్లే లోకంగా ఉన్న ఆ చిన్నారి కూడా అక్కడే ఉంటోంది. ఈ క్రమంలో గురువారం బాగా నీరసించి ఆ తల్లి సొమ్మసిల్లింది. అక్కడే చిన్నారి ఆడుకుంటూ తల్లిచెంతే పడుకొంది. వారి పరిస్థితిని భక్తులు గమనించి కొద్దిపాటి సపర్యాలు చేసినా స్పందించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఒంగోలులోని సఖీ కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు ఒంగోలులోని సఖీ కేంద్రానికి తరలించారు.


గాంధీరోడ్డులో ఇరుక్కుపోయిన ఆటోలు

గాంధీరోడ్డులో ట్రాఫిక్ దిగ్బంధం

- వాహనాల రాకపోకలకు అంతరాయం

ఒంగోలు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోనే నిత్యం రద్దీగా ఉండే గాంధీరోడ్డు గురువారం సాయంత్రం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం కార్తీకపౌర్ణమి కావడంతో గాంధీరోడ్డులో పూజా సామగ్రి కొనుగోలు కోసం ఎక్కువ మంది వచ్చారు. అదేక్రమంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది అక్కడ లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా చోదన చేస్తూ వివిధ మార్గాల నుంచి గాంధీరోడ్డులోకి రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. సుమారు రెండు గంటల పాటు పాదచారులు, వాహనదారులు ఆ ప్రాంతంలోనే నిలిచిపోయారు. అక్కడి ట్రాఫిక్ పాయింట్‌లో ట్రాఫిక్ పోలీసుల రెండు టోపీలు మాత్రం ఆంధ్రజ్యోతికి కన్పించాయి. కానీ ట్రాఫిక్ నియంత్రించాల్సిన పోలీసులు కనిపించలేదు. ఈక్రమంలో వాహనదారులు హారన్‌లతో పెద్ద శబ్దాలు చేశారు. దీనిపై ట్రాఫిక్ సీఐ పాండురంగారావును వివరణ కోరగా ట్రాఫిక్ సిబ్బంది బందోబస్తు విధులకు వెళ్లారని తెలిపారు. అయినప్పటికీ సిబ్బందిని పంపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేసినట్లు ఆయన చెప్పారు.

రెడ్‌క్రాస్ సెక్రటరీగా శ్రీమన్నారాయణ

ఒంగోలు(కల్చరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీగా స్టెప్ సీఈవో ఎస్.శ్రీమన్నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు నగరం కొత్తకూరగాయల మార్కెట్ దగ్గర ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకోగా ఏవో కె.సుధాకర్, మెడికల్ ఆఫీసర్స్ శ్రీకృష్ణ, సుబ్బారావు, కో ఆర్డినేటర్ ఎస్.రామకృష్ణ, డీఎఫ్‌వో వెంకయ్య తదితరులు బొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థలో లైఫ్ మెంబర్‌షిప్ పెంచడానికి కృషి చేయాలని, రక్తదాతల్లో ప్రోత్సాహాన్ని కలిగించాలని కోరారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

క్రీడాకారిణి మైథిలి మృతిపై మరో కేసు

ఒంగోలు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారిణి సన్నబోయిన మైథిలి మృతిపై ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం మరో కేసు నమోదు అయింది. గత నెల కావలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మైథిలి మరణించారు. ఆ మేరకు ప్రమాదానికి కారుకుడైన లారీ డ్రైవర్‌పై కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే మైథిలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. తమ కుమార్తె మైనర్ అని, బాలికను ఆటలుపోటీలకు తీసుకెళ్ళిన జిల్లా స్పోర్ట్స్ కార్యదర్శి కోటు వనజ, పీఈటీ బిన్నీ బాధ్యతారాహిత్యం వల్ల మైథిలికి ప్రమాదం జరిగిందన్నారు. అలాగే కుంచాల కృపాకర్ మాయమాటలు చెప్పి తన వెంట స్కూటీపై మైథిలిని తీసుకెళ్ళి ఆమె మృతికి కారకుడయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మైథిలి వినుకొండలో టోర్నమెంట్‌కు వెళ్ళి తిరిగి ఇంటికి చేరకుండా కావలి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయిందని, జరిగిన పరిణామాలను పరిగణలోకి తీసుకొని కేసు నమోదు చేయాలని కోరారు. దీంతో సీఐ నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కొప్పోలు రోడ్డులో ఇలా..


ఇందిరమ్మ కాలనీలో ఇలా..

వీడని ముసురు..!

గత రెండు రోజులుగా కురుస్తున్న వానకు ఒంగోలు నగరం తడిసి ముద్దయింది. బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కొంతమేర తగ్గుముఖం పట్టగా, గురువారం ఉదయం నుంచి ఓ మోస్తరు జల్లులతో కురిసిన వానతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. అయితే కొద్దిపాటి చినుకులకే నగరంలోని ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. ఆగుతూ, పడుతూ కురిసిన వానతో నగర ప్రజలకు కొంత అవస్థలు తప్పలేదు. - ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుకను నిబంధనల ప్రకారం అందించాలి

- కలెక్టర్ అన్సారియా


ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉచిత ఇసుకను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం రాత్రి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఇసుక డంప్‌లను ఏర్పాటు చేసేందుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఇసుకడంప్‌లను ఏర్పాటు చేసేందుకు 30 దరఖాస్తులు రాగా శుక్రవారం వాటిని లాటరీ ద్వారా ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక డంప్‌ల కోసం ఒంగోలు ప్రాంతంలో 12, మార్కాపురం 8, పైపాలెం 3, కనిగిరి 3, దర్శి 2 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. లాటరీలో ఎంపిక చేసిన వారికి వెంటనే ఎండీఎల్ లైసెన్సులు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

17న చిన్నజీయర్ స్వామి రాక

ఒంగోలు (కల్చరల్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీత్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జియర్ స్వామి ఈ నెల 17,18వ తేదీల్లో ఒంగోలుకు వస్తున్నట్లు వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు తడికమళ్ల హరిప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక దక్షిణం బజారులోని రామానుజకూటమిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఇతర సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన స్థానిక పీవీఆర్ బాలుర హైస్కూల్ మైదానంలో సాయంత్రం 5 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణ, శ్రీరామ పాదుక పూజ కార్యక్రమం చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీరామపాదుకలు జత ఇవ్వనున్నట్లు చెప్పారు. స్త్రీ, పురుషులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలన్నారు. ఇక 18వ తేదీ ఉదయం 8 గంటలకు రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న ఫాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో తీర్థగోష్ఠి, అనుగ్రహభాషణ, ఆశీర్వచనం మొదలైన కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో నిర్వాహకులు ఆడిటర్ పీవీ.రంగనాథం, వికాస తరంగిణి సభ్యులు ఎం.లక్ష్మీతులసి, మాధవీలత, శ్రీరామనేని సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వికాస తరంగిణి సభ్యులచే విష్ణు సహస్ర నామ పారాయణ జరిగింది.

108 ఉద్యోగుల సమ్మె నోటీసు


ఎంపీడీవో మహాలక్ష్మికి సమ్మె నోటీసు అందిస్తున్న 108 ఉద్యోగి ఆంజనేయులు

నాగులుప్పలపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 108 ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం సమ్మె నోటీసులును స్థానిక తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో మహాలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా 108 పైలెట్ ఆంజనేయులు మాట్లాడుతూ 108 నిర్వహణ సంస్థలను మార్చిన ప్రతిసారి అందులో పనిచేస్తున్న ఉద్యోగులైన ఈఎంటీలు, పైలట్‌లకు గ్రాట్యుటీ, ఎర్న్‌డ్ సెలవులు, వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించకుండా వైదొలగడంతో తాము ఎంతో నష్టపోతున్నట్లు చెప్పారు. 108 సర్వీస్‌లోని తమను వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగులుగా గుర్తించి క్రమబద్ధీకరించాలన్నారు. ప్రతి నెలా 5 తేదీలోగా జీతాలు అందేలా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. తమ యూనియన్ నాయకుల ఆదేశాల మేరకు అధికారులకు సమ్మె నోటీసులు అందించినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థిని



కె.సిపోరా

సింగరాయకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.సిపోరా స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన అండర్-17 రాష్ట్ర స్థాయి బాల బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. దీంతో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు మధ్యప్రదేశ్ నర్సింగ్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి సిపోరా పాల్గొననుంది. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు హజరత్తయ్య అభినందించారు.

9మంది జూదరుల అరెస్ట్

చీమకుర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం సాయంత్రం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 9మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.23,500 నగదును స్వాధీనపరచుకున్నట్లు సీఐ తెలిపారు. అసాంఘీక కార్యకలాపాలు, పేకాట, కోడిపందేల నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యువతను మోసం చేసిన ప్రభుత్వం

● యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు

ఒంగోలు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): యువతను మోసం చేయడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు విమర్శించారు. గురువారం ఒంగోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ సమావేశం జాతీయ కార్యదర్శి బీఆర్.గౌస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎన్నికలలో ప్రతిసారి యువతకు న్యాయం చేస్తామని బూటకపు వాగ్దానాలు ఇచ్చి మోసం చేస్తున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.సైదా, నాయకులు మమత నాగిరెడ్డి, దాసరి రవి, కైపు వెంకటకృష్ణారెడ్డి తదితరుల పాల్గొన్నారు.

భూగర్భజలం పరిరక్షణ అందరి బాధ్యత

మద్దిపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూగర్భజల సంపద పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ జగదీష్ చెప్పారు. గురువారం కూచిపూడి సచివాలయ ఆవరణలో నిర్మిస్తున్న రూఫ్‌వాటర్ హార్‌వెస్టింగ్ స్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. భూగర్భజల సంపద పరిరక్షణ భావితరాల మనుగడకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ఉపాధిహామీ నిధులతో పెద్దఎత్తున ఇంకుడు గుంతలు, కుంటల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం వల్లాయపాలెంలో గోకులం పథకం కింద నిర్మిస్తున్న పశువుల షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో గడ్డం రాంబాబు, కార్యదర్శి గాయత్రి, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

వల్లూరమ్మ ఆలయ ఆదాయం రూ11.15లక్షలు

టంగుటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వల్లూరమ్మకు భక్తులు సమర్పించే చీరలు, రవిక గుడ్డలు పోగుచేసుకునే హక్కుకు గురువారం వేలం పాట నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో జరిగిన వేలం పాట నిర్వహించగా రూ.11,15,000లకు పోయింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకుడు సిహెచ్.వేణుగోపాలరావు పర్యవేక్షణలో నిర్వహించారు. జూనియర్ సహాయకులు కె.మోహనరావు, కార్యనిర్వహణాధికారి బి.రమేష్ పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందన



రాంబాబును అభినందిస్తున్న డీఈవో

సింగరాయకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు స్వీకరించిన పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన అర్రిబోయిన రాంబాబు జిల్లా డీఈవో ఎ.కిరణ్‌ను గురువారం ఒంగోలులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంబాబును ఆయన అభినందించారు. అలాగే డిప్యూటీ డీఈవో చంద్రమౌళి, జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ మర్రిబోయిన శ్రీనివాసులు, రాంబాబుకు అభినందనలు తెలిపారు.

వాహనాల తనిఖీ

కొండపి, నవంబరు14, (ఆంధ్రజ్యోతి): కొండపిలోని పలు రూట్లలో గురువారం సీఐ సోమశేఖర్ వాహనాలను తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు.

చట్టాలపై సమగ్ర అవగాహన అవసరం

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



బండ్లమిట్ట స్కూలులో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు సంబంధిత చట్టాలపై అధికారులందరికీ సమగ్ర అవగాహన అవసరమని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా బంగారు బాల్యం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నందున బాలలకు సంబంధించిన చట్టాలపై జిల్లా స్థాయి అధికారులకు గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కులు, వారి రక్షణకు ఉన్న చట్టాలు, ప్రభుత్వ పథకాలు, వాటిని పొందేందుకు కావాల్సిన అర్హతలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అందులో భాగంగా తొలుత అధికార యంత్రాంగానికి ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రవిశంకర్, డిప్యూటీ చీఫ్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీ.రాఘవులు, డీఆర్వో చిన్నఓబులేసు, అధికారుల మాధురి, సామా సుబ్బారావు, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, స్వచ్ఛందసంస్థల ప్రతినిధి ఆర్.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నతస్థాయి చేరుకోవాలి

ఒంగోలు విద్య: విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నతస్థాయి చేరుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. బాలల దినోత్సవం, బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థినుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భవిష్యత్‌ను ఎలా తీర్చిదిద్దుకోవాలో వివరించారు. డీఈవో కిరణ్‌కుమార్ చాక్‌బోర్డుపై నెహ్రూ సందేశాన్ని రాసి విద్యార్థినులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, ఎంఈవో కిషోర్‌బాబు, హెచ్ఎం కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

● గ్రామీణాభివృద్ధిశాఖ డీడీ రామనాథం



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

నాగులుప్పలపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామనాథం తెలిపారు. గురువారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే నిధుల మేరకు సర్పంచ్‌లు, అధికారులు గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టాలన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలనపి చెప్పారు. అనంతరం స్వచ్ఛభారత్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణాధికారి డి.వెంకటేశ్వర్లు, ఎంపీపీ నలమలపు అంజమ్మ, ఎంపీడీవో మహాలక్ష్మి, సర్పంచ్‌లు, కార్యదర్శులు, పశువైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామనాథం, ఎంపీడీవో డి.సురేష్‌బాబు వారికి అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు బంగారు బాల్యం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రమణమ్మ, ఏఈ వీరాంజనేయులు, ఏపీఎం బాబూరావు, ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారు బాల్యం దినోత్సవం

● హాజరైన అధికారులు



చీమకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఒంగోలు(రూరల్), నవంబరు14(ఆంధ్రజ్యోతి): బంగారు బాల్యం వేడుకలను వారం రోజుల పాటు నిర్వహించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో బాలమ్మ ఆదేశించారు. గురువారం ఒంగోలు మండలం కరవది జడ్పీ హైస్కూలులో బంగారు బాల్యం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమ్మ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలకు మాత్రమే పరిమితం కావాలని, బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషుబాబు, ఎంఈవో2 పి.సరస్వతి, హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మద్దిపాడులోని నాగార్జున హైస్కూల్, నారాయణ హైస్కూల్లో గురువారం జరిగిన బాలల దినోత్సవంలో ఎంఈవో ఆంజనేయులు ప్రసంగించారు. కార్యక్రమంలో నాగార్జున హైస్కూల్ కరస్పాండెంట్ ఏవీ.సుబ్బారావు, మాధవి, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ స్కూల్ కరస్పాండెంట్ బెజవాడ సురేష్‌బాబు పాల్గొన్నారు. కడియాల యానాదయ్య హైస్కూలులో జరిగిన వేడుకల్లో తహసీల్దార్ సృజన్‌కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో హెచ్ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి పాల్గొన్నారు. కారుమూడివారిపాలెం పాఠశాలలో హెచ్ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాలలదినోత్సవం నిర్వహించారు.

చీమకుర్తిలో ర్యాలీ

చీమకుర్తి: బంగారు బాల్యానికి బాలోత్సవాలు అంటూ గురువారం చీమకుర్తిలో ర్యాలీ జరిపారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంఈవో శివాజీ పాల్గొన్నారు.

పాతసింగరాయకొండలో..

సింగరాయకొండ: పాతసింగరాయకొండ జడ్పీ హైస్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ చిమట సుధాకర్ విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో నిర్వహించిన బంగారుబాల్యం కార్యక్రమంలో ఎంపీడీవో బి.రామాంజనేయులు, సీడీపీవో మాధవీలత, ఎంఈవో కె.సురేఖ, డాక్టర్ అనూష, ప్రిన్సిపాల్ అరుణ పాల్గొన్నారు.

జరుగుమల్లిలో..

జరుగుమల్లిలోని మండల సమావేశం హాలులో బంగారు బాల్యం కార్యక్రమంలో విద్యార్థులతో ఎంపీడీవో రమణమూర్తి ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో బి.నాగేంద్రవదన్ పాల్గొన్నారు.

పొన్నలూరులో...

పొన్నలూరు: స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన బంగారుబాల్యం కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, ఎంఈవోలు ఇడపలపాటి రవిచంద్రబాబు, హరిబాబు, పీఆర్ ఏఈ కోటేశ్వరరావు, ఏవో శ్రీనివాస్, ఏపీవో మార్చర్ల, సూపర్‌వైజర్ రమాదేవి, హెచ్ఎం వెంకటరావు, ఉపసర్పంచ్ వెంకటరావు పాల్గొన్నారు.

మర్రిపూడిలో...

మర్రిపూడి: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జరిగిన బంగారు బాల్యం కార్యక్రమంలో తహసీల్దార్ జ్వాలా నరసింహం, వైద్యాధికారి వీరబాబు పాల్గొన్నారు. విద్యార్థులకు తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రెబ్బా వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ ఉప్పు సాయిబాబు, వైద్యాధికారులు రుచిత, సాయితేజ, ఆరోగ్య పర్యవేక్షకులు నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ సుచరిత, ఆరోగ్య కార్యకర్త పుణ్యవతి పాల్గొన్నారు.

వల్లూరు ఎస్సీకాలనీలో.

టంగుటూరు: వల్లూరు ఎస్సీ కాలనీలో నిర్వహించిన బంగారుబాల్యం కార్యక్రమంలో చిన్నారులకు వివిధ పోటీలు జరిపి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవసేనకుమారి, సీడీపీవో మల్లీశ్వరి, సూపర్‌వైజర్ జ్యోతి, రాధిక పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం



నాగులుప్పలపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో 8 నుంచి 15వ తేదీ వరకు చేపట్టిన ప్రజాపోరులో భాగంగా గురువారం నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి టి.శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిత్యావసర ధరలు పెరిగాయని, విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి స్మార్ట్ మీటర్లను పెట్టేందుకు సిద్ధమైందని ఆరోపించారు. ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగి పోతున్నాయన్నారు. ఉచిత ఇసుక నేటికి అమల్లోకి రాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.బసవపున్నయ్య, ప్రభుదాసు, యు.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామాంజనేయులు, చిరంజీవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలను రద్దుచేయాలి

సంతనూతలపాడు: విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం సంతనూతలపాడు బస్టాండ్ వద్ద వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులపై ఉక్కుపాదం మోపాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పెద్దబ్బాయ్, సుబ్బారావు, హనుమంతరావు, నరసింహారావు, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు పేరుతో ధర్నా కార్యక్రమం గురువారం కొండపిలోని మండల కార్యాలయాల ఎదటు ఆ పార్టీ కార్యకర్తలు నిర్వహించారు. జిల్లా నాయకుడు కేజీ.మస్తాన్, మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, లక్కిపోగు సుధాకర్, ముప్పరాజు చినబ్రహ్మయ్య, గడ్డం పిచ్చయ్య, వందనం, రూబెన్ పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: ప్రజాసమస్యల పరిష్కారానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా చేసినట్లు సీపీఎం ఏరియా కమిటీ నేత రాము చెప్పారు. కార్యక్రమంలో మోజెస్, వెంకట్రావు, మీరాస్, సుబ్బారావు, యానాది, పాపారావు, కోటయ్య, కొండయ్య, శ్రీను పాల్గొన్నారు. అనంతరం ఆర్ఐకు వినతి పత్రం అందించారు.

ఘనంగా గ్రంథాలయాల వారోత్సవాలు



సంతనూతలపాడులో నెహ్రూకు నివాళి

మద్దిపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఏడుగుండ్లపాడు సర్పంచ్ దాసరి శిల్పసౌందర్య పేర్కొన్నారు. ఏడుగుండ్లపాడు గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించారు. లైబ్రేరియన్ రోహిణి ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, హెచ్ఎం ఉషారాణి, భార్గవ్, మద్దిపాడులో జరిగిన వేడుకల్లో గ్రంథ పాలకురాలు వసుంధరదేవి, నేలటూరి సత్యనారాయణ, నల్లూరి నరసింహారావు, గంగిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో

సంతనూతలపాడు: స్థానిక జడ్పీహైస్కూల్లో హెచ్ఎం ప్రమోద ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎంఈవో వెంకారెడ్డి మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడులో గల గ్రంథాలయాల్లో గ్రంథపాలకులు ఎ.ప్రసాద్, మాదారపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు.

టంగుటూరులో..

టంగుటూరు: జాతీయ వారోత్సవాలలో భాగంగా టంగుటూరు గ్రంథాలయంలో బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శాతవాహన పాఠశాల కరస్పాండెంట్ ఆర్ కల్పన, హెచ్ఎంలు తోకల భారతి, ఎస్‌కె ఖాదర్‌బాషా, కె.లెనిన్‌బాబు పాల్గొన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు వర్ధనరాజు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో ముగ్గురికి నాలుగేళ్ల జైలు

ఒంగోలు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కేసులో ముగ్గురు నిందితులకు నాలుగేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.16వేలు జరిమానా విధిస్తూ 7వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయాధికారి రాజా వెంకటాద్రి గురువారం తీర్పు ఇచ్చారు. దొనకొండ మండలం సిద్ధయ్యపాలెంనకు చెందిన చొప్పరపు సాగర్, మందగిరి సుబ్బయ్య, మందగిరి బుచ్చయ్యలు 2018 అక్టోబరు 6న రాత్రి మంచా హుసేన్ తన ఇంట్లో ఉండగా వారు బయటకు వెళదామని పిలిచారు. అందుకు హుసేన్ నిరాకరించడంతో వారి మధ్య వాగ్వాదం జరిగి కులం పేరుతో దూషించి ఇంట్లో నుంచి బయటకు లాగి దాడి చేశారు. హుసేన్ తలకు గాయం కాగా దొనకొండ పోలీసుస్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు కోర్టులో వాదనలు విన్న న్యాయాధికారి నిందితులపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ళ జైలు, జరిమానా విధించారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా 50 బాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో అండర్-17 విభాగంలో స్థానిక లాయర్‌పేటలోని నారాయణ సీవో అండ్ ఒలంపియాడ్ స్కూలు విద్యార్థులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన షాజిద్‌వలీ, వహిద్‌లు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సీరీస్‌లను గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ సయ్యద్‌నాగూర్‌వలి, నారాయణ స్కూల్స్ ఏజీఎం నర్రావుల పెద్దిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాషా, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రోఫీని అందజేశారు.

టీచర్స్ గిల్డ్ అభినందన

ఒంగోలు విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం పట్ల ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. గత ఏడాది డిసెంబరు, ఈ ఏడాది మార్చి మధ్యలో ఎయిడెడ్ పాఠశాలల్లో 29 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారన్నారు. వారికి ప్రభుత్వం మూడు సంవత్సరాలు కాంట్రాక్టు పద్ధతిలో జీతాలు చెల్లించేందుకు ప్రొసీడింగ్స్ ఇచ్చిందన్నారు. డీఈవో వెంటనే ఎంఈవోల ద్వారా ట్రెజరీ ఐడీ నెంబర్లు కేటాయించి జీతాల సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

రాఘవరెడ్డిని కలిసిన నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికవేత్త, టీడీపీ యువనేత మాగుంట రాఘవరెడ్డిని పలు ప్రాంతాల నుంచి వచ్చిన మాగుంట అభిమానులు, టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో గురువారం రాఘవరెడ్డిని ఒంగోలు పార్లమెంట్ యోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు రాఘవరెడ్డిని కలిసి పలు సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం రాఘవరెడ్డిని సత్కరించారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలి : పీడీ



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

మద్దిపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పూర్తి చేసిన లబ్ధిదారులందరికీ వెంటనే బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గురువారం ఏడుగుండ్లపాడులోని గృహాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. బిల్లులు వెంటనే చెల్లిస్తామని తెలిపాడు. కార్యక్రమంలో డీఈ చెన్నారాయుడు, ఏఈ హేమలత, సర్పంచ్ దాసరి శిల్ప సౌందర్య, దాసరి రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సుజాత, టీడీపీ నాయకులు మండవ హరిప్రసాదరావు, ఎం.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో కార్తీక మాస పూజలు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాస ప్రత్యేక పూజా కార్యక్రమాలకు గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం అంకురార్పణ చేశారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠ, కుంభ నివేదనం, ఉక్తహోమం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, లక్ష్మీకుమారి పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం శ్రీవారికి అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం జరుగుతుందని వారు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : చైర్మన్



కాలిపోయిన ఇల్లు, గేదెలను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన నలతోటి రవి కుటుంబానికి అండగా ఉంటామని మాల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఉప్పుగుండూరు అంబేడ్కర్ కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. కాలిపోయిన ఇంటిని, మంటల ధాటికి గాయాలపాలైన గేదెలను పరిశీలించారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట తెలగతోటి జాన్సన్, తెలగతోటి పృథ్వి, వాసుమల్లి నాగార్జున, యాదల నాగరాజు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జ్వాలా తోరణం

గిద్దలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురష్కరించుకుని పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 15న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జ్వాలాతోరణం కార్యక్రమం, ఆకాశజ్యోతిని వెలిగించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు భోజనాల ఏర్పాటు



దివ్యాంగుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నగర్ కాలనీలోని స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలలో 1986-87 పదో తరగతి పూర్వవిద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భోజనానికి అవసరమైన సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గుంటక సుబ్బారెడ్డి, రాము, రమణ, షేక్ అబ్దుల్ జలీల్, ఇస్మాయిల్, ప్రకాశ్, కౌన్సిలర్ నాలి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డైరెక్టర్‌గా నిషాకుమారి

గిద్దలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌గా ఐఎఫ్ఎస్ అధికారిణి నిషాకుమారి నియమితులయ్యారు. ఆ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నరసింహారావు బదిలీ కాగా అటవీశాఖలో వెయిటింగ్‌లో ఉన్న నిషాకుమారిని గిద్దలూరుకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



జ్ఞాపికలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో గత ఏడాది 10వ తరగతి పరీక్షల్లో మొదటి రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు జ్ఞాపికలు అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.నాగభూషన్‌రెడ్డి, విశ్రాంత హెచ్ ఎం ఎం.రాంభూపాల్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ ఎం.బాలూనాయక్, ఫిజికల్ డైరెక్టర్ శోభన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలకు వీల్‌చైర్ల బహూకరణ



వీల్‌చైర్లు అందిస్తున్న బ్రహ్మానందరెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన సూర్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తండ్రి దప్పిలి ఈశ్వర్‌రెడ్డి జ్ఞాపకార్థం గురువారం రెండు వీల్‌చైర్లను ప్రాంతీయ వైద్యశాలకు అందించారు. డాక్టర్ కడప రమణరెడ్డికి ఆయన రెండు వీల్‌చైర్లను అందజేశారు. బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రోగుల సౌకర్యార్థం వీల్‌చైర్లను బహూకరిస్తున్నామన్నారు.

గ్రామ సహాయకుల నూతన కమిటీ ఏర్పాటు



బ్రహ్మయ్యను సన్మానిస్తున్న గ్రామ సహాయకులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో డివిజన్ గ్రామ సహాయకుల కమిటీ గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మర్రిపూడి బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులుగా కాశీరామ్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రావూరి మోజేష్, సహాధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా రంగారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సహాయకులు రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

పోసానిపై పోలీసులకు ఫిర్యాదు

గిద్దలూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ బోర్డు చైర్మన్ బి.ఆర్.నాయుడుపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేసిన హాస్యనటులు పోసాని కృష్ణమురళిపై బీజేపీ నాయకులు గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సినిమాలలోని మహిళలను టీటీడీ చైర్మన్‌ను కించపరచడం శోచనీయమని పేర్కొన్నారు. వెంటనే కృష్ణమురళిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయులు, మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, జగన్నాథరెడ్డిలు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

రోగులు ఫుల్ - వసతులు నిల్

● నిత్యం 200కు పైగా ఓపీలు ● కాన్పులకు ఆస్పత్రిని ఆశ్రయిస్తున్న గర్భిణులు ● కొరవడుతున్న కనీస వసతులు



కంభం ప్రభుత్వ వైద్యశాల

కంభం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కంభం ప్రభుత్వ వైద్యశాలకు వివిధ సమస్యలపై వచ్చే రోగుల సంఖ్య అధికంగానే ఉన్నప్పటికీ, కనీస వసతులు మాత్రం అందుబాటులో ఉండడం లేదు. నిత్యం 200కు పైనే ఓపీలు నమోదవతున్నాయి. ఇన్‌పేషంట్లు ఎక్కువ మందే ఉంటున్నారు. ప్రభుత్వ వైద్యసేవలను చిరునామాగా కంభం వైద్యశాల ఉన్నప్పటికీ, వసతుల లేమి ఇక్కడ వెక్కిరిస్తోంది.

వైద్యశాలలో తాగునీరు, విద్యుత్ జనరేటర్, అంబులెన్స్ వంటి మౌలిక వసతులు కూడా అందుబాటులో లేవు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు పరిష్కరంచేందుకు కనీసం వైద్యశాల అభివృద్ధి కమిటీ కూడా లేకపోవడం గమనార్హం. కంభం ప్రభుత్వ వైద్యశాలకు కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల నుంచి నిత్యం వందలాది మంది వివిధ వైద్యపరీక్షల కోసం వస్తుంటారు. ఈ 50 పడకల వైద్యశాలకు అనుగుణంగా వైద్య సిబ్బందిని పెంచకపోవడం, కంభంలో ఉన్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను బేస్తవారపేట పీహెచ్‌సీకి బదిలీ చేయడం, వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందాలంటే అవసరమైన హెచ్‌డీఎస్ ఫండ్స్ లేకపోవడం దీనికి శాపంగా మారింది.





నిరుపయోగంగా ఉన్న ఆర్‌వో ప్లాంటు, ఓపీ విభాగంలో వేచి ఉన్న రోగులు

నీరు లేక అవస్థలే..

ముఖ్యంగా బోరు ఎండిపోవడంతో ఐదేళ్ల క్రితం ఆర్‌వో ప్లాంటును ఏర్పాటు చేయగా మరమ్మతులకు గురికావడంతో ఏడాదికాలంగా అలంకారప్రాయంగా ఉండిపోయింది. రోగులు బయట నుంచి నీరు తెచ్చుకుంటుకున్నారు. మరుగుదొడ్లకు కూడా నీరు లేక ఇన్‌పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారు. అదనంగా నూతన బోరును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జనరేటర్ చెడిపోవడంతో రాత్రివేళ కరెంటు పోతే ఇబ్బందే. ఇక్కడ ప్రతిరోజూ ప్రసవాలు జరుగుతుంటాయి. ఆపరేషన్ చేసే సమయంలోనూ, కరెంటు పోతే సెల్‌ఫోన్ల లైట్ల సహాయంతో పని చేయాల్సి వస్తోంది. పోస్టుమార్టంలది అదే పరిస్థితి. దశాబ్దకాలం క్రితం అంబులెన్స్ చెడిపోయింది. దాన్ని ఇటీవలే పూర్తిగా తుక్కు చేసి విక్రయించేరు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు ప్రైవేటు వాహనాలపై ఆధారపడ వలసి వస్తోంది. ఇక అత్యవసర అపరేషన్లకు రక్తనిల్వ కేంద్రాలు లేవు. 15 మంది వైద్యులకు గాను కేవలం 10 మంది ఉన్నారు. అత్యవసరమైన జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ వైద్యులు ఇక్కడ అందుబాటులో లేరు. కేవలం తల్లీ బిడ్డకు ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కంభం వైద్యశాలలో వసతుల లేమిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వైద్యశాలలో నెలకొన్న సమస్యలపై జిల్లా వైద్యాధికారులు, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం.

సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష

కుటుంబ ఆర్థిక పరిస్థితులవల్లే బాల్యవివాహాలు

'బంగారు బాల్యానికి శ్రీకారం-బాలోత్సవాలు' కార్యక్రమంలో తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

కొమరోలు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్లే ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతున్నాయని తహసీల్దార్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 'బంగారు బాల్యానికి శ్రీకారం-బాలోత్సవాలు' కార్యాక్రమంలో భాగంగా మండల ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యాక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో పేదరికాన్ని రుపు మాపి వారికి బాల్యవివాహాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామాల్లోని పేదలకు చట్టాలపై అవగాహన లేకపోవడంతో కుటుంబ కట్టుబాట్లు వంటి వాటివల్లే బాల్య వివాహాలు ఎక్కువగా చేస్తున్నారన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలలపై ఏమైనా అఘాయిత్యాలకు గాని, మరే ఇతర సమస్యలు ఉన్నా, సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబరు 1098కు కాల్‌చేసి చెప్పవచ్చనన్నారు. ఎంపీపీ కామూరి అమూల్య మాట్లాడుతూ బాలలు ఇష్టంగా చదివి భవిష్యత్తును చక్కదిద్దుకోవాలన్నారు. అప్పుడే విద్యార్థులు అనుకున్నవి సాధిస్తారన్నారు. విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. జెట్పీటీసీ సభ్యులు సారె వెంకటనాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి క్రమశిక్షణతో మెలగాలన్నారు. బాలలు విద్యార్థి దశ నుంచే విద్యతోపాటు క్రీడల్లోనూ రణించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యాక్రమంలో ఎంఈవో బోర్రా వెంకటరత్నం, ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, ఎస్సై వెంకటేశ్వరనాయక్, ఈఓపీఆర్‌డీ బ్రంహయ్య, ఎంపీటీసీ సభ్యులు కామూరి శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఏపీవో రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డీఆర్‌డీఏ వెలుగు పీడీ వసుంధర



మాట్లాడుతున్న పీడీ వసుందర

పొదిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.వసుంధర అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల పరిధిలో ఓఎస్ఎఫ్, బీడీఎస్‌పీ, బీటీసీ, టీడీఈలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడితే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యంగా ప్రతిపేద కుటుంబంలో డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తయా రు చేయాలనేదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దీని కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి సంబంధిత బ్యాంకలు ద్వారా, సీఈఎఫ్ ఫండ్‌తో రుణాలు అందించి ప్రోత్సహి స్తోందన్నారు. బీపీఎం సుబ్బారావు మాట్లాడుతూ పొదిలిలో 150, కొనకనమిట్ల మండలంలో 150 డ్వాక్రా సంఘాల ద్వారా వివిధ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, ఏపీఎం గోపాలకృష్ణ, సీసీలు రాజయ్య, వెంకటరెడ్డి, ఎల్‌సీ నాగభూషణం, డీటీఈ కృష్ణారెడ్డి, పొదిలి, కొనకనమిట్ల మండల సమాఖ్య అధ్యక్షురాలు మొహరున్నీసా, ఈశ్వరమ్మ, శ్రీదేవి, బీడీఎస్పీలు, బీటీసీలు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణపై సూచనలు



మిరపతోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ

గిద్దలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం చిన గానిపల్లి గ్రామ పరిధిలో సాగైన మిరప పైరును ఉద్యానవన శాఖాధికారిణి పి.విష్ణు ప్రియ పరిశీలించారు. మిరపకు తామర పురుగు, తెల్ల దోమ ఆశించినట్లు గుర్తించారు. ఎకరాకు 30 నుంచి 40 నీలి, పసుపు రంగు జిగురు అట్టలను పురుగు నివారణ కోసం ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే పిప్రోనిల్ లేదా స్పైనోసాల్డ్‌లను పిచికారి చేసుకోవాలన్నారు. శిలీంధ్రాల వల్ల వచ్చే ఆకుమచ్చ, కాయమచ్చలను తగ్గించుకునేందుకు సూక్ష్మపోషకాలు అందించేందుకు పురుగు మందులను పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. నీటి, ఎరువుల యాజమాన్యాన్ని చక్కగా చేపట్టాలని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పొలంలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రం సహాయకులు సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవనానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

గిద్దలూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బీసీ భవనం నిర్మించేందుకు రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించాలని బీసీ సంఘం నాయకులు ఓ.వెంకటయ్య, కౌన్సిలర్ బి.చంద్రశేఖర్ యాదవ్ గురువారం తహసీల్దార్ అంజనేయరెడ్డికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రాజానగర్‌లో బీసీ భవనం ఏర్పాటు చేయాలని, గతంలో ఎమ్మెల్యేగా ఉన్న ఇప్పటి ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి స్థలం కేటాయించి బీసీ భవనానికి శంఖుస్థాపన చేశారన్నారు. అయితే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఆ ఫైలు పెండింగ్‌లో ఉందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు బీసీ భవనం కోసం స్థలం కేటాయించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

నేడు ఏకలవ్యలో జన జాతీయ గౌరవ దివస్

పెద్దదోర్నాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జన జాతీయ గౌరవ దివస్ వేడుకలు నిర్వహించనునట్లు డీటీడబ్ల్యువో జగన్నాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు విశాఖపట్నం మిషన్ సంచాలకులు, ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ ట్రైనింగ్ మిషన్, ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున గిరిజన సంఘం నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.

వామ్మో..! ఓ వైపు కోతులు, మరోవైపు కుక్కలు

బెంబేలెత్తుతున్న ఎర్రగొండపాలెం ప్రజలు





వీధుల్లో తిరుగుతున్న కోతులు, కుక్కలు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 14 , (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మండల ప్రజలు బయటకు రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు రావాలన్నా, పోవాలన్నా కుక్కలు, కోతులు దాడి చేస్తాయని బెదిరి పోతున్నారు. ఒకటి రెండు కాదు పదుల సంఖ్యలో వీధులలో తిరుగుతూ ప్రజలపైకి దూకుతున్నాయి. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీ ప్రాంతాలలో ఉండాల్సి న కోతులు నివాస ప్రాంతాలకు వచ్చి గృహాల ను గుల్ల చేస్తున్నాయని మహిళలు అంటున్నారు.

గతంలో ఇదేతరహాలో కోతులు తిరగ్గా, పంచాయితీ అధికారులు కొండముచ్చును వీధుల్లో తిప్పి కొతుల బెడద నుండి విముక్తి కల్పించారు. నాలుగు రోజుల నుండి మళ్లి కోతుల గుంపులు వచ్చాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు భయంతో బయటికి రాలేని పరిస్థితి ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకొవచ్చు. ఒక వైపు కోతుల బెడద అయితే మరో వైపు కుక్కల గుంపు తోడైంది. కుక్కలు కూడ పదుల సంఖ్యలో భౌ..భౌ.. అంటూ ప్రజలను పరుగులు పెట్టిస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కుక్క దాడిలో ప్రాణాలు, గాయాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. అలాంటి ఘటనలు ఇక్కడ జరగకముందే అధికారులు స్పందించి కోతులను, కుక్కలను పట్టుకొని అటవీ ప్రాంతాల్లో వదిలేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

పొదిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని 108 సిబ్బంది గురువారం స్థానిక తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శోభన్‌బాబులకు వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యలపై గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆ సంఘం జిల్లా ట్రెజరర్ కే.ఆదాం గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎం రమేష్, సిబ్బంది సురేష్, సుభాని, కె అరుణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి

మొట్టుపల్లి గ్రామంలో ఘటన

కొమరోలు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన మండలంలోని మొట్టుపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొమరోలు మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన శిరబోయిన వెంకటయ్య (50) అనే గొర్రెల కాపరి తన మేకలను రోజువారిగా మేపుకొనేవాడు. ఈ క్రమం లోనే గురువారం సాయం త్రం అకస్మాత్తుగా వర్షం పడింది. దీంతో చెట్టువద్దకు వెళ్లేసరికి సమీపం లోని బోరుకు పెట్టిన స్టార్టర్ నుంచి విద్యుత్ ఎర్త్ అయి ప్రమాదవశాత్తు వెంకటయ్య అక్కడి కక్కడే మృతి చెందారు. వెంకటయ్యకు భార్య గురమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇంటి యజమాని మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై వెంకటేశ్వరనాయక్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకుని కేసు నమోదచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఘనంగా బాలల దినోత్సవం

బాలల దినోత్సవం సందర్భంగా పలు గ్రంథాలయాల్లో వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆయా కార్యక్రమంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఇక పాఠశాలల్లో 'బంగారు బాల్యం' కార్యక్రమం నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 14: ఆంధ్రజ్యోతి: మార్కాపురం పట్టణంలోని కమలా పాఠశాలలో, వాసవి విద్యానికేతన్‌లో, బాలుర ఉన్నత పాఠశాల, సాయి బాలాజీ ఉన్నత పాఠశాల, జీఎమ్‌ఆర్ పాఠశాలలో ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు.

● పొదిలి : మండలంలోని మల్లవరం గ్రామంలో కనిగిరి డీఎల్‌డీవో కె శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శోభన్‌బాబు, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కంభం : కంభంలోని బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన బంగారు బాల్యం కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో వీరభద్రాచారి, ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, ఎంఈవో శార్వణిలు పాల్గొన్నారు. కంభం శాఖ గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ఉప విద్యాశాఖ అధికారి శామ్యూల్‌జాన్ గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాందాస్ నాయక్, గ్రంథపాలకుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎర్రగొండపాలెం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ విద్యాలయం, నలంద హైస్కూళ్లలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వాహించారు. ఆయా కార్యక్రమాలో విద్యాలయ ప్రత్యేకాధికారి తిరుమలదేవి, తహసీల్దార్ బాలకిషోర్, ఎంపీడీవో బి.శ్రీనివాసులు, ఎంఈవో అంజనేయులు పాల్గొన్నారు. ఎర్రగొండపాలెంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు కె.ఝాన్సీ ఆధ్వర్యంలో వారోత్సవాలు ప్రారంభించారు.

● గిద్దలూరు : పట్టణంలోని మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 10 మంది బాలబాలికలకు ఒక్కొక్కరికి రూ.500 రూపాయల వంతున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. సేవాసంస్థ అధ్యక్షులు పి.శివారెడ్డి 40 మంది విద్యార్థులకు పెన్నులు అందజేశారు.

● రాచర్ల : జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బంగారు బాలోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం బి.ఎల్.రామానాయక్ ఎంఈవో శివకోటేశ్వరరావు పాల్గొన్నారు. గ్రంథాలయంలో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారోత్సవాలు ప్రారంభమ య్యాయి.





వాసవీ విద్యాసంస్థల్లో నెహ్రూ వేషధారణలో చిన్నారుల వై.పాలెంలో నెహ్రూ చిత్రపటానికి విద్యార్థుల నివాళి

● పుల్లలచెరువు : మండలంలోని వివిధ పాఠశాలల్లో బాలల దినోత్సవం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ టల పోటీల్లో గెలుపొందిన విద్యా ర్థులకు బహుమతులు అందజేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.

● త్రిపురాంతకం : స్థానిక జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఎంఈవోలు మల్లిఖార్జుననాయక్, రాజశేఖరరెడ్డి, ఈవోపీఆర్‌డీ రామసుబ్బయ్య నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● పెద్ద దోర్నాల : స్థానిక గ్రంథాలయంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని అవిష్కరించారు. అనంతరం ఎంఈవో మస్తాన్‌నాయక్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గిద్దలూరు : గిద్దలూరు శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎస్.ఎం.ప్రసన్నకుమారి, విశ్రాంత ఎంఈవో ఎం.రామచంద్రరెడ్డి, పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ఎస్.ఆంజనేయులు, జేవీవీ నాయకులు పి.స్వరూపారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● పెద్దదోర్నాల : క్రమశిక్షణతో కూడిన విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎంఈవో కొండలరావు అన్నారు. మండలంలోని చిన్నదోర్నాల మండల ప్రాథమికోన్నత పాఠశాలలో బాలలదినోత్సవ వేడుకలు గురువారంనిర్వహించారు. విద్యార్థులు కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన దొనకొండ విద్యార్థులు

దొనకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ కె.నర్సింహారావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 13న చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు జరిగాయి. సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్ 14 విభాగంలో 9వ తరగతి విద్యార్థి పీవీఎల్ నారాయణ, 7వ విదార్థి శివశంకర్‌రెడ్డి, అండర్ 17 విభాగంలో 9వ తరగతి విద్యార్థి కె.భానుప్రణీత్, పదో తరగతి విద్యార్థులు బి.చంద్రశేఖర్, జి.సుమిత్ర, జి. గంగాభవాని ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు తరుపున వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

అధిక ధరలకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన

దొనకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలపై అధిక ధరలకు వ్యతిరేకంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మండల కార్యదర్శి చిరువల్లి అంజయ్య ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుందుర్తి నర్సింహులు, కోలా కిరణ్‌కుమార్, మేళం ఉదయ్‌కుమార్, కొండా ఫ్రాన్సిస్, రమణయ్య, పి.కాశయ్య, జె.ప్రసాదరావు, మేళం సంతోష్‌కుమార్, డి.కొండయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో.. దర్శి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూఆఫ్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి నాయకులు మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అధిక ధరలను అరికట్టాలని, ఉచిత ఇసుక విధానం అమలుచేయాలని, నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యు.నారాయణ, ఈ.నాగేశ్వరరావు, గోగు వెంకయ్య, అంజిబాబు, డి.సామ్యేల్, పి.పుల్లయ్య, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

దొనకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీలో అడ్మిన్ నాని ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. దొనకొండలోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పా ల్గొన్నారు. ఈ పోటీల్లో జడ్పీ పాఠశాలకు పదో తరగతి విద్యార్థి లక్ష్మీనారా యణరావు విన్నర్‌గా, గౌతమీ డిగ్రీ కాలేజీ విద్యార్థి పవన్ రన్నర్‌గా గెలు పొందారు. విజేతలకు జడ్పీ పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయులు బహుమ తులు అందజేశారు. కార్యక్రమంలో గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రామ యోగి, అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలంపాట వాయిదా

తాళ్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా వేలపాటదారులు హాజరుకాక పోవటంతో బొద్దికూరపాడు మైనర్ ఇరిగేషన్ చేపల వేలంపాట వాయిదా పడింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపల వేలంపాట వేసేందుకు గురువారం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి జల్లుల వర్షం కురుస్తుండటంతో పాటదారులు ఎవరూ రాలేదు. మధ్యాహ్నం వరకు సర్పంచ్ మంద శ్యాంసన్, పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు ఎదురు చూశారు. ఒకరిద్దరు మాత్రమే రావటంతో నిబంధనల మేరకు గ్రామపంచాయతీ చేపల వేలంపాటను ఈనెల 18వరకు వాయిదా వేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలోపడి వ్యక్తి మృతి

పామూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పొలానికి నీళ్లు పెట్టేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. మండలంలోని కంబాలదిన్నె గ్రామానికి చెందిన గుదె వెంకటస్వామి (61) కందుకూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు . గురువారం తమ పొలనికి నీళ్లు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కిశోర్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరికి తరలించారు.

దుకాణాల తాళాలు పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

పామూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవస్థాన దుకాణాలకు అధికారులు వేసిన సీల్‌ను తొలగించి సొంత తాళాలు వేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య కోరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో ఎండోమెంట్ అధికారులు దేవస్థానానికి సంబంధించి 11 దుకాణదారుల వస్తువుల బయట పడవేసి సీల్ వేశారు. అయితే, మంగళవారం సోమిశెట్టి మాల్యాద్రి సతీమణి కొందరు వ్యక్తుల ప్రోత్సాహంతో సీలు వేసిన తాళాలను పగలకొట్టి సొంత తాళాలు వేయడంతో పోలీసులకు ఫిర్యాదుచేసి సీలు వేయించామన్నారు. అక్రమంగా తాళాలు పగులకొట్టిన వారిపై నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఉమ్మడి శ్రీను, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, పి.విజయకుమార్‌చారి. డి.చరణ్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

కురిచేడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు సుమతి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు సౌజన్యంతో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు విద్యార్థులకు వివిధరకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు సుమతి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కురిచేడు అధ్యక్షుడు వీవీ రమణారావు, కోశాధికారి ప్రసాదరావు, సభ్యులు పోలేపల్లి అనంత లక్ష్మీనారాయణ, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని బోదనంపాడు ప్రాథమిక పాఠశాల (ఎస్సీ)కి ప్రవాస భారతీయ వాసవీ సమితి వారు రూ.15 వేల విలువగల కథల పుస్తకాలను అందజేశారు. ఈ పుస్తకాలను మండల విద్యాశాఖాధికారులు వస్రాం నాయక్, సుబ్బారావుల చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వల్లెం స్వాతి పుస్తకాలు అందించిన వాసవి సమితి వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరిని వీడని ట్రాఫిక్ సమస్య

- పనిచేయని ఆంక్షలు
- లోపభూయిష్టంగా వన్‌వే ఏర్పాటు
- క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



నగరికంటి బసవయ్య సెంటరులో ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కనిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణాన్ని ట్రాఫిక్ సమస్య వీడటం లేదు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించినా షరా మాములుగా మారింది. తిరిగి యథావిధిగా ఫుట్‌పాత్‌లను దాటి రోడ్డుపైకి వచ్చి వ్యాపారం చేస్తున్నారు. పట్టణంలో వన్‌వే ఏర్పాటు చేయటంతో ప్రధానంగా వైఎస్సార్ రోడ్డులో వ్యాపారాలు లేక తీవ్రంగా నష్టపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేనురోజుల కొకసారి వన్‌వేను మార్పు చేస్తూ పోలీసులు ఆంక్షలు విధించారు. దీంతో వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భారీ వాహనాలను ఉప్పురోడ్డులో నిలిపి అన్‌లోడింగ్ చేయటంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. నగరికంటి బసవయ్య సెంటరు వద్ద, ఉప్పురోడ్డులో నుంచి రామాలయం వెళ్ళే రోడ్డు, సుగుణమ్మ ఆసుపత్రి నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్ళే రోడ్ల మలుపుల వద్ద తోపుడు బండ్లు ఉంటున్నాయి. దీంతో వాహనాలు మలుపుతిప్పే క్రమంలో ఇబ్బందిగా మారింది. ప్రజల ఇబ్బందులు దృష్ట్యా పామూరు బస్టాండు సెంటరులోని ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించినా మళ్లీ యథాస్థితికి చేరాయి. సిమెంటు, ఇతర ట్రాన్స్‌పోర్టుల భారీ వాహనాలు పట్టణంలో పగటి పూట ప్రధాన రహదారుల్లోకి రావటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. ఇప్పటికైనా పోలీసులు తగు చర్యలు తీసుకొని తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



భారీ వాహనాలతో నిలిచిపోయిన ట్రాఫిక్

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

- ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. నేడు ప్రతి ఇంట్లో మొబైల్ వాడకం పెరిగిందన్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని అదిపుచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అయితే, మొబైల్‌లో వచ్చే వికృత కార్యక్రమాలు, చేష్టలకు విద్యార్థులు ఆకర్షితులై భావి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇంకోపక్క ప్రతి ఇంట్లో చిన్నారులకు వారి తల్లిదండ్రులే ఫోన్‌లు ఇచ్చి ప్రోత్సహించటం సమంజసం కాదన్నారు. విద్యార్థులు ఫోన్‌లను పక్కనపెట్టి ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను ఇంటి వద్ద పఠనం చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనం, ఆటలు, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలన్నారు. ఇవన్నీ విద్యలో ఒక భాగమేనని చెప్పారు. బాలల హక్కులు, వారి సంక్షేమం గురించి తెలియజేసేందుకే బాలల దినోత్సవాన్ని నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహిస్తునారన్నారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల వారు విధిగా బాలల హక్కుల గురించి, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, హెచ్‌ఎం సంజీవి, కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఎంఈవోల సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈవో యూవీ నారాయణెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

దర్శి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో బాలల దినోత్సవ ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి విజయకుమారి, స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సేవకుడు జీవీ రత్నం, ప్రధానోపాధ్యాయుడు కాలేషా, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రయివేట్ విద్యా సంస్థల్లో గురువారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పండిట్ జవహర్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సెయింట్ మార్క్ విద్యాసంస్థల అధినేత ఎం. జయకుమార్ అన్నారు. అలాగే, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలంలోని నర్రమారెళ్ల పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నెహ్రూ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏస్రవంతి, ఆర్ఐ పీవీఎస్ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.



కనిగిరిలో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కురిచేడులో..

కురిచేడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవ వేడుకలు గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో వివిధ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సమసమాజ స్థాపనే ధ్యేయంగా..

తాళ్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనే ధ్యేయంగా పనిచేసిన మహోన్నతవ్యక్తిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నిలిచారని ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. మండలంలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏబీసీ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో జరిగిన నెహ్రూ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఏబీసీ స్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిన్నారులు పుస్తక పఠనంపై శ్రద్ధ వహించాలన్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెలుగువారిపాలెం ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ కాలేషాబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ నిధులు ఖర్చు చేయాలి

ముండ్లమూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను గ్రామాల మౌలిక వసతులకు వినియోగించాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి ప్రణాళికపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు పెద్దపీట వేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధే ప్రణాళికగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సీసీ రోడ్లు, ఇతర పనులకు వినియోగించాలన్నారు. చెత్త సంపద కేంద్రాలు సక్రమంగా పనిచేసే విధంగా చూడాలన్నారు. పాలకులు సమావేశంలో ఎంపీపీ సుంకర సునీత, జడ్పీటీసీ టి.రత్నరాజు, ఏపీవో ఏ.నాగరాజు, ఏపీఎం హనుమంతరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో జనార్దన్, పక్కన ఎంపీపీ సునీత, జడ్పీటీసీ రత్నరాజు

అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలి

పామూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీడీపీ ప్రణళికలను తయారు చేయాలని ఎంపీడీవో బి.సురేష్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, ఈవోపీఆర్డీ కేవీఎల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పీసీపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికల తయారీపై గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఎంపీడీవో ప్రభాకరశర్మ మాట్లాడుతూ తయారుచేసిన అభివృద్ధి ప్రణాళికలను సంబంధిత ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లేశ్వరి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పోసానిపై చర్యలు తీసుకోవాలి

కనిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై, వివిధ పత్రికలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణమురళిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు వీవీఆర్ మనోహరరావు అన్నారు. ఈమేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం సీఐ ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మనోహరరావు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను వెలికితీస్తూ జర్నలిజం వృత్తికి న్యాయం చేస్తున్న జర్నలిస్టులపై, వివిధ పత్రికాధిపతులపై పోసాని చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రోషన్ సంధాని, కేవీఎస్ గౌడ్, కరణం అరుణ, దింటకుర్తి సుబ్రమణ్యం పాల్గొన్నారు. జర్నలిస్టులు నున్నా కృష్ణ, నారాయణరెడ్డి, చెరుకూరి నరసింహారావు, బింగి ప్రసాదరావు, ప్రసాద్ (పంతులు), తదితరులు సంఘీభావం తెలిపారు.



సీఐ ఖాజావలికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కనిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైవేపై నారపరెడ్డిపల్లి వద్ద ప్రయివేట్ ట్రావెల్స్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని ఎవరూ గుర్తించకపోవటంతో అంతిమ సంస్కారం నిర్వహించేందుకు ఎస్‌ఐ టి.శ్రీరాం మానవతాసంస్థను సంప్రదించారు. ఆసంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు సలహా మేరకు పోస్టుమార్టం అనంతరం గురువారం అనాథ మృతదేహానికి సంస్థ సభ్యులు అంతిమ సంస్కార కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు పసుపులేటి అరుణోదర్, కోమటికుంట్ల బాబూరావు, బొగ్గరపు శ్రీనివాస్, పసుపులేటి వాణి, వెన్నా శ్రీనివాస్, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురికి జైలు


దొనకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరులేని సమయంలో రాత్రిపూట వ్యక్తిపై దాడిచేసి కులం పేరుతో దూషించిన కేసులో నిందితులైన ముగ్గురికి అడిషనల్ అండ్ జిల్లా సెషన్స్ న్యాయాధికారి టి.రాజా వెంకటాద్రి జరిమానా, జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలోని సిద్దాయిపాలెం గ్రామానికి చెందిన మంచా హుస్సేన్‌పై అక్టోబరు 6,2018న అదే గ్రామానికి చెందిన చొప్పరపు సాగర్, మందగిరి సుబ్బయ్య, మందగిరి సాగర్ బుచ్చయ్య దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో నిందితులైన ముగ్గురికి నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష, ఒకొక్కరికి రూ.16వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు

బాలలకు అన్ని వసతులు కల్పించాలి

పీసీపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల వికాసమే తొలి ప్రాధాన్యం కావాలని ఎంపీడీవో ప్రభాకర శర్మ అన్నారు. బంగారు బాల్యం బాలికా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజం సవ్యంగా ఎదగాలంటే పిల్లలు సక్రమంగా పెరగాలన్నారు. బాల్యంలో వారికి అవసరమైన అన్ని సదుపాయాలు, వికాస అవకాశాలను అందుబాటులో ఉంచాలన్నారు. బాలల వికాసానికి మనమంతా వారి భవిష్యత్తు కోసం బాధ్యతగా పనిచేయాలన్నారు. తొలుత విద్యార్థులు ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈవో సంజీవిని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవాతత్పరుడు హనుమంతరావు

పామూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహాయం అడిగిన ప్రతిఒక్కరికి తనవంతుగా తోడ్పాటునందించిన దేవరపు హనుమంతరావు సేవాతత్పరుడని ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నుచ్చుపొద గ్రామంలో స్వర్గీయ దేవరపు హనుమంతరావు వైకుంఠ సమారాధన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో వారు మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి స్వయం కృషితో పారిశ్రామికేత్తగా ఎదిగి ఎందరికో ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రభుత్వ, ప్రవేట్ విద్యాసంస్థలకు తనవంతు సహాయ సహకారాలు అందించిన మహోన్నత వ్యక్తి దేవరపు హనుమంతరావు అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఇరిగినేని తిరుపతి నాయుడు అనుచరుడిగా ఉంటూ ఆయన బలపరిచిన అబ్యార్థుల విజయానికి కృషి చేసారని, ఆయన అకాల మృతి టీడీపీకి తీరని లోటని పేర్కొన్నారు. హనుమంతరావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



హనుమంతరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పువ్వాడి

నివాళులర్పించిన వారిలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, మాజీ సర్పంచ్‌లు కావిటి సుబ్బయ్య, డీవీ మనోహర్, తిరివీధి జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ ఎం.హుసేన్‌రావుయాదవ్, ఇరిగినేని రవీంద్రబాబు, యారవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, రాయవరపు మాల్యాద్రిచౌదరి, గుర్రం వెంకటేశ్వర్లు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, మిరియం రామారావు, దారపనేని సుబ్బారావు ఉన్నారు. అలాగే, పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి నరసింహులు, పచ్చ చినపేరయ్య, కొప్పల్లి సురేష్, నల్లపాటి మోహనరావు, ఆకుపాటి రమణయ్య, కొలూరి ఖాజారహంతుల్లా, ఆరేకొండ హరిప్రసాద్, మట్లే రాహుల్‌యాదవ్, యర్రసింగ్ రాయుడు, కోటపాటి నరసింహారావు, తెలజాల ప్రసాద్, కనపర్తి కృష్ణారావు, కమ్మ బాలకృష్ణ, దరిశి సత్యనారాయణ, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ వెంకటేశ్వరరావు, వరద ఓబులేసు, గళ్లా చెన్నయ్య, దేవరపు మాల్యాద్రితో పాటు ఆయన కుమారులు దేవరపు రవిబాబు, చంద్రబాబు, కేశవులు, తదితరులు నివాళులర్పించారు.




హనుమంతరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దారపనేని

ముఖాముఖి

పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

ఆర్.జనార్దన్, ఎంపీడీవో, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో పారిశుధ్యంపై చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించిన మాట వాస్తవం. మెరుగుదలకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాం.

ప్ర: మండలంలో రహదారులను మరమ్మతులు చేస్తున్నారా?

జ: మండలంలో పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. జనవరి కల్లా రహదారుల రూపురేఖలు మారతాయి.

ప్ర: మండలంలోని పలు పంచాయతీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది?

జ: తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న మాట వాస్తవం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

ప్ర: మండలంలో పంచాయతీల తీర్మానం లేకుండా లేఅవుట్లు వేస్తున్నారు. ఏం చర్యలు తీసుకున్నారు?

జ: పులిపాడు, పెదఉల్లగల్లుతో పాటు పలు పంచాయతీల్లో అనధికారికంగా లేఅవుట్లు వేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ తీర్మానం ఉంటేనే లే అవుట్ వేసుకోవాలి.

రక్షిత నీటి సరఫరాకు చర్యలు

పామూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని ప్రతిఒక్కరికి రక్షత మంచినీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ పథకం కింద ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బొడవాడ గ్రామంలో జలజీవన్ పథకానికి గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి పైపులైన్‌ద్వారా రక్షిత నీటిని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎం.హుసేన్‌రావు, డి.కోటిలింగం, దాసరి రత్తయ్య ఎం.కొండయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం

పామూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో గురువారం గణపతి హోమంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థాన చైర్మన్ గుత్తి రాజ దంపతులు, కోశాధికారి రాచూరి సురేష్ దంపతులు హోమాల్లో కూర్చోగా, ఆలయ ప్రధాన అర్చకులు చిమట కార్తీక్ స్వామి గణపతి హోమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, బి.జయరామిరెడ్డి, కావిటి సుబ్బయ్య, ఎన్.సాంబయ్య, ఓగూరి నరసింహారావు, కంభాల రోశయ్య, రాహుల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

ముండ్లమూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను నిర్మూలించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న వయస్సులో వివాహాలు ఎన్నో అనర్థాలకు దారి తీస్తాయన్నారు. ఏ గ్రామంలోనైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఐసీడీఎస్ అధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎండీవో ఆర్ .జనార్దన్, ఎంఈవో ఎం.సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు, ఆర్ఐ పీవీఎస్ఆర్ మూర్తి, హెచ్‌ఎం మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో మోస్తరు వర్షం

ముండ్లమూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని శంకరాపురం, పోలవరం, వేంపాడు గ్రామాల్లో భారీ వర్షం కుసింది. ముండ్లమూరు, పసుపుగల్లు, మారెళ్ళ నూజెండ్లపల్లి, ఈదర, భీమవరం, సింగన పాలెం గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం మెట్ట పైర్లకు జీవం పోసింది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పీసీపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించడం ద్వారా భూసాంద్రతను గుర్తించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వీవీ శేషమ్మ అన్నారు. మండలంలోని పెదఅల వలపాడు, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షల ఫలితాల అనంతరం నేల సాంద్రతను పెంచేందుకు అవసరమైన ఎరువులను వాడాలన్నారు. కంది, శనగ, మినుము, పొగాకు, మిరప తదితర పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఆశించిన మేర దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రకాశరావు, వీఏఏలు, తదితరులు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కనిగిరి, నవంబరు 14: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో జ్యోష్ణాదేవి అన్నారు. మండలంలోని యేరువారిపల్లి, గోసులవీడు గ్రామాలలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కంది పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది, ఎంపీఈవోలు ధనలక్ష్మి, కిషోర్ పాల్గొన్నారు.




బాపట్ల 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలో మూడునెలలుగా మురుగునీటి మధ్య ఉంటున్న యానాదుల గృహాలు

సమస్యలతో సహవాసం

రోడ్లపై మురుగు, పేరుకుపోయిన చెత్తచెదారాలు, దుర్వాసన, అపరిశుభ్రత, వర్షం వస్తే ముంపు, పొంగి ప్రవహించే డ్రెయిన్లు, పగలు రాత్రి అన్న తేడా లేకుండా దోమల దాడి, గుంతల రోడ్లు, ట్రాఫిక్ ఇక్కట్లు, అరకొర తాగునీటి సరఫరా, కుక్కల స్వైర విహారం, వెలగని వీధి దీపాలతో అంధకారం.. తదితర సమస్యలతో పుర ప్రజలు సహజీవనం చేస్తున్నారు. అభివృద్ధికి మారుపేరుగా నిలవాల్సిన మున్సిపల్ కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. పట్టణాలను విస్తరిస్తూ పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపుతున్న పాలకులు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపైన, మౌలిక వసతుల కల్పనపైనా కనీసం కూడా దృష్టి సారించడంలేదు. ఎన్నికలు జరుగుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కానీ ప్రజల సమస్యలు మాత్రం తీరడంలేదు. అధ్వాన పారిశుధ్యం, అపరిశుభ్రమైన తాగునీటి సరఫరా, దోమలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా పాలకులకు పట్టడంలేదు. సమస్యలపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నా అధికారులు వాటిని తీర్చడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. మున్సిపాలిటీల్లో విభాగాల వారీగా రూ.కోట్లలో వ్యయం చేస్తున్నా ఆ మేరకు ప్రజలకు కనీస మేలు కూడా జరగడంలేదు. నిధులు ఏమవుతున్నాయో కూడా తెలియడంలేదు.

ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్

- అవస్థల్లో ప్రజలు.. పట్టించుకోని పుర పాలకులు
- పట్టణాల్లో జనాభాకు అనుగుణంగా లేని సౌకర్యాలు
- పన్నుల వసూళ్లపైనే శ్రద్ధ.. వసతుల కల్పనలో అశ్రద్ధ


పేరుకుపోతున్న చెత్త కుప్పలు

చీరాలంతా చెత్త

చీరాల: మున్సిపల్ పరిధిలో సేకరించిన చెత్తను వేటపాలెం మండలం రామాపురం గ్రామ పరిధిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌కు తరలిస్తారు. అయితే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి సంపద సృష్టించేందుకు చేపట్టిన కార్యక్రమం అటకెక్కింది. దీంతో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ యూనిట్ కాస్తా డంపింగ్ యార్డుగా మారింది. చెత్త సమస్యతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ పరిధిలో 135 కి.మీ రోడ్లు ఉండగా 35 కి.మీ మేర ఇంతవరకు రోడ్ల నిర్మాణం జరగలేదు. మురుగుకాల్వలు 273 కి.మీ మేర ఉండాల్సి ఉండగా 70 కి.మీ మేర ఇంకా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. వస్త్ర వ్యాపార కేంద్రమైన చీరాలకు రోజుకు వేలమంది వచ్చి పోతున్నా వారి కనీస అవసరాలు తీర్చుకునేందుకు మున్సిపాల్టీ పరంగా రెండు ప్రదేశాల్లో మాత్రమే పబ్లిక్ టాయిలెట్లు, రెండు చోట్ల సులాబ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి.

జనాభా	: సుమారు లక్ష
గృహాలు	: 23,762
సమ్మర్ స్టోరేజీ ట్యాంక్	: 1 (మరొకటి అవసరం)
ప్రధాన డ్రెయిన్లు	: 2
పార్కులు	: 3 మరో 3 అధ్వానం


బాపట్ల పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే సమ్మర్‌స్టోరేజ ట్యాంక్


బాలయ్య నగర్‌లో గ్రావెల్ రోడ్డు

విలీన ప్రాంతాల్లో వెతలు

నరసరావుపేట: మున్సిపాల్టీలో శివారు ప్రాంతాలను విలీనం చేశారు. అయితే మౌలిక వసతుల కల్పన లేదు. తాగునీరు, వీధి దీపాలు, రహదారులు, మురుగు కాల్వల వసతి లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సీసీ రోడ్లకు విలీన ప్రాంతాలు నోచుకోవడంలేదు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు లేక రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. తాగు నీటి సరఫరా జరగడంలేదు.

ప్రస్తుత జనాభా	: 1,64,000
ఉద్యానవనాలు	: ఏడు అధ్వానం
పబ్లిక్ టాయిలెట్లు	: నాలుగు బ్లాక్‌లు
భూగర్భ డ్రెయినేజి పథకం	: నిరుపయోగం
డంపింగ్ యార్డులు	: ఒకటి
నీటి సంరక్షణ వ్యవస్థ	: లేదు

అధికారుల విఫలం

బాపట్ల: జిల్లా కేంద్రమైన బాపట్లలో సమస్యలు కొలువుతీరుతున్నాయి. సమస్యల శాశ్వత పరిష్కారానికి పాలకులు, అధికారులు చర్యలు చేపట్టడంలేదు. జనాభా పెరిగిపోతున్నా అవసరమైన వనరులు సమకూర్చడంలో విఫలమౌతున్నారు. గతంలో 56.69 ఎకరాలలో సమ్మర్‌స్టోరేజిట్యాంక్ ఏర్పాటు చేయగా అది ప్రస్తుత అవసరాలకు సరిపోవడంలేదు. చెరువు నిండా నీరుపెడితే కేవలం 2నెలలు మాత్రమే వస్తుంది. మురికివాడల్లో డ్రెయినేజి సమస్య పట్టిపీడిస్తున్నది. 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలో మూడునెలలు క్రితం వచ్చిన వరద ముంపు నుంచి ఆ ప్రాంత వాసులు బయట పడలేదు. పార్కులన్నీ కూడా పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తున్నాయి. పట్టణంలోని మురుగునీరు వెళ్లే ప్రధానకాల్వలు ఈస్ట్‌శ్యాంప్, నల్లమడడ్రెయిన్లలో కలిసే తవ్వకాల్వ ఆధునికీకరణ అంతంత మాత్రంగానే ఉంది.

జనాభా	: లక్షకు పైగా
ఎస్‌ఎస్‌ట్యాంక్	: 1 (మరొకటి అవసరం)
రోజువారీ నీటి వినియోగం	: 9 ఎంఎల్‌డీ
పార్కులు	: 10(ఒకటే శుభ్రం)
పబ్లిక్ టాయిలెట్లు	: 4(మరో మూడు అవసరం)


మౌంట్‌ఫోర్టుస్కూల్‌రోడ్డులో కంపోస్టుయార్డులేక రోడ్డుపక్కనవేసిన చెత్తాచెదారం

సమస్యల నిలయం..

రేపల్లె: రేపల్లె పురపాలక సంఘం సమస్యల నిలయంగా ఉంది. పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉన్నా ఆ స్థాయిలో ప్రజలకు అందాల్సిన సౌకర్యాలు లేవు. అరవపల్లి సమ్మర్‌స్టోరేజ్‌ట్యాంక్‌నుంచి 15 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు లీకులతో 28 వార్డుల్లోని ప్రజలకు సక్రమంగా అందడంలేదు. నిత్యం 25 మెట్రిక్‌టన్నుల చెత్త వస్తున్నా కంపోస్టుయార్డు లేదు. దీంతో మౌంట్‌ఫోర్టుపాఠశాల రోడ్డులో, పెనుమూడి అరవపల్లిరోడ్డులో వేస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాలు తీవ్రమైన దుర్వాసనతో నిండి ఉంటున్నాయి. పట్టణంలోని అంబేద్కర్‌పార్కు, చంద్రమౌళిపార్కులు అధ్వానంగా ఉంటున్నాయి. పబ్లిక్ టాయిలెట్లు సరిపడా లేకపోవడంతో పట్టణంలోకి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌవుతున్నారు. ఇసుకపల్లి సమీపంలో మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని డ్రెయిన్లన్నీ వ్యర్థాలతో పూడుకుపోయాయి. ఉప్పాడి డ్రెయిన్, అరవపల్లి డ్రెయిన్, 24వవార్డులో డ్రెయిన్ పూర్తిగా తూటికాడతో నిండిపోయాయి. దీంతో పట్టణంలో మురుగునీరు పారుదల లేక ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

కనీస సౌకర్యాలు కనుమరుగు

గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థగా పరిణితి చెంది ఏళ్లు గడుస్తున్నాయి. రాజధాని జిల్లా కేంద్రమైనా సౌకర్యాలు గగనంగా మారాయి. అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో నగరం మున్సిపాలిటీ కంటే తక్కువగానే ఉంది. యూజీడీ, అమృత్, ఎస్‌ఎఫ్‌బీసీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్, సమగ్ర తాగునీటి పథకం తదితర పథకాలు వచ్చినా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నగరం రోజురోజుకు విస్తరిస్తూ సమీప గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమవుతున్నా.. సమస్యలు కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నాయి. నగరం 2011 లెక్కల ప్రకారం 141.52 స్క్వేర్ కిలోమీటర్లు ఉండగా ఇప్పుడు 220.45 స్క్వేర్ మీటర్లకు పెరిగింది. 2012లో పది రెవెన్యూ గ్రామాలను విలీనం చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు లేవు. విద్య, వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఉన్న నగరానికి లక్షల్లో ప్రజలు వస్తుంటారు. అయితే వారి కనీస అవసరాలు అయినా మరుగుదొడ్లు, మూత్రశాలలు, నైట్‌షెల్టర్లు అందుబాటులో లేవు. ఉన్నవి కూడా అరకొరగానే ఉన్నాయి. ఆరుబయటే మల, మూత్ర విసర్జనతో ప్రధాన మార్గాలు దుర్వాసనతో నిండి ఉంటున్నాయి. నగరంలో 12 మరుగుదొడ్లు ఉన్నా అవన్నీ కూడా ప్రైవేట్ వ్యక్తుల చేతిలో ఉండి డబ్బులు ఉంటేనే లోపలికి రానిస్తున్నారు. దీంతో పల్లె ప్రజలు అటువైపు వెళ్ళాలంటేనే ఇష్టపడటం లేదు. నగరంలో తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, విద్యుత్ దీపాలు సక్రమంగా లేవు.

జనాభా	: 10.70 లక్షలు
మరుగుదొడ్లు	: 5 (మరో 3 అవసరం)
మురుగుకాల్వలు	: 190 కి.మీ(40 కి.మీ విస్తరించాలి)
డంపింగ్‌యార్డు	: 1 (మరొకటి ఏర్పాటు చేయాలి)
ఎస్‌ఎస్‌ట్యాంక్	: 1 (మరొకటి ఏర్పాటు చేయాలి)
తాగునీటి పైపులైన్లు	: 70కి.మీ(మరో 60కి.మీ ఏర్పాటు చేయాలి)


పాత గుంటూరు శుద్ధపల్లి డొంకలో ప్రగతి నగర్ లో త్రాగునీరు అందక రమ్ముల లో నిల్వ చేసుకుంటున్నా నీరు

కబ్జా చేస్తే.. కటకటాలే

- భూ కబ్జాలపై ఉక్కుపాదం
- నిందితులకు అత్యంత తీవ్రమైన శిక్షలు.. ఆస్తుల సీజ్
- భూ కబ్జా కేసుల కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కోర్టులు
- నేడు అసెంబ్లీలో ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ మాఫియాను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రభుత్వం పగడ్బందీ చట్టాన్ని తీసుకొస్తున్నది. భూకబ్జాలకు పాల్పడ్డారో ఖతం అయినట్లే. ల్యాండ్ మాఫియాను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రభుత్వం పగడ్బందీ చట్టాన్ని తీసుకొస్తుంది. భూ కబ్జాదారుల మెడకు ఉచ్చు బిగించబోతోంది. అర్థబలం... అంగబలంతో రెచ్చిపోయిన ల్యాండ్ మాఫియా కట్టడే లక్ష్యంగా సామాన్యుల ఆస్తులకు రక్షణ కవచం లాగా నూతన ఆక్రమణల నిషేధిత చట్టాన్ని ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందుకు సంబంధించి అసెంబ్లీలో శుక్రవారం ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు ఇష్టారీతిన భూకబ్జాలతో ప్రజ, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని గుంటూరు జిల్లాతో పాటు అటు పల్నాడు, ఇటు బాపట్ల జిల్లాల్లో ల్యాండ్ మాఫియాకు సంబంధించి అక్రమార్కులు రాజకీయ పలుకుబడితో పాటు పోలీసులను గుప్పెట్లో పెట్టుకుని యథేచ్ఛగా తమ కార్యకలాపాలను కొనసాగించేవారు. ఎవరైనా వీరి అక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై తప్పుడు కేసులతో వేధింపులకు గురి చేసేవారు. కోర్టులకు వెళితే ఎన్నేళ్ళకు కేసు తేలుతుందో అర్థం కాక కొందరు, కోర్టులకు వెళ్ళలేక మరికొందరు, కోట్ల ఖరీదైన ఆస్తులను వదులుకోలేక ఇంకొందరు అలాగని న్యాయపోరాటం చేయలేక సతమతమవుతూ వచ్చారు. అంతేకాక ఎవరైనా వారిని ధీటుగా ఎదుర్కొని పోలీసులకు ఫిర్యాదు చేసినా చట్టంలో ఉన్న లొసుగులను అడ్డుపెట్టుకుని స్టేషన్ బెయిల్‌పై వచ్చి ఆయా భూ యజమానులకు హెచ్చరికలు చేస్తూ తమ భూకబ్జాల పర్వం కొనసాగిస్తూ వచ్చారు. కొన్ని సందర్భాల్లో ల్యాండ్ మాఫియా, పోలీసులు చేతులు కలిపి భూ కబ్జాలను తెలివిగా సివిల్ వివాదం అంటూ ఉన్నతాధికారులను, చివరకు చట్టాన్ని సైతం తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసి కోట్ల ఖరీదైన అమాయకుల భూములను



(మిగతా 6వ పేజీలో...)

లాటరీ టిక్కెట్లు.. డూప్లి'కేటు'

- నిషేధించినా యథేచ్ఛగా అమ్మకాలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓ వైసీపీ నేత హవా
- తెనాలిలో మూలాలు గుర్తించినా అప్పటి నేతల ఒత్తిడితో చర్యలు శూన్యం
- ప్రస్తుతం ప్రభుత్వం మారినా ఆగని దందా.. పడని అడ్డుకట్ట

తెనాలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): లాటరీ టిక్కెట్లపై రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎప్పటి నుంచో నిషేధం ఉంది. అయినా బహిరంగంగానే టిక్కెట్‌లు అమ్మేస్తున్నారు. అయితే వీటిలో అసలు టిక్కెట్లు 100 ఉంటే, దానికి పది రెట్లు నకిలీ టిక్కెట్లు ఉన్నాయి. వైసీపీ సర్కారు పోయి, కూటమి ప్రభుత్వం వచ్చినా గంజాయి కంటే ప్రమాదకారిగా పేదల రెక్కల కష్టాన్ని దోచేస్తున్న ఈ నకిలీ దందా గుట్టుపై మాత్రం ఇంకా కన్నుపడలేదు. 2023లోనే విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నకిలీ లాటరీ టిక్కెట్ల గుట్టు బయటపడినా అప్పట్లో వారికి అధికారపార్టీ నేతల అండదండలు ఉండటంతో చర్యలేమీ లేవు. అయితే రెండు రాష్ట్రాల్లో లాటరీ దందాకు మూల కేంద్రం తెనాలే కావడం వణుకుపుట్టించే విషయం. గంజాయి, బెట్టింగ్‌ల వంటివాటి విషయంలో ఇప్పటికే తెనాలికి అక్రమార్కులు ఖ్యాతిని తీసుకొస్తే, ఇప్పుడు లాటరీ టిక్కెట్ల వ్యవహారం కనిపించకుండా వేళ్లూనుకుపోవటం కలవర పరిచే విషయం. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గతేడాది ఈ లాటరీ టిక్కెట్లు, వాటి మాటునే గుట్టు చప్పుడు కాకుండా అమ్మేస్తున్న నకిలీ లాటరీ టిక్కెట్ల వ్యవహారం బయటపడింది. అక్కడ తీగలాగితే లాటరీ దందా డొంక తెనాలిలో తేలింది. ఆయా జిల్లాల పోలీసులు తెనాలి వచ్చి సోదాలు నిర్వహించారు. దీంతో లాటరీ టిక్కెడ్ల బండారం బయటకు పొక్కింది. నిషేధిత లాటరీ వ్యవహారంలో సూత్రధారి తెనాలిలోని వైసీపీకి చెందిన ఓ నాయకుడని తేల్చారు. అయితే అతడిపై చర్యలు లేకుండా అప్పట్లో పోలీసులపై ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో చేసేదిలేక సూత్రధారులను పట్టుకోకుండానే పోలీసులు వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. శ్రీకాకుళం పోలీసులకు వైసీపీ సర్కారులోని ఓ ముఖ్యనేత, సీఎంవో నుంచి వార్నింగ్‌లు వచ్చాయి. ఆ తర్వాత ఈ అక్రమ వ్యాపారానికి అడ్డేలేని పరిస్థితి నెలకొంది. అప్పటి నుంచి నిషేధిత లాటరీ టిక్కెట్ల వ్యవహారం నేటికీ మూడు అసలు టిక్కెట్లు... ఆరు నకిలీ టిక్కెట్‌ల తరహాలో సాగిపోతూనే ఉంది. అప్పట్లో విజయనగరం జిల్లాలో ఇద్దరు స్నేహితులు రెండు లాటరీ టిక్కెట్లు కొనగా ఒకరికి రూ.కోటి గెలుచుకోగా, టిక్కెట్‌లు అమ్మిన వ్యాపారి మొండి చెయ్యిచూపాడు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించగా లాటరీ టిక్కెట్ల వ్యవహారం వెలుగుచూసింది. అయితే ఒక్క శ్రీకాకుళమే కాకుండా విజయనగరం, విశాఖపట్టణం, అనకాపల్లి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు వంటి మరికొన్ని జిల్లాలు, ఆయా జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలే కేంద్రాలుగా వీరి దందా సాగిపోతూ వస్తోంది. చివరకు పట్టణాలు కాకుండా, మండల కేంద్రాలు, పల్లెలనూ వదలకుండా అక్రమ లాటరీ టిక్కెట్‌ల దందాను నడుపుతున్నారని అప్పట్లో పోలీసులే గుర్తించారు.

అసలు కంటే నకిలీలతో ఘరానా మోసం

అసలు టిక్కెట్‌లు కొని కూలి డబ్బులు పోగొట్టుకునే పరిస్థితి చాలాచోట్ల ఉంటే, వాటిలో నకిలీ లాటరీ టిక్కెట్‌లు కలిపి అమ్మేస్తూ ఘరానా మోసానికి తెగబడుతున్నారంటే ఎంత దారుణం. ఈ అక్రమార్కులకు అసలు టిక్కెట్ల కంటే, నకిలీలే మంచి ఆదాయ వనరుగా మారిపోయాయి. ఉదాహరణకు సిక్కిం, నాగాలాండ్ లాటరీల వంటివాటి నుంచి రూ.లక్ష విలువైన లాటరీ టిక్కెట్లను ఈ నేత కొనుగోలు చేస్తాడు. వాటిని తమ వ్యాపారానికి ఎంపిక చేసుకున్న బడ్డీకొట్లకు పంపుతాడు. అసలు టిక్కెట్లు కొంటేనే వాటిలో అదృష్టం కలిసొచ్చి లాటరీ తగలడం కష్టం, ఇంక వీటికి నకిలీలు కలిపేసి అమ్మితే లక్షల మంది అదృష్టం ఘరానా మోసం మాటున కొట్టుకుపోయినట్టే. అంటే ఆయా లాటరీ సంస్థల నుంచి ఒక వెయ్యి నంబర్ల వరకు టిక్కెట్లు కొంటే, వాటి సీరియల్ నంబర్ 200 నుంచి 1200 వరకు ఉన్నాయనుకుందాం. వీటి విలువ కూడా రూ.లక్ష అనుకుంటే, ఈయన మాత్రం వాటికి మరో రూపది లక్షల నుంచి రూ.కోటి వరకు టిక్కెట్ విలువ ఆధారంగా నకిలీ టిక్కెట్లు కొత్త నంబర్లతో ముద్రించేసి ఆయా దుకాణాల ద్వారా అమ్మేస్తున్నాడు. ఈ రూపంలోనే ఆ నేత రూ.కోట్లకు పడగలెత్తాడని చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు లాటరీ టిక్కెట్‌ల వ్యవహారంలో పోలీసులు పట్టుకున్నా నిషేధిత లాటరీ టిక్కెట్ల విక్రయంపైనే కేసులు నమోదు చేసేవారు. అయితే ఈ నకిలీ రాకెట్ విషయం మాత్రం విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో బయటకు వచ్చాకే తెరపైకొచ్చింది. ఈ వ్యవహారంపై ఇప్పటికైనా పోలీసులు దృష్టిపెడితే పేదల రెక్కల కష్టం దోపిడీకి గురి కాకుండా కాపాడినవారవుతారు.




ఆకర్షణగా లాటరీ టిక్కెట్‌ల ప్రకటన

లక్నోకు ప్రత్యేక గరీబ్ రథ్ రైలు

- గయ, కాశీ, అయోధ్య వెళ్లే యాత్రికులకు ఉపయోగకరం

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గయ, వారణాసి(కాశీ), అయోధ్య తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించే ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు మీదగా గరీబ్ రథ్ రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ప్రకటించింది. ఈ నెల 15, 22(శుక్రవారం) తేదీల్లో నంబరు. 07084 సికింద్రాబాద్ - లక్నో ప్రత్యేక రైలు రాత్రి 7.05కి బయలుదేరి 11.35కి గుంటూరు, ఆదివారం వేకువజామున 4.30కి గయ, ఉదయం 9.15కి వారణాసి, మధ్యాహ్నం 1.35కి అయోధ్య, సాయంత్రం 6 గంటలకు లక్నో చేరుకుంటుంది. నంబరు. 07083 లక్నో - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 18, 25 తేదీల్లో(సోమవారం) ఉదయం 9.50కి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు అయోధ్య, సాయంత్రం 5.30కి వారణాసి, రాత్రి 10.50కి గయ, బుధవారం ఉదయం 7.55కి గుంటూరు, మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మొత్తం ఏసీ త్రీటైర్ బోగీలతో ప్రయాణిస్తాయి.



మగ్గం

పోగు అతకదు.. పని సాగదు

● వర్షంతో ఆగిన మగ్గం

● ఆదుకోవాలని వేడుకుంటున్న నేతన్నలు

చీరాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మంగు వాతావరణంతో నేతన్నల మగ్గాలు ఆగాయి. పని కుంటుపడింది. చేనేత ఉపవృత్తుల పనులు ఆగాయి. దీంతో రోజువారీ మజూరీతో జీవనం సాగించే సగటు చేనేత కార్మికులు భృతికి ఇబ్బంది పడుతున్నారు.వర్షం కురిసినా, మంగు వాతావరణం ఉన్నా మగ్గం పనికి ఆటంకమే. పోగు అతకదు. పని సాగదు. ఇక ఉప వృత్తులలో పడుగులు, పాగళ్లకు సంబంధించిన పనులు పూర్తిగా ఆగిపోతాయి. పెద్ద రకాలు నేసే నేతన్నలకు ఆర్థిక పరిపుష్టి ఉంటుంది. కొన్ని రోజులు పని ఆగినా వారు తట్టుకోగలరు. అయితే సాధారణ కార్మికులు ఏ రోజు పనిచేస్తే ఆ రోజు అన్నట్లు వారి భృతి ఉంటుంది. ఈ క్రమంలో పని ఆగితే వారు అప్పులు చేసే పరిస్థితే. ఇదిలావుంటే కొద్దిరోజులుగా వాతావరణ మార్పులతో జలుబు, జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. అలా వ్యాధిన పడినవారి వైద్య ఖర్చులు, పని ఆగిపోవడంతో రెండు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా తగిన సాయం అందించాలని నిరుపేద నేతన్నలు కోరుతున్నారు.

37 మందికి నోటీసులు.. 107 కేసులు

● రూ.24లక్షల అపరాధ రుసుం వసూలు

● మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : అధికారులకు కనిపించని ఇసుక తవ్వకాలు, రవాణా అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 3వ తేదీన ప్రచురితమైన కథనంపై మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ స్పందించారు. ఆ నేపథ్యంలో తమ కార్యాలయం నోటీస్‌కు వచ్చిన అన్ని ప్రదేశాలను తనిఖీచేసి, అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడిన వ్యక్తులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 37 మంది వ్యక్తులకు నోటీసులు ఇచ్చామన్నారు. కార్యాలయ పరిధిలో ఇప్పటి వరకు 107 కేసులలో రూ.24 లక్షలు అపరాధ రుసుము వసూలు చేసినట్లు వివరించారు. రెవెన్యూ, గనులు, భూగర్భశాఖ సిబ్బంది ఉమ్మడిగా నిర్వహించిన తనిఖీలలో అక్రమ క్వారీయింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసి వేటపాలెం ఎస్‌హెచ్‌వోకు అప్పగించామన్నారు. ఆ క్రమంలో సంబంధీకులకు నోటీసులు జారీ చేశామన్నారు. నిర్ణీత అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేపడితే చర్యలు తప్పవని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



సిద్ధుకు అవార్డును అందజేస్తున్న తెలంగాణ శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నాలెడ్జ్ సెంటర్ ప్రతినిధులు

వెంకటసుబ్బారావుకు ఉత్తమ దారుశిల్పి అవార్డు

పంగులూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన సిద్ధు వెంకట సుబ్బారావు ఉత్తమ దారు శిల్పి అవార్డు అందుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో దేశస్థాయిలో 12 రాష్ట్రాలలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరచిన వారిని గుర్తించి ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జె.పంగులూరు మండల ముప్పవరం గ్రామానికి చెందిన సిద్ధు వెంకటసుబ్బారావు ఉత్తమ దారు శిల్పిగా ఎంపికై అవార్డును అందుకున్నారు. సిద్ధుకు విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం ప్రకటనలో అభినందనలు తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న జేసీ ప్రఖర్ జైన్

ఈనాం భూముల పరిశీలన

మార్టూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్కవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈనాం భూములను గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ మండల రెవెన్యూ సర్వే అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. ఈ రెవెన్యూ పరిధిలో 569 ఎకరాలు ఈనాం భూములు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ పొలాలను రైతులు సాగుచేసుకుంటున్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు గాని ఇతరత్రా ఎలాంటి భూమి హక్కుపత్రాలు లేవు. దీంతో రైతులు తమ భూములను సర్వేచేసి పాస్ పుస్తకాలు ఇప్పించాలని సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతుల ఈనాంభూముల సమస్యను కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో జేసీ ప్రఖర్ జైన్ ఈనాం భూములను పరిశీలించారు. అనంతరం ద్రోణాదుల గ్రామంలో జేసీ కొంతమంది రైతులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వేలో 495 మంది రైతులు తమ పొలాలకు సంబంధించి తప్పులు నమోదయ్యాయని, ఇటీవల జరిగిన గ్రామ సభలో ఫిర్యాదు చేశారు. దాంతో జేసీ బాధిత రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ టీ ప్రశాంతి, సర్వే ఏడీ కనక ప్రసాదరావు, డీఐవోఎస్ శ్రీనివాసరావు, సర్వేయరు ఏడుకొండలు, స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు అడవీధిపాలెం విద్యార్థిని ఎంపిక



యామిని

చినగంజాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దేవండ్ల యామిని రాష్ట్ర కబడ్డీ బాలికల అండర్-14 జట్టుకు ఎంపికైంది. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు తరపున పాల్గొన్నట్లు పాఠశాల హెచ్‌ఎం ఏ.మాధవీలత గురువారం తెలిపారు. అండర్-14 బాలికల కబడ్డీ జట్టులో యామిని ప్రతిభచాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. యామిని 9వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం జాతీయ స్థాయిలో జరిగే రాష్ట్ర కబడ్డీ జట్టులో పాల్గొననున్నట్లు పాఠశాల పీడీ బి.లలిత తెలిపారు. యామినిని హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

26న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలి

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శోభనాద్రీశ్వరరావు పిలుపు



మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అన్నదాతలు పండిస్తున్న పంటలకు డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు మద్దతుధరలు ప్రకటించాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన ఆరు సంవత్సరాలుగా పంటలకు మద్దతు ధర ప్రకటించాలని అనేక రూపాలలో ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో జరిగిన లక్షలాది మంది రైతుల మహాపోరాటాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఉత్తర ప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రధానిమోదీ దేశ వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు తెచ్చిన మూడు నల్లచట్టాలను వెనిక్కి తీసుకోవడమేకాకుండా రైతులకు క్షమాపణలు చెప్పారన్నారు. ఎన్నికల అనంతరం మోదీ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. తిరిగి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేందుకు కుట్ర పన్నాడని మండిపడ్డారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ, పట్టణ పేదలు, కార్మికులు, ప్రజా సంఘాలతో కలెక్టర్ కార్యాలయాల ఎదుట మహాధర్నాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రైతాంగాన్ని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బరితెగించి అడ్డగోలుగా దేశ సంపదను కొల్లగొట్టి సంపన్న వర్గాలకు దోచిపెడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ కొల్లా రాజమోహన్, వడ్డే హనుమారెడ్డి, పమిడి వెంకట్రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, జి. శ్రీనివాసులు, ఎంఎస్ సాయి, పరిటాల కోటేశ్వరరావు, చావలి సుధాకర్, బి.సుబ్బారావు, వి బాల కోటయ్య, ఉబ్బా ఆదిలక్ష్మి, ఎస్‌డీ సర్దార్, పెంట్యాల హనుమంతరావు, జే జయంతిబాబు, నాంచార్లు, ఉబ్బా కోటేశ్వరరావు, శ్రీరామ్ శ్రీనివాసరావు, మండవ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. అనంతరం ఈనెల 26వతేదీన జరగనున్నమహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.

కార్తీకపౌర్ణమికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

అద్దంకి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్లను సీఐ కృష్ణయ్య ఎస్ఐ ఖాదర్ బాషా, ఈవో గుంటుపల్లి వాసుబాబు గ్రామస్థులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుండ్లకమ్మ నది స్నానాల ఘాట్‌లో భక్తులు రద్దీ లేకుండా, లోతుకు వెళ్లకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి కార్తీక దీపాలు వెలిగించే అవకాశం ఉండడంతో అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, క్యూ లైన్‌లో భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరితగతిన దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని సీఐ కృష్ణయ్య సూచించారు. టీడీపీ నేతలు అంజయ్య, బలరామిరెడ్డి, కరిముల్లా, మీరావలి, బడావలి పాల్గొన్నారు.



మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ, ఈవో

వాడరేవులో ప్రత్యేక చర్యలు

● తీరాన్ని పరిశీలించిన ఆర్డీవో, అధికారులు

వాడరేవు(చీరాలటౌన్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తుల రద్దీ పెరగనున్నట్లు అధికారులు తెలిపారు. ఈక్రమంలో గురువారం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, రూరల్ సీఐ శేషగిరిరావు వాడరేవు సముద్రతీరంలో పర్యటించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆర్డీవో వివరించారు. కార్యక్రమంలో వారివెంట ఈపూరుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్, ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



వాడరేవు సముద్రతీరంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న అధికారులు

గట్టి బందోబస్తు

చినగంజాం : మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం తీరప్రాంతాల వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఇంకొల్లు సీఐ రమణయ్య తెలిపారు. పోలీసుస్టేషన్‌లో తీరప్రాంతాల వద్ద బందోబస్తుకు నియమించిన సిబ్బందికి గురువారం రాత్రి ఆయన పలు సూచనలు అందజేశారు.

12 ఏళ్ల సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే చొరవతో ఆలేరు వాగు నిర్వాసితులకు పరిహారం

ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

ఏలూరికి రైతుల కృతజ్ఞతలు

కారంచేడు(పర్చూరు), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : 12 ఏళ్ల సమస్యకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో పరిష్కారం లభించింది. ఆలేరు వాగు (లెఫ్ట్ ఆర్మ్) కాలువ నిర్మాణానికి 2012లో ప్రభుత్వం జలవనరుల శాఖ కారంచేడు, ఇంకొల్లు మండలాల పరిధిలోని 11 గ్రామాల రైతుల నుంచి 117.27 ఎకరాల పంట భూమిని తీసుకుంది. ఆలేరు లెఫ్ట్ ఆర్మ్ కింద 260 మంది కుటుంబాలకు పరిహారం కింద రూ.16కోట్లు చెల్లించేలా నిర్ణయించింది. తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో రైతుల భూములకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం హెడ్ ఆఫ్ అకౌంట్‌లో తప్పులు దొర్లాయి. దీంతో ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన పరిహారం అందలేదు. 2020లో అప్పటి ప్రభుత్వం చుట్టూ రైతులు పలుమార్లు తిరిగినా ఫలితం దక్కలేదు. దీంతో 2023లో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. 2024లో రైతులకు పరిహారం అందించాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వాన్ని, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు సమస్యను వివరించారు. ఏలూరి అభ్యర్థనపై స్పందించిన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ జీవో-392 విడుదల చేశారు. అర్హులైన రైతులందరికీ పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంతరావూరు నుంచి సూదివారిపాలెం వరకు వరద కాలువ నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు రూ.18కోట్లు పెంచుతూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ఏలూరికి ఆలేరు రైతు సంఘం పక్షాన గంటా విజయ్ కుమార్‌తోపాటు పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



తరచూ వరదలతో ఉధృంగా ప్రవహిస్తున్న ఆలేరు వాగు (ఫైల్)

చీరాలలో కుండపోత



వాడరేవు జిల్లా పరిషత్ పాఠశాలను చుట్టుముట్టిన వర్షపు నీరు

● వాగులను తలపిస్తున్న రోడ్లు ● వాడరేవు హైస్కూల్ జలమయం

● ఆందోళనలో మొక్కజొన్న రైతులు

చీరాలటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా చీరాల మండల పరిధిలో కుండపోత వర్షం పడుతోంది. ఈక్రమంలో ప్రధాన రహదారులు సైతం వాగులను తలపిస్తున్నాయి. ఇదిలావుంటే ఏకంగా వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కూడా వర్షపు నీరు చుట్టుముట్టింది. ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో పాఠశాల జలమయమైంది. దీంతో ఉపాధ్యాయులు, చిన్నారులు నానా అవస్థలు పడ్డారు. కొన్ని గంటలపాటు రోడ్లు సైతం కనుచూపు మేర కనబడిన దాఖలాలు లేవు. ఈపూరుపాలెం ఎస్‌టీఐ సెంటర్, మార్కెట్ సెంటర్‌లతో పాటు పలు గృహాల్లో కూడా మండల పరిధిలో నీళ్లు ఇళ్లల్లోకి చేరాయి. రహదారులు, డ్రెయిన్‌లు నిండడంతో వాహనదారుల ప్రయాణం నరకప్రాయంగా మారింది. మరోవైపు మండల పరిధిలో గతవారం రోజుల్లో అధిక సంఖ్యలోనే రైతులు మొక్కజొన్న చల్లారు.

పొలాల్లో నీరు నిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే మొక్క దశలో ఉన్నసాగుకు ఇబ్బంది ఉండదని, దాదాపుగా 15 రోజుల్లోని సాగుకు ఇప్పటివరకు పడిన వర్షంతో పెద్దగా ఇబ్బంది ఉండదని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు వీడకుంటే పోరాడతాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు వీడకపోతే ప్రజలతో కలిసి వామపక్షాలు పోరాడుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సీపీఎం నగర 13వ మహాసభలు ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో నగర కార్యదర్శి జి.రమేష్‌న జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు భారం రూ.17వేల కోట్లు ప్రజలపై వేయనున్నారని ఆరోపించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ఈనెల, వచ్చే నెలలో ప్రజలపై ఈ భారం పడనుందని, కేంద్ర చెప్పిన విద్యుత్ సవరణలో భాగంగానే ప్రజలపై ఈ భారం పడుతుందని తెలిపారు. ఎన్నికల్లో గెలిస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు ఇప్పుడు విద్యుత్ భారాలు వేసేందుకు సిద్ధం అవుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల విధానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు నిత్యావసర ధరలు తగ్గించాలని అడుగుతుంటే మద్యం ధరలు తగ్గించామని ప్రభుత్వం చెబుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మహిళలు, దళితులపై సీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ నెలరోజులుగా నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, దామా శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, ఎస్‌డీ.హుస్సేన్, తంగిరాల మహేష్, కొర్నెపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల్లో కలవరం

● అవినీతి సిబ్బంది తొలగింపునకు చర్యలు

● విచారణలో కొత్తగా నకిలీ ఆర్పీలు వెలుగులోకి..

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మెప్మాలో అవినీతి రిసోర్స్‌పర్సన్(ఆర్పీ)లపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంతో కలవరం మొదలైంది. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మెప్మాలో మెక్కుడు' కథనంతో కొందరు అవినీతి ఆర్పీల్లో భయం మొదలైంది. అయితే ఇందుకు సంబంధించి పీడీ రవికుమార్ విచారణ మొదలు పెట్టినట్లు తెలిసింది. ఇదిలా ఉంచితే.. విచారణలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల కాలంలో పెళ్లూరులో రెండు నకిలీ గ్రూపులు కెనరాబ్యాంకులో రుణాలు పొందినట్లు సమాచారం. దీంతో మెప్మా అధికారులు దీనిపై దృష్టి సారించగా, సంబంధిత ఆర్పీ ఈ వ్యవహారంలో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలిసింది. మరోవైపు అసలు మెప్మాకు సంబంధం లేని కొందరు ప్రైవేటు మహిళలు ఆర్పీలుగా చెలామణి అయ్యారు. స్థానిక శర్మాకాలేజీ వెనుక సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన ఓ మహిళ తాను ఆర్పీనంటూ పొదుపు గ్రూపులను బురిడీ చేసి భారీగా దోచేయగా, భాగ్యనగర్‌కు చెందిన మరో మహిళ ఆర్పీగా గత రెండేళ్ళుగా చెలామణి అవుతూ కోట్లు రూపాయాలలో దోచేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంచితే దారవారితోటలో గతంలో ఆర్పీగా పనిచేసి ఓ ఉద్యోగి అవినీతి ఆరోపణలపై ఉద్యోగం నుంచి తొలగించారు. అదే స్థానంలో మరో యువతి తాను ఆర్పీనంటూ ఎలాంటి అధికారిక ఉత్వర్వులు లేకుండానే పొదుపు గ్రూపులతో మమేకమై రుణాల మంజూరులో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అయితే అవినీతి ఆర్పీలపై పీడీ రవికుమార్ సీరియస్‌గా దృష్టి సారించారు. బ్యాంకు మేనేజర్లుతో బోగస్ గ్రూపుల గురించి చర్చించారు. ఇప్పటికే నకిలీ ఆర్పీలుగా చెలామణి అవుతూ పొదుపు సంఘాలను మోసం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

కబ్జా చేస్తే.. కటకటాలే

(5వ పేజీ తరువాయి)

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో భూమాఫియా రెచ్చిపోయింది. అధికార పార్టీ నేతలు, పోలీసులను తమ గుప్పెట్లో పెట్టుకుని ఖరీదైన భూములను కొట్టేశారు. ఒకవైపు ప్రభుత్వ, అసైన్డ్ భూములు, చుక్కల భూములు వంటి వాటిని సైతం తమ మాయాజాలంతో చేతులు మార్చుకున్నారు. పేదలు, అమాయకుల ఆస్తులను తప్పుడు రిజిస్ట్రేషన్లతో వశం చేసుకున్నారు. ప్రశ్నించిన వారిపై ఎస్సీ, ఎస్టీ సహా తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ, జనసేన రాష్ట్ర కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభించారు. మరోవైపు లోకేశ్ కూడా తన నివాసంలో బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్నారు. గడిచిన ఐదు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న ఫిర్యాదుల్లో 80 శాతానికి పైగా ల్యాండ్ మాఫియా సాగించిన భూకబ్జాలపైనే కావడంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. మరోవైపు నాడు అధికారాన్ని వెలగబెట్టిన వారిలో అనేకమంది మంత్రులు, ఎమ్మెల్యేలు కీలక పదవుల్లో ఉన్న నాయకులు, వైసీపీ ముఖ్య నేతలు పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను తమ పేరిట, అనుయాయుల పేరిట, బినామీ పేర్లతో కొట్టేశారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం ల్యాండ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించుకుని పకడ్బందీగా భూకబ్జా నిషేధిత చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిపై ఈ నెల 4న జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రి మండలి ఆమోదముద్ర కూడా వేసింది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిని ఆమోదించనున్నారు. ఈ నేపథ్యంలో రానున్న కొద్ది నెలల్లో ఈ చట్టం అమల్లోకి రాబోతుంది.

ఎస్పీ గ్రీవెన్స్‌కు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు


భూకబ్జాలకు సంబంధించి ప్రతి సోమవారం బాధితులు పెద్దసంఖ్యలో గుంటూరు, బాపట్ల, పల్నాడు ఎస్పీ కార్యాలయాల్లో జరిగే గ్రీవెన్స్‌లకు పోటెత్తుతున్నారు. ఎస్పీల గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం భూకబ్జాలకు సంబంధించినవే ఉంటుండటం గమనార్హం. ఎస్పీ కార్యాలయం నుంచి సంబంధిత స్టేషన్‌లకు వెళ్ళినా పోలీసులు సివిల్ వివాదమని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో బాధితుల గోడు వినేవారే కరువవుతున్నారు. కోట్ల ఖరీదైన సామాన్యుల భూములను చట్టంలో ఉన్న లొసుగులను, రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని కొట్టేశారు. సంచలనం సృష్టించిన గుంటూరు శ్యామలానగర్‌లో జరిగిన భూకబ్జా వ్యవహారం మొదలు ఇటీవల వరకు ఎన్నో ఉదంతాలు చోటుచేసుకున్నాయి. శ్యామలానగర్‌లో జరిగిన భూకబ్జా వ్యవహారంలో ఏకంగా డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది సస్పెన్షన్‌కు గురైన వ్యవహారం తీవ్ర కలకలం రేపిన విషయం విదితమే. ఆ తర్వాత గుంటూరు పలకలూరు రోడ్డులోను ఇదే తరహాలో అనేక భూకబ్జా ఘటనలు చోటుచేసుకున్నాయి.

ఆరు నెలల్లోనే విచారణ పూర్తయ్యేలా చట్టం

అమాయకులు, వృద్ధులు, ఎన్ఆర్ఐల భూములపై కన్నేసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి డబుల్ రిజిస్ట్రేషన్ చేసి వివాదం సృష్టిస్తే కోర్టుల చుట్టూ తిరగలేక వారే దారికి వస్తారులే అని ఇప్పటిదాకా భూములు కొల్లగొట్టిన ల్యాండ్ మాఫియా ఆటలు ఇక సాగవు. కొత్తగా వస్తున్న ఈ చట్టం ప్రకారం ఏ వివాదమైనా ఆరు నెలల్లో విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇంతకు ముందు మాదిరిగా కేసు కొట్టేయడం కాదు. భూమి ఆక్రమించినట్లు తేలితే నిందితుడిపై కఠిన చర్యలు ఉండనున్నాయి. నిందితుడికి కనీసం 10 నుంచి 14 ఏళ్లకు తక్కువ కాకుండా జైలుశిక్ష విధించనున్నారు. అంతేకాదు ఆక్రమించిన భూమి విలువతో పాటు మూడు రెట్ల వరకు నిందితుడి నుంచి నష్ట పరిహారం వసూలు చేయనున్నారు. ఇందుకుగాను ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కోర్టుల్లో కేవలం భూ కబ్జా కేసులు మాత్రమే విచారించనున్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఆయా కోర్టులే నేరుగా సుమోటోగా కేసులు విచారణ చేపట్టే అధికారాలు కూడా కల్పించనున్నారు. భూకబ్జాలకు పాల్పడే మాఫియాకు ఏ మాత్రం అవకాశం, లొసుగులకు ఆస్కారం లేకుండా నూతన చట్టాన్ని తీసుకురాబోతున్నారు.

డిప్యూటీ స్పీకర్‌కు ఏలూరి ఆత్మీయ అభినందనలు

పర్చూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన రఘురామకృష్ణరాజు (ఆర్ఆర్ఆర్)కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఆయన రఘురామను ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని అభినందనలు తెలిపారు.



రఘురామ కృష్ణరాజుతో ఎమ్మెల్యే ఏలూరి ఆత్మీయ పలకరింపు

అన్నీ సమకూర్చితే ప్రైవేటు కన్నా మిన్న

- చీరాల ఏరియా వైద్యశాలలో ఖాళీ పోస్టుల భర్తీ అనివార్యం
- ఉన్న వనరులను వినియోగించుకోవాలి
- అదనపు వనరులను సమకూర్చుకోవాలి
- అవినీతి ఆరోపణలకు చెక్ చెప్పాలి
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ క్రియాశీలకంగా వ్యవహరించాలి
- సిఫార్సులను కాస్త పక్కన పెట్టాలి

చీరాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల పలు ప్రైవేటు ఆసుపత్రులకన్నా మిన్నగా ఉంటుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే వైద్యులు, సిబ్బంది ఖాళీల భర్తీ అనివార్యం. దీంతో పాటు వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల ప్రేమతో మెలగాలి. సేవా భావం ఉండాలి. రాజకీయ నాయకులు, మీడియా తదితర సిఫార్సులను ఒకింత పక్కన పెట్టాలి. అందుకు సంబంధీకులకు స్వీయ నియంత్రణ ఉండాలి. ఆసుపత్రికి వచ్చిన రోగి వ్యాధిని బట్టి ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే ఏరియా వైద్యశాలపై ఉన్న అపోహలు తొలుగుతాయి. నిరుపేదలకు పారదర్శమైన వైద్యసేవలు అందుతాయి. అందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మందులు తీసుకునేందుకు క్యూలో ఉన్న పేషెంట్లు

100 పడకల ఆసుపత్రి.. కార్మికుల కొరత

చీరాల ఏరియా వైద్యశాల 100 పడకల ఆసుపత్రి. అయితే అందుకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది, కార్మికుల కొరత వెంటాడుతోంది. వైద్యుల భర్తీ త్వరలో జరుగుతుందని చెప్తున్నారు. ఇదిలావుంటే సెక్యూరిటీ, శానిటేషన్‌కు సంబంధించి గతంలో 50 పడకల ఆసుపత్రిగా ఉన్నప్పుడు ఎంత మంది ఉన్నారో. ఇప్పుడు అదే సంఖ్య కొనసాగుతోందని చెప్తున్నారు. ఆ సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. అందుకు ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

వైద్యులు..విధులు

వైద్యులు ఉదయం 9 గంటలకు విధుల్లో చేరాలి. సాయంత్రం 4 గంటల వరకు పనిచేయాలి. మధ్యాహ్నం 2 గంటల నుంచి మరసటి రోజు ఉదయం 9 గంటల వరకు ఒక డ్యూటీ డాక్టర్ ఉంటారు. 10 రోజులకు ఒక సారి ఒకరి వంతు వస్తుంది. డ్యూటీ డాక్టర్ సమయంలో ఏదన్నా ఎమర్జెన్సీ కేసు వస్తే, సంబంధిత డాక్టరుకు సమాచారం తెలిపి పిలిపించి వైద్యం చేయించాలి. తప్పనిసరి పరిస్థితి అయితే వేరే ఆసుపత్రికి రిఫర్ చేస్తారు.

పోస్టుమార్టం.. ఆరోపణలు

పోస్టుమార్టం సాధారణంగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం లోపు చేయాలి. ప్రత్యేక సందర్భాల్లో సూర్యాస్తమయం తరువాత పోస్టుమార్టం చేయాల్సివస్తే ఆర్డీవో అనుమతి అవసరం. సాధారణంగా డ్యూటీ డాక్టర్ ఎవరైతే ఉంటారో ఆ సమయంలో వచ్చిన మృతదేహాలను వారే పోస్టుమార్టం చేయాలి. ఇది కూడా రోస్టర్ విధానం అమలవుతుంది. నెలకు సుమారు 20 నుంచి 30 పోస్టుమార్టంలు జరుగుతుంటాయి. పోస్టుమార్టంకు సంబంధించి కొందరు మృతుల కుటుంబ సభ్యుల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ ప్రముఖుని కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే పోస్టుమార్టం నేపథ్యంలో వారిని విసిగించి రూ.15వేలు తీసుకున్నారని, ఓ నిరుపేద కుటుంబంలో యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10వేలు వసూలు చేశారని ఓ దశలో విస్తృత ప్రచారం జరిగింది. వసూలు చేసే మొత్తంలో కాస్త అటు, ఇటు ఉన్నా పోస్టుమార్టం ప్రక్రియకు ఎంతో కొంత ముట్టచెప్పక తప్పడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

సిఫార్సులను ఒకింత పక్కన పెట్టాలి

ఏరియా వైద్యశాలలో సిఫార్సుల ప్రభావం పెరిగింది. కొందరు ప్రజాప్రతినిధులమని, వారి ముఖ్య అనుచరులమని, మీడియా అని, మరికొందరు ప్రముఖులమని చెప్తూ రోగుల తరఫున వకాల్తా పుచ్చుకుని వారు చెప్పిన వారికి వెంటనే వైద్యం చేయాలని డిమాండ్ చేస్తుంటారు. ఇది నిజమైనా తాము కాదని చెప్పలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆసుపత్రి వర్గాలలో పలువురు చెప్పడం విశేషం. ఈ నేపథ్యంలో సిఫార్సుల కన్నా వచ్చే రోగుల సమయం, వ్యాధి ప్రాధాన్యతను బట్టి సకాలంలో వైద్యం అందిస్తే ఆసుపత్రికి మరింత ఆదరణ పెరుగుతుంది.

షుగర్ .. గర్భకోశ వ్యాధులు .. కంటి సమస్యలు

చీరాల నియోజకవర్గంలో చేనేత కార్మికులు ఎక్కువ. అందులో ఎక్కువ మందికి షుగర్ సమస్య. మగ్గంపై నూలు పోగును తాకుతూ చేసే ప్రక్రియలో షుగర్ వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెప్తున్నారు. గుంటమగ్గంపై నేత నేసే మహిళలకు గర్భకోశ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, దారపు పోగులను నిశితంగా చూస్తూ చేసే పనికావడంతో కంటి సమస్యలు కూడా ఎక్కువగా వస్తుంటాయని గతంలో ఏరియా వైద్యశాలలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో వెల్లడైంది. ఆసుపత్రిలో కంటి విభాగపు వైద్యునికి అసిస్టెంట్ లేకపోవడంతో అందరికీ సేవలు సకాలంలో అందడం లేదు. షుగర్, గర్భకోశ వ్యాధులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని చెప్తున్నారు.

రోగుల పట్ల ప్రేమతో మెలగాలి

ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల పట్ల వైద్యులు, సిబ్బంది ప్రేమతో మెలగాలి. కేవలం ఉద్యోగ ధర్మమే కాకుండా కొంత సేవా భావం కలిగి ఉండాలి.

తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉంది.. మహాప్రస్థానం వాహనం లేదు

ప్రస్తుతం ఆసుపత్రి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు రెండు ఉన్నాయి. దీంతో కాన్పు తరువాత ఆ వాహనాల్లో సంబంధీకులను వారివారి ఇళ్లకు ఉచితంగా చేరుస్తున్నారు. మహాప్రస్థానం వాహనం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉంది. తరువాత వైసీపీ వచ్చాక అది కనుమరుగైంది. దీంతో మృతదేహాలను తీసుకెళ్లేందుకు సంబంధీకులు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

స్ట్రెక్చర్లు .. వీల్ చైర్‌లు

సాధారణంగా ఏరియా వైద్యశాలకు వచ్చే కేసుల్లో సాధారణ వ్యాధి గ్రస్తులతో పాటు, రోడ్డు ప్రమాదాలు, కొట్లాటలు, రైలు ప్రమాదాలలో గాయపడినవారు ఎక్కువగా ఉంటారు. కొన్ని సమయాల్లో వృద్ధులు వస్తుంటారు. అలాంటి సందర్భాల్లో స్ట్రెక్చర్లు, వీల్ చైర్‌లు అత్యవసరంగా అందుబాటులో ఉండాలి. పలు సందర్భాల్లో అవి అందుబాటులో లేక సంబంధిత క్షతగాత్రులు లేదా రోగుల వెంట వచ్చిన వారే ఆసుపత్రిలోకి తీసుకెళుతున్న సందర్భాలు పదేపదే పునరావృత్తం అవుతున్నాయి. అది ఆసుపత్రికి చెడ్డ పేరు తెస్తుంది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అదనపు వనరులను సమకూర్చుంటే ఏరియా వైద్యశాల ప్రైవేటు వైద్యశాలల కన్నా మిన్న అనడంలో ఎలాంటి సందేహం లేదు.

> **రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సమష్టి కృషి చేస్తాం**
>
> రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ఉమ్మడిగా కృషి చేస్తాం. చిన్న, చిన్న లోపాలు ఉంటే సరిదిద్దుకుంటాం. అందుకు ఆసుపత్రికి వచ్చేవారు కూడా సహకరించాలని కోరుతున్నాం. సిఫార్సుల ప్రభావంతో కొంత ఇబ్బంది ఉండడం వాస్తవమే. పోస్టుమార్టం నేప థ్యంలో వచ్చే ఆరోపణలు గతంలో ఉన్నమాట వాస్తవమే. ఇప్పుడు కూడా కొనసాగుతున్నాయంటే బాధితులు ఎవరైనా మా దృష్టికి తెస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. మహాప్రస్థాన వాహనం పునరుద్ధరణ, ఖాళీల భర్తీకి కమిషనర్‌కు నివేదించాం. ఆసుపత్రిలో అంతా ఉచితమే. ఇన్‌పేషెంట్లకు దాతలు భోజనం అందిస్తున్నారు.
>
> - డాక్టర్ సుభాషిణీ, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, చీరాల


రోడ్డు పనులను ప్రారంభించిన టీడీపీ నాయకులు

రోడ్డు పనులు ప్రారంభం

యద్దనపూడి, (మార్టూరు) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి నుంచి యనమదల వెళ్లే రోడ్డు మరమ్మతు పనులను గురువారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఈ రోడ్డు మరమ్మతులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రూ.10 లక్షల నిధులు మంజూరుచేయించారు. దాంతో పనులను ప్రారంభించారు. అధికారులు, గ్రామస్థులతో టీడీపీ నాయకులు దొడ్డ భద్రయ్య, సింగు చంద్రశేఖర్, కిరణ్ పాల్గొన్నారు. వీలయినంత త్వరితంగా రోడ్డు మరమ్మతులను ఎలాంటి లోపాలు లేకుండా పూర్తిచేయాలని నాయకులు అధికారులును కోరారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా మాధవి


మండల సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు

పంగులూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం ఎంపిక గురువారం వెలుగు కార్యాలయంలో జరిగింది. సమాఖ్య అధ్యక్షురాలిగా జనకవరం గ్రామానికి చెందిన ఏజండ్ల మాధవి ఎంపికయ్యారు, ఉపాధ్యక్షురాలిగా చందలూరు గ్రామానికి చెందిన కందిమళ్ల శైలజ, కార్యదర్శిగా బూదవాడకు చెందిన వజ్రాల కమలాదేవి, కోశాధికారిగా కరి భారతి (పంగులూరు), ఉప కార్యదర్శిగా యర్రం పద్మావతి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఏపీఎం జ్యోతి ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలో ఎం.రమేష్‌బాబు, అద్దంకి క్లస్టర్ లీగల్ కోఆర్డినేటర్ కె.విజయభాస్కర్, సీసీలు సాల్మన్, సురేష్, చంద్ర, గ్రామ సమాఖ్యల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలల దినోత్సవం

నెహ్రూకి ఘనంగా నివాళి

అద్దంకిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం కార్యాలయంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా ఆయనందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, దేవపాలన, చంద్రమౌళి, అంజనేయులు అంజాద్ బాషా పాల్గొన్నారు. అలాగే ఎన్టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కోట అంజమ్మ అధ్యక్షతన బాలల దినోత్సవం, నెహ్రూ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్ళర్పించారు.

చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉపయోగపడే గ్రంథాలయ ప్రాధాన్యతను తెలుసుకుని సద్వినియోపర్చుకోవాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అద్దంకిలోని బంగ్లారోడ్డులో ఉన్న శాఖ గ్రంథాలయం వద్ద వేడుకలను లైబ్రేరియన్ సీహెచ్ సుగుణరావు అధ్యక్షతన ఘనంగా ప్రారంభమయ్యాయి.


చినగంజాంలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్, ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.

పంగులూరు : మండల కేంద్రమైన పంగులూరులో గురువారం జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో బత్తుల వారి వీధిలోని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి రోటరీ అధ్యక్ష కార్యదర్శులు షేక్ కాలేషా వలి, డాక్టర్ బత్తుల వీరనారాయణ, క్యాంప్ చైర్మన్ వీరరాఘవయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీల, విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు, జాగ్గమూడి సుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, పోలిశెట్టి సీతారామయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

మార్టూరు : క్రమశిక్షణతో చదువుకుంటే మీకు తప్పనిసరిగా చక్కని జీవితం, మంచి భవిష్యత్తు ఉంటుందని శ్రీహర్షిణి విద్యా సంస్థలు చైర్మన్ గోరంట్ల రవికుమార్ అన్నారు. బాలలదినోత్సవం సందర్భంగా గురువారం మార్టూరులో శ్రీహర్షిణి విద్యా సంస్థలో విద్యార్థులకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే రాయల్ పయనీర్ స్కూల్‌లో నెహ్రూ జయంతిని కరస్పాండెంట్ పి.రవీంద్రబాబు నిర్వహించారు.

చినగంజాం : గ్రంథాలయంలో వారోత్సవాలు గురువారం ప్రారంభమ య్యాయి. గ్రంథాలయ వారోత్సవాలను సర్పంచ్ రాయని ఆత్మారావు ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి గ్రామ సర్పంచ్, ఎంఈవో, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. చినగంజాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వేసిన దేశ నాయకుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఇంకొల్లు మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం బాలలదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూకు నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ఆదరణ

గోవాడలో ఢిల్లీ కంపెనీ ప్రతినిధుల సందర్శన

అద్దంకిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ఆదరణ రాబోతుందని, నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలందరికీ అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోగ్య, పోషణ వింగ్, ఏపీ సీఎన్ఎఫ్ అధికారి లక్ష్మీదుర్గ అన్నారు. గురువారం ఢిల్లీ నుంచి వచ్చిన వివిధ కంపెనీల ప్రతినిధులు శివమ్ దూబే, బాపట్ల జిల్లా మేనేజర్ వాణిశ్రీ, ఏవో కొర్రపాటి వెంకటకృష్ణతో కలిసి మండలంలోని గోవాడలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న నరిశెట్టి రమేష్‌బాబు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. క్షేత్రంలోని పలు రకాల కషాయాలు బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటివి తయారీ విధానాలను, వాటి ఉపయోగాలను రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. రసాయన ఎరువులు పురుగు మందుల అవశేషాలు లేని ఆహార ఉత్పత్తుల వినియోగం పెరగడం వలన ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఢిల్లీ ప్రతినిధులు

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

చీరాలటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నివేశన స్థలాలు అందించి నిరుపేదలకు సాయం అందించాలని సీపీఎం నాయకుడు ఎస్.బాబూరావు అన్నారు. గురువారం చీరాల ఏరియా కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీలు అరికట్టాలని, ఉచిత ఇసుక పాలసీను పారదర్శకంగా అమలు చేయాలని, నిత్యావసరాల ధరలను తగ్గించాలని కోరారు. తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వసంతరావు, ఎల్.జయరాజ్, నారపరెడ్డి, ప్రసాద్, సుబ్బారావు, జిలానీ, శేషయ్య వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం అధిక ధరలు, ఇతర సమస్యలపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రావులపల్లి కోటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు కె.ప్రమీల, హనుమంతరావు పాలొన్నారు.


అద్దంకి తహసీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

మార్టూరు : నిత్యావసరవస్తువుల ధరలను తగ్గించాలని గురువారం కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో కార్యాలయంలో సీపీఎం నాయకులు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, హనుమంతరావు, రాంబాబు, సూరిబాబు, ఇబ్రహీం, మొఘల్ పాల్గొన్నారు.

చినగంజాం : మహిళలు, మైనార్టీలు, దళితులపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలని సీపీఎం మండల కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు, స్థానిక సమస్యల పరిష్కారానికై గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జి.ప్రభాకరరావుకు వినతి పత్రం అందజేశారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో బత్తిని సింగయ్య

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయండి

అద్దంకిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉన్న వనరులను, నిధులను ఉపయోగించుకుని రాబోయే ఏడాది గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని వాటిపై తగిన అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళికలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గడిచిన ఏడాదిలో పెట్టిన ఖర్చులు, రాబడి, ఉన్న వనరులు, చేయాల్సిన అభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ పొందిన అధికారులు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అభివృద్ధికి సంబంధించి ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ సలహాలు సూచనలు ఇచ్చి సహకరించాలన్నారు. సందర్భంగా టీవోటీలు నాగేశ్వరరావు, మలికార్జునరావు, అభి తదితరులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాదరావు, ఏవో వెంకటకృష్ణ, ఏపీఎం కోటేశ్వరరావు, ఏపీవో గాయత్రి, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేపు శిక్షణ

చినగంజాం : ఎంపీడీవో కార్యాలయంలో 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికలు తయారీపై ఈ నెల 16వ తేదీన శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గురువారం ప్రకటనలో తెలిపారు. 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే శిక్షణలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఇంకొలు : గ్రామ అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు ఆదేశించారు. కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రాజ్యలక్ష్మి, ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో సమయపాలన పాటించాలి

పంగులూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. మండలంలోని కొండమూరు సచివాలయంలో గురువారం గృహనిర్మాణ శాఖ హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌కు సంబంధించిన సర్వేపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. బయోమెట్రిక్ హాజరుకు సంబంధించి సిబ్బంది 10 గంటల 30 నిమిషాలకు హాజరు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కె.సుమంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య ప్రగతి కార్డుల పంపిణీ

మార్టూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఆరోగ్య ప్రగతి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతి నెలలో వచ్చే ఆరోగ్య పరమైన మార్పులను నమోదు చేయడంతో పాటు, వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని ఆరోగ్య సిబ్బంది మౌనిక, భవాని తెలిపారు. రోజుకు 30 మందిని పరీక్షించి వివరాలను నమోదుచేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు రామకోటేశ్వరరావు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అద్దంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో సంవత్సరాల నుంచి 108లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా కార్యదర్శి హరిబాబు కోరారు. 108ని నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, 8 గంటల పనివిధానం అమలు చేయాలని, ఉద్యోగి చనిపోతే 20 లక్షల బీమా కల్పించాలని, రద్దు చేసిన పాత జీవో-49ని పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె నోటీసును తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్యకు అందజేశారు.


తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న హరిబాబు

లారీ బోల్తా .. తప్పిన ప్రమాదం

వేటపాలెం(చీరాల), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : 216 జాతీయ రహదారిలో పత్తి విత్తనాల లోడుతో వెళుతున్న లారీ గురువారం అక్కాయిపాలెం సమీపంలో బోల్తా పడింది. అక్కాయిపాలెం సమీపంలో లారీ డ్రైవర్ విద్యుత్ తీగలను తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడిందని చెప్తున్నారు. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీరాలటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల - వేటపాలెం రైల్వే స్టేషన్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతి చెందారు. ఈమేరకు రైల్వే పోలీసులు వివరాలు నమోదు చేసి, మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. అతని వద్ద ఎటువంటి ఆనవాళ్లు లేవు.

అక్కయ్య చౌదరికి నివాళి



నివాళి అర్పిస్తున్న ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు

కారంచేడు (పర్చూరు), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏఎంసీ మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి దశదిన కర్మ సందర్భంగా గురువారం కారంచేడులోని ఆయన నివాసం వద్ద ఎమ్మెల్యే ఏలూరి కార్యాలయ ప్రతినిధులు అక్కయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు కార్యాలయం ప్రతినిధులు శ్రీకాంత్, వెంకట్ పాల్గొన్నారు.


వ్యాధులపై సర్వే ప్రారంభం

ఇంకొల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వ్యాధులపై గురువారం సర్వే ప్రారంభించారు. బీపీ, షుగర్, కేన్సర్ వ్యాధులపై సర్వే నిర్వహించి కేసులను నిర్ధారించి తగిన వైద్య సేవలను అందజేస్తారని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు టి.అంజలి, భానుప్రకాశరావు తెలిపారు. ప్రతి గురు, శనివారాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. చిన్నపిల్లల్లో నిమోనియా లక్షణాలు గుర్తించి వైద్య సేవలందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అంజలి,భానుప్రకాశరావు, సీహెచ్‌వో కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నెల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది నుంచి ప్రతిఏటా వందలాది టీఎంసీల నీరు సముద్రం పాలవుతుంటే.. గ్రేటర్ రాయలసీమ ప్రాంతం మాత్రం నీటి కొరతతో అల్లాడుతోంది. గోదావరి నుంచి సముద్రం పాలయ్యే నీటిలో సగం నీటిని పెన్నానదికి తరలించినా ఇక్కడి భూముల్లో సిరులు పండుతాయి. లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. గోదావరి - పెన్నా నదుల అనుసంధానంతోనే ఇది సాధ్యపడుతుంది. ఇది బృహత్తర ప్రాజెక్టు అయినప్పటికీ ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అయితే ఎంత ఖర్చయినా ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని 2014-19 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ముందడుగు వేసింది. అప్పట్లో డిజైన్లు కూడా చేశారు. కానీ వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ నదుల అనుసంధానం ఊసే కనిపించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ ఈ ప్రక్రియలో కదలిక వచ్చింది. ఎలాగైనా ఈ ప్రాజెక్టును మొదలుపెట్టాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం.. అందుకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు బుధవారం ఇంజనీరింగ్ నిపుణులతో కీలక సమావేశం నిర్వహించారు. గోదావరి నుంచి పెన్నానదికి నీటిని ఎలా తరలించాలన్న దానిపై చర్చించారు. అందుకు అనువైన పలు మార్గాలపై సమీక్షించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నెల్లూరు జిల్లా సస్యశ్యామలమవుతుంది. మెట్టప్రాంతాల్లో బీడుగా ఉంటున్న లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి.దీంతో ఈ నదుల అనుసంధానంపై జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



గోదావరి జలాలు తరలింపు మార్గమిలా..

పెన్నమ్మకు
గౌతమి పలకరింపు


- పురోగతిలో నదుల అనుసంధానం ప్రక్రియ
- తొలుత గోదావరి నీళ్లు కృష్ణానదికి...

● అనంతరం కృష్ణా నుంచి పెన్నాకి.. ● ఈ ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం ● మెట్టకూ నీరందే అవకాశం

● జిల్లాకు వరం

రాష్ట్రంలో మరే జిల్లాలో లేని విధంగా నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు మేజర్ జలాశయాలు ఉన్నాయి. ఈ రెండింటి సామర్థ్యం 146 టీఎంసీలు. ఈ రెండు ప్రాజెక్టులు కూడా పెన్నా నదిపైనే ఆధారపడ్డాయి. పెన్నాకు వరద వచ్చినప్పుడు మాత్రమే ఇవి నిండుతున్నాయి. అప్పుడు మాత్రమే జిల్లాలో పూర్తి ఆయకట్టు సాగవుతుంది. పెన్నాకు వరదలు రాకపోతే ఇక ఆ ఏడాది బీడు పెట్టుకోవాల్సిందే. గతేడాది కూడా

- మిగతా 6లో



పెళ్లికి వేళాయె...

ఈనెల, వచ్చే నెలలో సుమారు 20 రోజులకుపైగా శుభముహూర్తాలు ఉన్నాయి. ఈ ముహూర్తాలలో సుమారు 90వేల జంటలు ఒకటి కానున్నాయి. దీంతో జిల్లాలోని కల్యాణ మండపాలు, మినీ ఫంక్షన్ హాళ్లు, సత్రాలు, ఆలయాల్లో వివాహ వేదికలు మూడు నెలలు ముందుగానే బుక్ అయిపోయాయి. పదేళ్ల క్రితం ఉన్న కల్యాణ వేదికలకు ప్రస్తుతం మూడు రెట్లు పెరిగినా, ఇంకా డిమాండ్‌గానే ఉంది. ఈ ఏడాది పెళ్లిళ్ల సీజన్‌కి గతం కంటే దాదాపు 30 నుంచి 50 శాతం మేర అన్నీ రేట్లు పెంచేశారు. ఈ రెండు నెలల్లో జరిగే పెళ్లిళ్లకు దాదాపు ఆరుకోట్ల రూపాయల వ్యాపారం జరగవచ్చని మ్యారేజ్ ఈవెంట్ల నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

6

నేడు కార్తీక పౌర్ణమి

- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- లక్ష దీపోత్సవానికి సర్వం సిద్ధం


కార్తీక లక్ష దీపోత్సవానికి ముస్తాబైన నెల్లూరులోని గణేష్ ఘాట్

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి విశిష్టమైంది. ఆ రోజున శివకేశవు లను పూజిస్తే సర్వ పాపాలు తొలగి, సిరి సంపదలు కలుగుతాయని పురాణ కథనం. శుక్రవారం ఉదయం 6.19 గంటల నుంచి శనివారం తెల్లవారు జామున 2.58వరకు పౌర్ణమి ఘడియలు ఉంటాయి. ఉదయం 6.44 నుంచి 10.48 గంటల మధ్య మంచి ముహూర్తం ఉంది. కేదారేశ్వర వ్రతం, చలిమిడివ్రతం, కార్తీక దీప వ్రతాలను ఆచ రించవచ్చని పండితులు పేర్కొన్నారు. సాయంత్రం దీపదానాలు, చంద్రదర్శనం, కార్తీక వనభోజనాలు చేయవచ్చని వివరించారు.

● ఆలయాల్లో ఏర్పాట్లు

జిల్లాలోని అన్నీ శివ, వైష్ణవ ఆలయాల్లో కార్తీక పౌర్ణమికి భారీ ఏర్పాటు చేశారు. నగరంలో ఆలయాలతోపాటు స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్ద కార్తీక లక్ష దీపోత్సవానికి సర్వం సిద్ధం చేశారు.. భక్తులకు ఎండ,వాన తగలకుండా ప్రత్యేక షామియానాలు వేశారు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగనున్నది. ఉదయం 6 గంటలకు గోపూజ, రుద్రహోమం, రుద్రాభిషేకాలు జరుగుతాయి. సాయంత్రం 5గంటలకు సింహపురి మహిళల కార్తీక దీప శోభాయాత్ర, మహారుద్ర హోమం, గంగా హారతులు, లక్ష దీపోత్సవం, అనంతరం 108 తెప్పలతో శివలింగాకారం నిర్వహించనున్నారు. జిల్లా దేవదాయశాఖ ఆధ్వర్యంలో గణేష్ ఘాట్ వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం ప్రసాదవినియోగం ఉంటుంది.

జిల్లా వ్యాప్తంగా
సీపీఎం ప్రదర్శనలు

● కలెక్టరేట్ వద్ద ధర్నా ● ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి
● జిల్లా కార్యదర్శి మూలం రమేష్



నెల్లూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు (వైద్యం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా గురువారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు గురువారం ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా నెల్లూరు నరగంలో సీపీఎం నేతలు భారీ ప్రదర్శన నిర్వహించారు. గాంధీబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు సాగిన ప్రదర్శన అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సంద ర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లా డుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థల ను, వనరులను, సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడు తున్న దని దుయ్యబట్టారు. జమిలి ఎన్నికల వల్ల నియంతృ త్వానికి దారితీసే అవకాశం ఉందన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టసవ రణలు, జమిలి ఎన్నికల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం విరమిం చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో రూ. 17వేల కోట్లు ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లా డుతూ కృష్ణా పట్నం కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరిం చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, నాగేశ్వర రావు , షేక్ మస్తాన్‌బీ, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో స్టాళ్లు, హోటళ్ల నుంచి అధికారులకు నెల మామూళ్లు
డ్రైవర్లకు, సమావేశాలు, స్పోర్ట్స్‌మీట్‌లకు కూడా ఉచితంగా భోజనం
ప్రయాణికులపై అధిక ధరల భారం

ముద్ద పెట్టి..
ముడుపులివ్వాల్సిందే !

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్టీసీ రీజియన్ పరిధిలోని బస్టాండ్లలో అధికారుల వసూళ్ల దందా జోరుగా కొనసాగుతోంది. వివిధ స్టాళ్ల యాజమానులు అధికారులకు నెల మాముళ్లు ఇస్తూ ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులపై అధిక ధరల భారం పడుతున్నది. మొత్తం మీద ఆర్టీసీలో అధికారులు, స్టాళ్ల యాజమానులు అంతా కూడా నాలుగు రూపాయలు వెనుక వేసుకుంటూ సంతోషంగా ఉన్నారుకానీ, ప్రయాణికులు మాత్రం దోపిడీకి గురవుతున్నారు.

● ఎంతకైనా అమ్ముకోండి...

ఆర్టీసీ నెల్లూరు రీజియన్ పరిధిలో 315 స్టాళ్లు ఉండగా, వాటిలో 28 స్టాళ్లు ఖాళీగా ఉన్నాయి. ఐదు హోటళ్లు ఉన్నాయి. బస్టాండుల్లో స్టాళ్లు పొందే వ్యాపారులు టెండర్ల ద్వారా డిపాజిట్ చెల్లించి వాటిని పొందుతారు. అయితే ఆర్టీసీ బస్టాండ్‌లో స్టాల్స్‌కు బాడుగ ఎక్కువగా ఉంటుంది. నెల బాడుగ చెల్లించేందుకు వ్యాపారులు నానా అవస్థలు పడుతుంటారు. ఈ క్రమంలోనే ఆర్టీసీ అధికారులు 'ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్ముకోండి.. స్టాళ్లకు కేటాయించిన పరిధికంటే ఎక్కువగా బస్టాండు ప్రాంగణంలోకి పెట్టుకోండి...నిషేధిత వస్తువులను ఏవైనా విక్రయించుకోండి.. అయితే మా మాముళ్ల మాకు ఇచ్చేయండి' అంటూ ఆఫర్లు ఇస్తున్నారు. దీంతో చేసేది లేక స్టాళ్ల యాజమానులు నెల నెలా అధికారులకు మామూళ్లు ఇస్తూ అధిక ధరకు వస్తువులను ప్రయాణికులకు అమ్ముతున్నారు. డీఎం నుంచి ఆర్ఎం స్థాయి వరకు, విజిలెన్స్ కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం.

● హోటళ్లలోనూ దందా

ఆర్టీసీ బస్టాండ్లల్లోని హోటళ్లలో సహజంగానే ధరలు అధికంగా ఉంటాయి. అంతేకాక తినుబండారాలు, భోజనంలో నాణ్యతా లోపం, నిల్వ పదార్థాలు.. ఇలా అనేక లోటుపాట్లు ఉంటాయి. అయితే ఆర్టీసీ అధికారులు డిపోల వారీగా హోటల్‌కు రూ.10 వేలు చొప్పున నెల మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు డ్రైవర్లకు 20 శాతం రాయతీతో భోజనం పెట్టాల్సి ఉండగా ఫ్రీ భోజనం పెట్టాలన్న

- మిగతా 6లో



నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని హోటల్

యువశక్తే ఆయుధం

కావలిటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): దేశానికి యువ శక్తే గొప్ప ఆయుధమని కేంద్ర రక్షణశాఖమంత్రి సాంకేతిక సలహాదారు జీ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కావలిలోని జేబీ డిగ్రీ కళాశాల ఎంఎం హాల్ లో సతీష్‌రెడ్డికి విశ్వోదయ జీవితకాల సభ్యత్వాన్ని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి చేతుల మీదుగా అందచేశారు. అనంతరం విశోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆయన్ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో 4.35 కోట్లమంది యువత ఉన్నారని, దేశం బలంగా, సుసంపన్నంగా ఉండాలంటే విద్య, విజ్ఞానంతోనే సాధ్యమన్నారు. విద్యను ప్రసాదించాలన్న ఆశయం కలవారం తా గొప్పవారని అన్నారు. విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు దొడ్ల రామచంద్రా రెడ్డి ఆకోవకు చెందిన వారేనని పేర్కొన్నారు. అంకితభావంతో పని చేస్తే లక్ష్యాలు చేరుకోవడం సులువవుతుందన్నారు. తాను దేశానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ప్రతిఒక్కరూ ఉండాలని, ఆదిశగా కృషి చేయాలని పూర్వరాష్ట్రపతి అబ్దుల్ కలామ్ అంటుండేవారని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, జేబీ కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, పలువురు అధ్యాపకులు విద్యార్థులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డికి 'విశ్వోదయ' జీవితకాల సభ్యత్వం


డాక్టర్ సతీష్‌రెడ్డికి విశ్వోదయ జీవితకాల సభ్యత్వం అందచేస్తున్న కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, రెక్టార్ వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు


నెల్లూరులో కురుస్తున్న వర్షం

వదలని వాన

● మూడు రోజులుగా తెరపివ్వని వర్షం ● జనజీవనం అస్తవ్యస్తం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల నుంచి జిల్లాలో వర్షం కురుస్తూనే ఉంది. గురువారం ఉదయం కొంతసేపు ఎండకాసినా మళ్లీ భారీగా వర్షం పడింది. దీంతో రోడ్లపై నీరు చేరింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. జనజీవనం అస్తవ్యస్తమైంది. నెల్లూరు నగరంలో వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జిలు నిండుకున్నాయి. అధికారులు అప్రమత్తమై నీటిని తోడేశారు. ఇళ్ల ముందు మురుగు కాలువల్లో చెత్త పేరుకుని ఉండ టంతో వర్షపు నీరు ముందుకుకదలటం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కూడా వర్షం కురిసింది. వాగులు, వంకలు ప్రవహించాయి. పలు చెరువుల్లో నీరు చేరింది.


నెల్లూరు : అరవింద్ నగర్‌లో రైల్వేట్రాక్ కింద చేరిన వర్షపు నీరు

● సగటు వర్షపాతం 25.7 మిమీ :

జిల్లాలో గురువారం సగటు వర్షపాతం 25.7 మి.మీగా నమోదైంది. జిల్లాలో అత్యధికంగా దగదర్తిలో 75.4 మి.మీ, అత్యల్పంగా రాపూరులో 2.2 మిమీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు.. బోగోలు 35.4, ఏఎస్‌పేట 24, విడవలూరు 6, ముత్తుకూరు 14.2, కొడవలూరు 4, సీతారాంపురం 22.8, దుత్తలూరు 22.8, టీపీగూడూరు 27.4, బుచ్చి 15, ఉదయగిరి 28.4, వింజమూరు 20.2, సంగం 58.6, నెల్లూరు అర్బన్ 7.8, నెల్లూరు రూరల్ 6.4, వెంకటాచలం 14.8, మర్రిపాడు 16.2, ఇందుకూరుపేట 7.2 మనుబోలు 9.2, కావలి 65.4, జలదంకి 44.2, అల్లూరు 41, సైదాపురం 16.6, పొదలకూరు 4.6, కందుకూరు 48.4, కలిగిరి 21.8, ఆత్మకూరు 51.2, కోవూరు 27.2, వలేటివారి పాళెం 21.8, ఉలవపాడు 44, లింగసముద్రం 12.4, గుడ్లూరు 32.2, వరికుంటపాడు 4.2, కొండాపురం 17, చేజర్ల 20.4, అనంతసాగరం 41, కలువాయి 47.2 మి.మీ వర్షపాతం నమోదైంది.


చిట్టమూరు : తాళ్లూరులో పొంగి పొర్లుతున్న వాగు


ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లిలో నేలకొరిగిన వరిపైరు



ఈ మార్గంలో మనుషులు నడిచేదెలా..?

పట్టణంలో ప్రధాన కూడలికి అనుసంధానంగా ఉన్న మల్లితోట అంతర్గత రహదారి అధ్వానంగా ఉంది. చిన్న వర్షం పడినా బురదమయంగా మారుతుంది. ఈ మార్గం వ్యాపార సముదాయప్రాంతం కావడంతో నిత్యం వందలాది మంది ఈ రహదారిలో నడవాల్సి వస్తుంది. ఈ మార్గంలో నడవడం ఎలా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)



చినుకు రాలితే చిత్తడే !

పట్టణంలోని పేదలు నివసించే కాలనీల్లో చినుకు రాలితే చిత్తడిగా మారుతుంది. స్థానిక బాలక్రిష్ణారెడ్డి నగర్, ముసునూరు ఇందిరమ్మ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, అట్లపఫ్యాక్టరీ కాలనీ, వినాయక కాలనీలు మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షానికి జలమయమయ్యాయి. అంతర్గత రోడ్లు, మురుగునీటి కాలువలు లేకపోవటం తో వర్షపు నీరు, మురుగునీరు మొత్తం రోడ్డుపై నిల్వ చేరి బురదమయంగా మారాయి.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



పవిత్రోత్సవాలు పరిసమాప్తం

వేదగిరి క్షేత్రంలో జరుగు తున్న పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు విశేష పూజలు, హోమాల అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. లక్ష్మీ నృసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు జరిగే నిత్య కైంకర్యాలు, ఉత్సవాల్లో దోషాల నివృత్తికి ఏటా ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. వైఖానస ఆగమ విద్వాన్ డాక్టర్ పీ సత్యనారాయణ చార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరా చార్యులు నేతృత్వంలో ఉత్సవాలు జరిగాయి. ఈవో గోపి పర్యవేక్షించారు. కార్యక్ర మంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నాయకులు మదన్ కుమార్‌రెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



పొదలకూరులోని సంగం రోడ్డు కూడలిలో వనభోజనాల్లో భాగంగా శమీవృక్షానికి పూజలు

వనంలో జనం

- కార్తీకమాసంలో వనభోజనాలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి
- నిర్వహణకు కులసంఘాలు, ఉద్యోగుల ఆసక్తి

సంప్రదాయం

పొదలకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఎంతో విశిష్టమైనదని పురాణాలు చెబుతున్నాయి. ఈ నెలలో ప్రజలు భక్తిశ్రద్ధలతో శివకేశవులను ఆరాధిస్తారు. ఈ మాసంలోనే వనభోజనాలకు ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది. వివిధ కులసంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఎన్నోఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. వనభోజనాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహిస్తుంటారు. కొన్నేళ్ల క్రితం కార్తీక వనభోజనాలను కుటుంబ సమేతంగా నిర్వహించుకునేవారు. కాలక్రమేణా సామాజిక వర్గాలు, ప్రభుత్వశాఖలు, స్వచ్ఛంద సంస్థలు, కులసంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కార్తీక వన భోజనాలు మొదట్లో ఎక్కువగా గ్రామ శివారు ప్రాంతాలు, మామిడి తోపులు, ఇతర ఉద్యానవనాల్లో కొనసాగేవి. ఆ తర్వాత నగరవనం, వివిధ ఫంక్షన్ హాళ్లు, ఆలయాల నిర్వహిస్తున్నారు. వనభోజనాలు ఎక్కువగా ఆదివారం, ఇతర సెలవురోజుల్లో నిర్వహిస్తారు.

ఆహ్లాదకర వాతావరణంలో..

కార్తీకమాసంలో ప్రతిరోజూ పవిత్రమైనదే. ఈ నెలంతా వన భోజనాలు నిర్వహిస్తుంటారు. పిల్లల కేరింతలు, యువత కోలాహలం, మహిళల ఆట పాటలతో ఆయా ప్రాంతాలు సందడిగా ఉంటాయి. వినోదం పంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేస్తారు. కార్తీక వనభోజన కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపిస్తూ ఉంటుంది.

సరికొత్త పరిచయాలు

ఈ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా వస్తుంటారు. ఈ నేపథ్యంలో కొత్త పరిచయాలు ఏర్పడుతాయి. అప్పటి వరకు ముఖ పరిచయం లేకపోయినా వనభోజనంలో అందరూ ఒక్కటవుతారు. కొన్ని ప్రాంతాల్లో వధూవరుల పరిచయ వేదికలను సైతం నిర్వహిస్తుంటారు. పదో తరగతి, ఇంటర్, ఆపై చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి, వారికి నగదు బహుమతులను అందచేస్తుంటారు. అంతేకాక ఆయా సామాజికవర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేదోడుగా నిలుస్తున్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు గుర్తించి ఆదుకుంటున్నారు.



వనభోజనాలు చేస్తున్న పట్టణవాసులు

రామయ్య తలంబ్రాల తయారీలో పాల్గొనండి!

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని సీతారామచంద్రస్వామికి శ్రీరామనవమి సందర్భంగా జరిగే కల్యాణోత్సవం కోసం తలంబ్రాలు తయారు చేసే కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని మూలాపేటకు చెందిన శ్రీరామభక్తుడు ఎస్‌వీ విజయకుమార్ ఓ ప్రకటనలో కోరారు. రామచంద్రుని కల్యాణ తలంబ్రాల కోసం గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా వరి పండిస్తారని తెలిపారు. ఆ ధాన్యాన్ని భక్తులు శ్రీరామ నామస్మరణతో గోటితో వలిచి బియ్యం తయారు చేస్తారని తెలిపారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు గోటితో వలిచి తయారు చేసిన బియ్యాన్ని కల్యాణ తలంబ్రాలుగా వాడుతారన్నారు. జిల్లాలో ఆసక్తి ఉన్నవారు 93904 26999 నెంబరును సంప్రదించాలని కోరారు.



ఇద్దరు ఒకటయ్యే వేళ..

- కల్యాణం.. కమనీయం
- ఈనెల, వచ్చేనెలలో దండిగా ముహూర్తాలు
- జిల్లాలో దాదాపు 90వేల వివాహాలు
- సుమారు రూ.ఆరుకోట్ల వ్యాపారం

మూడుముళ్ల పంట

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివరినెలలయిన నవంబరు, డిసెంబరు మాసాల్లో సుమారుగా 20 రోజులకుపైగా శుభముహూర్తాలు ఉన్నాయి. ఈ ముహూర్తాలలో సుమా రు 90వేల జంటలు ఒకటి కానున్నాయి. దీంతో జిల్లా అంతా శ్రీరస్తు.. శుభమస్తు .. కల్యాణమస్తు అంటూ బ్యాండ్‌మేళాల మోతలు మోగను న్నాయి. నవంబరులో 16, 17, 18, 22, 23, 25, 26, 28, 29 వివాహ మూహూర్తాలు ఉన్నాయి. 17, 18తేదీల్లో అత్యధిక అత్యధిక వివాహాలు జరగనున్నట్లు పురోహితులు తెలిపారు. డిసెంబరులో 2, 3, 4, 5, 9, 10, 11, 13, 14, 15తేదీల్లో వివాహ మహూర్తాలు ఉన్నాయి. ఆ నెలలో 6, 7, 8, 11, 13తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉన్నాయి. ఈ ఐదురోజుల్లో మామూలు డిమాండ్ కంటే రెండు రెట్లకుపైగా పెళ్లిళ్ల జరగబోతున్నాయి.

ముందుగానే బుకింగ్

జిల్లాలో కల్యాణ మండపాలు, మినీ ఫంక్షన్ హాళ్లు, సత్రాలు, ఆలయాలు అన్ని కలిపి దాదాపు మూడు వేలకుపైగా వివాహ వేదికలు ఉన్నాయి. ఈ వేదికలన్నీ మూడు నెలలు ముందుగానే బుక్ అయిపోయాయి. 2025లో జరుగబోయే వివాహాలకు మార్చి వరకు వివాహ వేదికలు అక్టోబరులోనే బుక్ అయిపోయాయి. దీంతో జిల్లావ్యాప్తంగా కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పదేళ్ల క్రితం ఉన్న కల్యాణ వేదికలకు ప్రస్తుతం మూడు రెట్లు పెరిగినా, డిమాండ్ ఇంకా ఉంది. వివాహం అంటే కూలీల దగ్గర నుంచి పురోహి తులు వరకు దాదాపు 36 వ్యవస్థలతో ముడిపడి ఉంది. అన్ని అందు బాటులో ఉండి జరిగే వివాహాలు కనువిందు చేస్తాయి. ఒకేసారి ము హూర్తాలు రావడంతో డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది కల్యాణ మండ పాలు, పురోహితులు, మేళగాళ్లు, డేకరేషన్, ఫొటో షూటర్లు, హోటళ్లు, క్యాటరింగ్‌లు ఈ సంవత్సరం పెళ్లిళ్ల సీజన్‌కి గతం కంటే దాదాపు 30 నుంచి 50 శాతం మేర రేట్లు పెంచేశారు.

పెరిగిన ఖర్చు

సామాన్య కుటుంబంలో ఓ వివాహం జరగాలంటే, కనీసం రూ. 3నుంచి రూ. 4.50లక్షలు దాటుతోంది. కోటీశ్వర్ల వివాహాలకు రూ. కోటి నుంచి రూ.2కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారని మండప నిర్వాహ కులు తెలియజేస్తున్నారు. వివాహ ఖర్చులు కులమతాలకు తేడా లేకుండా అన్నీ వర్గాల్లోనూ పెరిగిపోతుంది. వివాహాలకు ఈ రెండు నెలల్లో సుమారు ఆరుకోట్ల రూపాయల వ్యాపారం జరగవచ్చని మ్యా రేజ్ ఈవెంట్ల నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

తప్పని నిరీక్షణ

- ప్రారంభం కాని రేషన్, పింఛన్ దరఖాస్తుల ప్రక్రియ
- గత వైసీపీ పాలనలో నిలుపుదల
- 8 నెలలుగా అర్హుల పడిగాపులు
- కూటమి ప్రభుత్వంలోనూ సాగదీత

సంగం, (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరు కోసం అర్హులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయినా ఇప్పటి వరకూ వాటి ఊసే లేదు. దీంతో అర్హులైన పేదలు వాటి కోసం ఎదురుచూస్తున్నారు. వైసీపీ హయాంలో ఆకారణంగా రేషన్ కార్డులు, పింఛన్లు కోల్పోయిన వారు, ఇటీవల వివాహమై అర్హత కలిగిన కొత్త దంపతులు తిరిగి పొందడం కోసం కూటమి ప్రభుత్వం వైపు ఆశగా చూస్తున్నారు.

కార్డు కోసం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ ఒక్కసారిగా రూ. 3 వేల నుంచి 4 వేలకు పెంచింది. దీపం -2 పథకం అమలు చేస్తున్నారు. దీంతోపాటు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. వీటిలో ఏ పథకం పొందాలన్నా రేషన్‌కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంది. దీంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో ఎక్కువమంది గత వైసీపీ ప్రభుత్వం తొలగించిన పింఛనుదారులు, కార్డుదారులే ఉన్నారు. వారికి తోడు వైసీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్నా కార్డులు రాని వారు, తాజాగా అర్హత పొందినవారు చాలా మందే ఉన్నారు. వారంతా ఇప్పుడు పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే గత మార్చిలో వచ్చిన ఎన్నికల కోడ్ కారణంగా దరఖాస్తుల ప్రక్రియ ఆగిపోయింది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు పూర్తయినా దరఖాస్తుల ప్రక్రియకు శ్రీకారం చుట్టలేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే రేషన్ కార్డులు, పింఛన్ మంజూరుకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించాలని కోరుతున్నారు.

పింఛన్ కోసం ఎదురుచూస్తున్నాం



నా భర్త జనవరిలో చనిపోయాడు. మాది పేద కుటుంబం. ముగ్గురు పిల్లలు. పోషణ జరగడం కష్టంగా ఉంది. మగ్గం నేసి జీవనం సాగిస్తున్నాం. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేదామంటే సచివాలయానికి ఎప్పుడు వెళ్లినా వెబ్‌సైట్ వదల లేదని చెప్పుతున్నారు. పది నెలలుగా ఎదురుచూస్తున్నాం.

- జే నిర్మల, సంగం

రేషన్ కార్డు రద్దు



గత వైసీపీ ప్రభుత్వంలో కరంటు బిల్లు ఎక్కువ వచ్చిందని రేషన్ కార్డు రద్దు చేశారు. నా మీటరుకు వేరే వారి ఆధార్ నెంబరు లింక్ కావడంతో బిల్లు ఎక్కువగా వచ్చింది. దీంతో రేషన్‌కార్డు రద్దు చేశారు. సరిచేసినా రేషన్‌కార్డు పునరుద్ధరించలేదు.

- పి. ప్రసాద్, సంగం



మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి రమేష్‌బాబు

తూ తూ మంత్రంగా శిక్షణ తరగతులు

వలేటివారిపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండలస్థాయి శిక్షణతరగతులు తూతూమంత్రంగా జరిగాయి. ఉదయం 9గంటలకు ప్రారంభం కావల్సిన కార్యక్రమానికి సభ్యులు, అధికారులు ఆలస్యంగా రావడంతో 11-30 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 6గంటల వరకూ జరగాల్సిన శిక్షణా తరగులు మధ్యాహ్నం రెండు గంటలకే ముగించారు. మండలంలో 21మంది సర్పంచ్‌ల్లో నలుగురు, 10మంది ఎంపీటీసీల్లో ఒక్కరు మాత్రమే వచ్చారు. జడ్పీటీసీ కూడా శిక్షణా తరగతులకు హాజరు కాలేదు. వివిద శాఖల్లోని 20మందిలో ఒక్క మండలస్థాయి, 31మంది వీఓఏల్లో కూడా హాజరుకాలేదు. కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు మాత్రమే వచ్చారు. మొక్కుబడిగా శిక్షణా తరగతులు నిర్వహిస్తే పంచాయతీలు ఎలా అభివృద్ధి చెందుతాయని ప్రజలు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వెంగమాంబ పల్లకీ సేవ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ పల్లకీ సేవను గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మక ర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక చందన అలంకారం, కుంకు మార్చన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పలకీసేవ చేపట్టారు.

నేడు కార్తీక పౌర్ణమి మహోత్సవం

వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వా హణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కల్యాణోత్సవం, పూజా కార్యక్రమాలతోపాటు భక్తులకు వనభోజనం, సాయంత్రం లక్ష దీపాలతో దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. అలాగే దుత్తలూరు కొండమీద ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం, ఉదయగిరి మండలం గండిపాళెం జలాశయం వద్ద ఉన్న శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పెన్నమ్మకు గౌతమి పలకరింపు

(5వ పేజీ తరువాయి)

ఇదే జరిగింది. ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో సగం ఆయకట్టులో కూడా సాగు జరగలేదు. అయితే గోదావరి-పెన్నా నదుల అనుసంధానంతో బీడు అనే మాట శాశ్వతంగా తొలగిపోతుంది. ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల పరిధిలో 7.76 లక్షల ఎకరాల రిజిస్టర్ ఆయకట్టు ఉంది. గోదావరి నీటిని ఏటా తీసుకురాగలిగితే ఈ ఆయకట్టును మరింత పెంచుకు నేందుకు అవకాశం కలుగుతుంది. అప్పుడు ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల్లోని భూములను కూడా ఆయకట్టు పరిధిలోకి తెచ్చుకోవచ్చు.

ఇదీ మార్గం..!

కృష్ణానదికి భారీ వరదలు వచ్చినప్పుడు మాత్రమే శ్రీశైలం నుంచి జలాలను సోమశిలకు మళ్లించగలు గుతున్నారు. శ్రీశైలం జలాశయం వద్ద పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కృష్ణా జలాలను మళ్లించి బనకచర్ల వరకు తీసుకువస్తున్నారు. అక్కడి నుంచి వెలుగోడు, కేసీ కెనాల్‌తో పాటు నిప్పుల వాగుకు మళ్లిస్తున్నారు. నిప్పులవాగు నుంచి కుందూ నదిలోకి కృష్ణాలు చేరుతుండగా, కుందూ నది నేరుగా పెన్నాలో కలుస్తోంది. పెన్నాలోకి వచ్చాక నేరుగా సోమశిలకు చేరుతున్నాయి. మొత్తంగా పోతిరెడ్డిపాడు నుంచి సుమారు 200 కిలోమీటర్లు పయనించి కృష్ణా జలాలు సోమశిలకు చేరుతున్నాయి. ఇప్పుడు గోదావరి నీటిని కూడా ఇదే మార్గంలో పెన్నాలోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. తొలుత పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి ప్రకాశం బ్యారేజీకి నీటిని తీసుకువస్తారు. ప్రకాశం బ్యారేజీకు పైనున్న వైకుంఠపురం నుంచి కాలువ ద్వారా గుంటూరు జిల్లాలోని బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి నల్లమల అడవుల మీదుగా కాలువ మార్గంలో కర్నూలు జిల్లాలోని బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు తీసుకొస్తారు. ఇక్కడి నుంచి కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలకు గోదావరి నీటిని ఇప్పటికే ఉన్న మార్గాల్లో మళ్లించాలని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం చర్చల దశల్లో ఉండగా త్వరలోనే ఫైనల్ చేసే అవకాశాలున్నట్లు ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే గోదావరి-పెన్నా అనుసంధానం ప్రాజెక్టుకు టెండర్లు పిలిచే ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పుకుంటున్నారు.

ముద్ద పెట్టి.. ముడుపులివ్వాల్సిందే !

(5వ పేజీ తరువాయి)

ఆదేశాలు ఉన్నాయి. అంతేకాక తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులు ఆయా డిపోల్లో కదిలే సమయాన్ని బట్టి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల సమయంలో ఆయా జిల్లాల్లోని ప్రధాన బస్టాండ్లలోనే భోజనాలకు బస్సు నిలపాలన్న నిబంధనలు ఉన్నాయి. అయితే డ్రైవర్లు నిబంధనలు తుంగల్లో తొక్కి ప్రైవేటు హోటళ్ల వద్ద భోజనం ఉచితంతోపాటు రూ.200 చేతికి ఇస్తుండటంతో బైపాస్‌లపై బస్సులు నిలిపి భోజనం చేయిస్తున్నారు. దీంతో వేళకు రావాల్సిన బస్సులు రాకుండా, బస్సులోని ప్రయాణికులను భోజనాలు చేయమని చెప్పడంతో ఇప్పటికే వేరే ప్రాంతాల్లో నిలిపి తినిపించారన్న సమాధానాలు ఇస్తున్నారని హోటల్స్ యజమానులు అంటున్నారు.అంతేకాక ఆర్టీసీ జరిగే అధికారుల సమావేశాలకు, స్పోర్ట్స్‌మీట్‌లకు ఉచితంగా భోజనాలు సరఫరా చేయాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో హోటళ్ల యజమానులు ఇక్కట్లు పడుతున్నారు.

గోప్యంగా సమాచారం

ఆర్టీసీలో జరిగే దందాలపై స్టాళ్ల, హోటళ్ల యజమానులు అక్కడ జరిగే అవినీతిపై గోప్యంగా ఆంధ్రజ్యోతికి సమాచారం మిచ్చారు. త్వరలోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు.

సాంకేతికత పెరిగినా.. తగ్గని పుస్తకం విలువ : డీఈవో

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సాంకేతిక విజ్ఞానం పెరిగినా పుస్తకం విలువ తగ్గలేదని, ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని డీఈవో బాలాజీరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నెల్లూరు రేబాలవారివీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో మాట్లాడుతూ నేటి డిజిటల్ ప్రపంచంలో మునిగిపోయిన పిల్లలకు సమాజంలో ఎలా జీవించాలో నేర్పించే గ్రంథాలయాలను పరిచయం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థులంతా ప్రతిరోజూ కొంత సమయం పుస్తకాల పఠనం కోసం కేటాయించాలని కోరారు. గాంధీ, నెహ్రూ, భగత్‌సింగ్ లాంటి ఎందరో మహనీయులు గ్రంథాలయాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సమాజంలో ఎలా జీవించాలో నేర్పించేవి గ్రంథాలయాల న్నారు. కలెక్టర్ ఆదేశాలతో సుమారు వందేళ్లకు పైగా చరిత్ర గల ఈ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఐ.పీఆర్ డీడీ కే .సదారావు మాట్లాడుతూ విద్యార్థులను గ్రంథాలయాల వైపు నడిపించాలని తెలిపారు. గతంలో అన్ని పాఠశాలల్లో గ్రంథాలయాలు, ఆట స్థలాలు గ్రంథాలయాలు ఉండేవని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయ ఏర్పాటుకు రూపకల్పన చేసిన మహనీయుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు అని గుర్తు చేశారు. మనజాతి సంపద గ్రంథాలయాలని, గ్రంథాలయాల పూర్వ వైభవానికి మరో ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా మాట్లాడుతూ నేటితరం విద్యార్థులందరూ పుస్తకాలకు పునరంకితం కావాలన్నారు. వారంపాటు జరిగే ఈ ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలని కోరారు. తొలుత ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి అతిథులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు అతిథులు మహాత్మాగాంధీ సత్యశోధన, ఆత్మకథ పుస్తకాలను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్ రామకృష్ణ, ఎన్‌ఆర్‌ఐ శ్రీనివాస్, విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగులు, పలువురు ప్రముఖులు తదిరులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు అందుకున్న చిన్నారులు

లింగసముద్రంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

లింగసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో 18ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ తెలిపారు. గురువారం ఆయన ఆరోగ్య సిబ్బందితో కలిసి స్థానికులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ అసంక్రమిత వ్యాధులు మధుమేహం, బీపీ, రొమ్ము క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌పై ముందస్తు పరీక్షలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలకు పుట్టుక లోపాలతో వచ్చే వ్యాధులు, ఆహార లోపాలపై పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇంటి వద్దే నిర్వహించే ఈ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఉలవపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయాల పరిధిలో ఎన్‌సీడీసీడీ క్యాన్సర్ లక్షణాలపై గురువారం కరేడు వైద్యాధికారి శ్రీనివాసరావు సిబ్బందితో ఇంటింటి సర్వే చేపట్టారు. 18ఏళ్లు నిండిన వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి సలహాలు అందజేశారు. బీపీ, షుగర్ పరీక్షలు ప్రతి శుక్రవారం, మంగళవారాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటి వద్దనే పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు స్వాతి, దివ్యత, ఏఎన్‌ఎం పద్మా, గోవిందమ్మ పాల్గొన్నారు.



ఉలవపాడు : వృద్ధుడి గొంతు పరీక్షిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

నిదరోతున్న నిఘా నేత్రాలు

కలిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కావలి, ఉదయగిరి, కందుకూరు, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లడానికి కలిగిరి ప్రధాన కూడలిగా ఉంది. అయితే పట్టణ పరిధిలోని కలిగిరమ్మ, తహసీల్దారు కార్యాలయం కూడళ్లలో ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు(సీసీ కెమెరాలు) కొంతకాలంగా పనిచేయడం లేదు. ఫలితంగా నిఘా కొరవడింది. సుమారు ఐదేళ్ల క్రితం పోలీసులు పట్టణంలోని రెండుచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, ఈవ్‌టీజింగ్, గొడవలు జరిగినపుడు సీసీటీవీ కెమెరాల పుటేజ్‌లను పరిశీలించేందుకు కంట్రోల్ వ్యవస్థను స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. వీటి పనితీరుపై పోలీసులు దృష్టి సారించక పోవడంతో ప్రస్తుతం నిఘా కొరవడింది.

కొత్తవి ఏర్పాటు చేస్తాం..



పట్టణ సీసీ కెమెరాలు ప్రస్తుతం పనిచేయడంలేదు. దాతలు, స్థానికుల సహకారంతో పాతవాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి, వాడుకలోకి తీసుకువస్తాం.

-ఎస్ఐ ఉమాశంకర్



కలిగిరి-సంగం కూడలిలో పనిచేయని సీసీ టీవీ కెమెరాలు

లాంగ్‌జంప్‌లో 'ప్రకాశం' విద్యార్థినికి ప్రథమస్థానం

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలో లాంగ్‌జంప్‌లో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని సౌజన్య ప్రథమస్థానంలో నిలిచింది. త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు యూనివర్సిటీ తరపున క్రీడాకారుల ఎంపిక కోసం నిర్వహించిన పోటీలలో సౌజన్య విశేష ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచిందన్నారు. 100 మీటర్ల పరుగుపందెంలోను ఆమె నాలుగోస్థానంలో నిలిచిందని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

● కట్టా శ్రీనివాసులు, ఎంపీడీవో, లింగసముద్రం



లింగసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అలాగే ఉపాధిహామీ పథకం పనులతో 80శాతం కూలీలకు ఉపాధి కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు.

ముఖాముఖి

? ఏ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

! 14గ్రామ పంచాయతీలలో రూ.3కోట్లతో సీసీ రోడ్లు వేయిస్తున్నాం.

? ఉపాధిహామీ పనులు ఎలా జరుగుతున్నాయి?

! ప్రతిరోజూ 2000 మందికి పైగానే ఉపాధి కల్పిస్తున్నాం. బోగస్ మస్టర్లు లేకుండా చర్యలు తీసుకున్నాం.

? జ్వరాలు రాకుండా ఏ చర్యలు చేపట్టా రు ?

! గ్రామాలలో జ్వరాలు వ్యాపించకుండా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో బ్లీచింగ్ చల్లిస్తున్నాము. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయిస్తున్నాం. రెండు, మూడు రోజులలో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

? పింఛన్ల పంపిణీ ఎలా ఉంది ?

! సచివాలయ సిబ్బందితో మొదటి రోజే 96 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నాం. ఈ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేవు.

ఊరూరా ఘనంగా బాలల దినోత్సవం

కందుకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం. నరసింహమూర్తి ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీక్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక కృష్ణనగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వాటర్‌బాటిల్స్, బాల్స్, బిస్కెట్‌ప్యాకెట్లు పంపిణీ చేశారు.

● వలేటివారిపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లె, బడేవారిపాలెం, అత్తింటివారిపాలెం, పోకూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం బాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి టీచర్లు పూలమాలలు వేసి నివాళులప్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లె, బడేవారిపాలెం, అత్తింటివారిపాలెం, పోకూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం బాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి టీచర్లు పూలమాలలు వేసి నివాళులప్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఉలవపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాయలంలో గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు చిన్నారులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారికి స్వీట్లు పంచిపెట్టారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ గోపిచంద్ ప్రకాష్, లెక్చరర్లు, విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కందుకూరు : వాటర్‌బాటిల్స్, బిస్కెట్‌ప్యాకెట్లు అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు



వలేటివారిపాలెంలో నివాళులర్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత



ఉలవపాడు: నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు, చిన్నారులు

ప్రజా సమస్యలపై సీపీఎం పోరుబాట

గుడ్లూరు, నవంబరు 14: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి గురువారం స్థానిక మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ట్రూ ఆఫ్ చార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా, ప్రభుత్వమే భరించాలన్నారు. అలాగే పెరిగిన నిత్యవసర ధరలను తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లను బిగించరాదన్నారు. ఉచిత ఇసుక పేరుతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుందన్నారు. ఇసుక అందించే విషయంలో ప్రభుత్వం పారదర్శకత పాటించాల్సి ఉందన్నారు. స్థానిక మెయిన్ బజార్ లోని ఆక్రమణలను వెంటనే తొలగించాలని, చెమిడిదెపాడు వద్ద ఎలికేరుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, గుడ్లూరు 832 సర్వే నెంబర్‌లోని గిరిజనులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గంధర్వ గిరిజన కాలనీలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నేతలు గుత్తి మల్లికార్జున, కొట్టే వెంకయ్య, పాలకీర్తి నాగేశ్వరరావు, దామా కృష్ణయ్య, మద్దిశెట్టి జాలయ్య, ఎం.వెంకటేశ్వర్లు, వర్ధినేని సిద్దయ్య, కొప్పోలు నారాయణ, సుంకరి విజయలక్ష్మి, దాసరి సీతారామయ్య, చేవూరి రాజగోపాల్ ఉన్నారు.

● ఉలవపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ మాట్లాడారు.

మండలంలోని గిరిజన కాలనీవాసులకు అనేకమందికి ఆధార్ కార్డులు లేవన్నారు. ఈ సమస్యతో ప్రభుత్వ సంక్షేమ పథకాలలకు గిరిజనలు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సింహాద్రికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌డీ గౌస్‌బాషా, గంజి శ్రీనివాసులు, పోట్టూరి రవి, కత్తి తాతయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, రామయ్య పాల్గొన్నారు.



ఉలవపాడు తహసీల్దారు కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు



గుడ్లూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

లింగసముద్రం మండలంలో మోస్తరు వర్షం

● పలు పైర్లకు మేలు చేస్తుందంటున్నరైతులు

లింగసముద్రం, నవబంరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులుగా ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం నుంచి గ్రామాలలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ వర్షాలు పొగనారుమడులు, పొగనాట్లు, మిరప నాట్లు, వరి నారుమడులుకు ఎంతో మేలు చేస్తుందని చెబుతున్నారు. బోర్ల ద్వారా నీరు పెట్టే ఖర్చు తగ్గిందంటున్నారు. తూనుగుంట, బ్రాహ్మణపల్లి, ఆర్‌ఆర్ పాలెం, మొగిలిచెర్ల తదితర గ్రామాలలో మిరపనాట్లు, పొగ నారుమడులు వీఆర్ కోట, విశ్వనాథపురం, మాలకొండరాయునిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం, మొగిలిచెర్ల గ్రామాలలో వరి నారుమడులు రాళ్లపాడు ఆయకట్టు గ్రామాలు చీమలపెంట, పెంట్రాల, అన్నెబోయినపల్లి, అంగిరేకులపాడు, చినపవని, పెదపవని గ్రామాలలో సాగు చేస్తున్నారు. అయితే ఈ వర్షాలు ఎక్కువైతే మినుము పైరు దెబ్బ తింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అంగిరేకులపాడు వద్ద సాగు చేస్తున్న వరి నారు

మండలిలో విప్ కంచర్ల శ్రీకాంత్‌కు అభినందనల వెల్లువ

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కంచర్ల శ్రీకాంత్ మండలిలో విప్‌గా నియమించబడిన సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వలేటివారిపాలెం మండలం అత్తంటివారిపాలెం నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన శ్రీకాంత్ చిన్న వయస్సులోనే రాజకీయంగా ఉన్నతస్థితికి ఎదిగాడని మంత్రి హోదా సాధించటం అభినందనీయమని టీడీపీ నాయకులు ఇంటూరి రాజేష్, బెజవాడ ప్రసాద్, పి. సుబ్బారెడ్డి తదితరులు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్సీ, విప్ కంచర్ల శ్రీకాంత్

కూటమి ప్రభుత్వం మనుగడ సాగించడం కష్టం

● మాజీ మంత్రి కాకాణి

కావలి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి కూటమి ప్రభుత్వం ఐదేళ్ల పాలన కొనసాగించడం కష్టమని మాజీ మంత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఆయనతో కలిసి కాకాణి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపద్దపు హామీ లను నమ్మి కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారని ప్రభుత్వం నుంచి ప్రజలకు ఆశించిన పథకాల లబ్ధి చేకూరడం లేదన్నారు. తక్కువ కాలంలోనే ప్రభుత్వంపై విపరీతమైన అసంతృప్తి వచ్చిందని ఆరోపించారు. 2027లో జమిలి ఎన్నికలు రానున్నాయని ఈ ఎన్నికల్లో తిరిగి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం రావడం ఖాయమని జోస్యం చెప్పారు. పోలీసులు ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేయాలని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాకాణి

న్యూస్ బాక్స్

ఆటో ఢీ : యువకుడి మృతి

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కోవూరు రోడ్డులో గురువారం జనార్దనకాలనీకి చెందిన ఆంజనేయులు(40) వెనుక నుంచి వచ్చి ఆటో బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీకొట్టిన ఆటో కోసం స్థానికులు వెంబడించినా అతను వేగంగా వెళ్లి పరారీ అయ్యాడు. పట్టణ ఎస్ఐ సాంబశివయ్య ప్రమాదస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

వేరుశనగ యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ఉలవపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంట యాజమాన్య పద్ధతులపై గురువారం కందుకూరు కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు ప్రసాద్‌బాబు, వెంకటేష్‌లు గురువారం అలగాయపాలెం, టెంకాయచెట్లపాలెం, బట్టిసోమయ్య పాలెంలో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలను నిర్వహించారు. జాతీయ ఆహారభద్రతా మిషన్‌లో భాగంగా వేరుశనగలో ఖర్చు తగ్గించి అధిక దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నులిపురుగుల నివారణకు పిసిలోమైసిస్ జీవ పురుగు నాశిని, రైజోబీయం, పీఎస్‌బీ, కేఎస్‌బీ జీవన ఎరువులు, ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్ వంటి జీవ నాశినిలను రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ మందులను ఎంత మోతాదుల్లో వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీ, ప్రకృతి శిక్షకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ఉలవపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి పంచాయతీలు ప్రణాళిక సిద్ధం చేసుకొని అనుగుణంగా పనులు చేపట్టాలని ఎంపీడీవో ఎన్ విజయ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ఎంపీపీ వాయల మంగమ్మ అధ్యక్షతన ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థికసాయం

కందుకూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బూడిదపాలెంకు చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్‌కు వైద్యసహాయం కోసం టీడీపీ టీడీపీ మాజీఅధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు రూ.5వేల ఆర్థికసహాయం అందజేశారు. ఐఎఫ్‌సీ ఫౌండేషన్ ప్రతినిధులు చేసిన అభ్యర్థనతో సహాయం చేశారు.